అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 7-10-2019

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక : 281 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

ఉక్కుపాదం...!!

పట్టుదలతో ఆర్టీసీ కార్మికులు.. రెండోరోజూ సమ్మె విజయవంతం

ఆర్టీసీ కార్మికుల సమ్మెపై సర్కారు కన్నెర్ర చేసింది. ఉద్యోగాలు ఊడబీకి, కొత్త రిక్రూట్‌మెంట్లు చేయండని సీఎం కేసీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో తమిళనాడులో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత ఇదే తరహాలో లక్షమందికి పైగా ప్రభుత్వ ఉద్యోగుల్ని 'ఎస్మా' చట్టం ప్రయోగించి తొలగించింది. ఇప్పుడు అదే వైఖరిని తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఆర్టీసీ పరిరక్షణ కోసం 35 రోజుల క్రితం టీఎమ్‌యూ, ఎంప్లాయీస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, సూపర్‌వైజర్స్ అసోసియేషన్, టీజేఎమ్‌యూ వంటి సంఘాలు సమ్మె నోటీసులు ఇచ్చాయి. జేఏసీగా ఏర్పడి సమ్మె తేదీ ప్రకటించాయి. అప్పటి వరకు నిమ్మకు నీరెత్తినట్టు మిన్నకున్న ప్రభుత్వం సమ్మె తేదీకి మూడు రోజుల ముందు ఐఏఎస్‌ల త్రిసభ్య కమిటీ అంటూ హైడ్రామా నడిపించింది. సమ్మెను విరమింపచేయలేకపోయారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్ ఆ కమిటీని రద్దు చేశారు. ఆర్టీసీ కార్మికులు అనివార్యంగా సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితుల్ని ప్రభుత్వమే కల్పించిందని యూనియన్లు పేర్కొన్నాయి ఈ 35 రోజుల్లో సమ్మె విరమింపజేసేందుకు ఏమాత్రం చర్చలు జరపని ప్రభుత్వం తమపై ఉక్కుపాదం మోపుతున్నారని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జయలలిత బాటలో కేసీఆర్

- విధులనుంచి తొలగించాలని సీఎం ఆదేశాలు
- ఎక్కడిబస్సులు అక్కడే
- ఆటపాటలతో బతుకమ్మ ఆడిన కార్మిక కుటుంబాలు
- మద్దతిచ్చిన రాజకీయ పార్టీలు

ఆర్టీసీ సమ్మె వివరాలు 3,9,10 పేజీల్లో..

బర్కత్‌పుర డిపో వద్ద కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ఘనంగా సద్దుల బతుకమ్మ

నగరంలో అంబరాన్నంటిన సంబురాలు

- ఎల్బీస్టేడియంలో భారీసంఖ్యలో పాల్గొన్న మహిళలు

ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ వేడుకలు

వివరాలు 9లో

సీఎం వ్యాఖ్యలపై

రాజకీయ పార్టీల ఖండన

అహంకార పూరితం : సీపీఐ(ఎం)

- అప్రజాస్వామికం : సీపీఐ
- కక్షపూరితం : కాంగ్రెస్
- అవమానించడమే : టీడీపీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీసీ కార్మికుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులను తొలగిస్తున్నామని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అహంకారపూరితంగా వ్యాఖ్యానించడం దారుణమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం 'నవతెలంగాణ'తో చెప్పారు. సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ...9లో

పిడుగులుపడి ఆరుగురు మృతి

సిద్దిపేట జిల్లాలో ఒకేచోట ఇద్దరు..

- ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన మంత్రి హరీశ్‌రావు
- హైదరాబాద్‌లో కుండపోత వాన

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద

వివరాలు 9లో

కూలిన శిక్షణ విమానం

ఇద్దరు పైలెట్లు అక్కడికక్కడే మృతి

- వికారాబాద్ జిల్లా సుల్తాన్‌పూర్‌లో ఘటన

కూలిపోయిన శిక్షణ విమానం

వివరాలు 9లో

బండారు అచ్చమాంబ స్మారక రచనల పోటీ

మహిళల ఆత్మగౌరవాన్ని చాటుతూ కథలు రాసిన తొలి తెలుగు కథా రచయిత్రి బండారు అచ్చమాంబ (1874-18 జనవరి 1905). తెలుగులో మొదటసారిగా 'ధనత్రయోదశి' (1902) అనే కథని రచించారు. దాదాపు పన్నెండు కథలు రాసిన ఆమె స్త్రీ విద్య గురించి నొక్కివెప్పారు. అంతేగాక అనాథపిల్లల్ని చేరదీసి చదువు చెప్పించారు. తెలుగే కాక గుజరాతీ, ఇంగ్లీషు, హిందీ భాషలలో ప్రవేశం ఉన్న ఆమె కథలు, వ్యాసాలు రచించారు. వెయ్యేళ్ళ చరిత్రలో ప్రసిద్ధి చెందిన మహిళల చరిత్రలను 'అబలా సచ్చరిత్ర మాల' పేరుతో సృజించారు. మహిళల ఉద్ధరణ కోసం 'బృందావన స్త్రీల సమాజం' పేరుతో మహిళా సంఘాల్ని స్థాపించారు. జీవించింది ముప్పయ్యేళ్ళు మాత్రమే అయినా చరిత్రలో నిలిచిపోయే విశిష్టమైన కృషి చేశారు. చదువుకోడం వల్ల స్త్రీలకు స్వేచ్ఛా సమానత్వాలు చేకూరుతాయని తన రచనల ద్వారా, ఆచరణ ద్వారా ప్రబోధించారు. ఈవిధంగా తెలుగునాట మహిళల గురించి మొదటిసారి ఆలోచింపజేసిన బండారు అచ్చమాంబని స్మరించుకుంటూ ఈ ఏడాది 'బండారు అచ్చమాంబ స్మారక రచనల పోటీ'ని నిర్వహించాలని 'నవతెలంగాణ' సంకల్పించింది. కవిత, కథ, సింగిల్‌పేజీ కథ, సాహిత్య విమర్శ ప్రక్రియలలో నిర్వహించే ఈ పోటీలకు తమ రచనల్ని పంపించాల్సిందిగా తెలుగు సాహిత్యకారుల్ని ఆహ్వానిస్తున్నాం.

రచనలు ఎలా ఉండాలంటే...

- ప్రపంచీకరణ నేపథ్యంలో విభిన్న వర్గాల జీవితంలో నెలకొన్న అవస్థలకు చిత్రిక పట్టాలి.
- సమాజంలోని ఆర్థిక, సామాజిక అసమానతల పట్ల నిరసన వ్యక్తం కావడానికి దోహదం చేసే రీతిన రచనలు రూపొందాలి.
- మతోన్మాద హింసను వ్యతిరేకిస్తూ, లౌకికవిలువల వ్యాప్తికి తోడ్పడేలా రచనలు ఉండాలి.
- కుల వివక్ష, మతవివక్ష, లింగవివక్ష వల్ల అణచివేతకు గురయ్యే తరగతుల గురించి ఆలోచింపజేసేవిధంగా ఉండాలి.
- కులాల్ని స్థిరీకరించే విధానాలకు భిన్నంగా కుల నిర్మూలనకు తోడ్పడే దృష్టిని ప్రోది చేసేలా రచనలు ఉండాలి. కుల వివక్ష వ్యతిరేక పోరాటాలు కులనిర్మూలనకు దారితీసే వైపుగా (కొన్ని కులాలకు వ్యతిరేకంగా కొన్ని కులాలను కదిలించే విధంగా కాదు) జనావళిని చైతన్యపరచాలన్న దృక్పథంతో కూడిన రచనలకు ప్రాధాన్యం.
- మహిళల ఆత్మగౌరవం, సాధికారతలు చాటే విధంగా రచనలు ఉండాలి.
- కనిపించే వాస్తవాల వెనుక ఉండే సూక్ష్మమైన వైరుధ్యాల్ని గుర్తించి చిత్రించే నైపుణ్యం ప్రధానం.
- సాహిత్య విమర్శ అభ్యుదయ భావజాలం, సమసమాజం వైపు ప్రోత్సహించేదిగా ఉండాలి.

నిబంధనలు- సూచనలు

- కవితలు 20 లైన్లకు మించరాదు. ఇంకా చిన్నవైతే మంచిది.
- సింగిల్ పేజీ కథ నవతెలంగాణ 'సోపతి'లో ఒకపేజీకి సరిపడేలా ఉండాలి.
- కథల పోటీకి పంపే కథలు 'సోపతి'లో మూడు పేజీలకు మించరాదు.
- సాహిత్య విమర్శనా వ్యాసాలు సాహిత్యధోరణులపైనే ఉండాలి. వ్యక్తుల గురించి, పుస్తకాల గురించి రాసిన వ్యాసాలు పరిశీలనకు స్వీకరించబడవు.
- రచనలపై రచయిత పేరు, చిరునామా రాయకూడదు.
- ఒక రచన ఇదివరలో ఎక్కడా ప్రసారం కాలేదని, ప్రచురితం కాలేదని, ఏ బ్లాగులోనూ, ఫేస్‌బుక్‌లోనూ, మరే ఇతర మాధ్యమంలోనూ ఉపయోగించలేదన్న హామీ పత్రం జత చేయాలి.
- రచనలు తిప్పి పంపడం కుదరదు. కనుక ఒక జిరాక్స్ కాపీని రచయితలు తమ దగ్గర ఉంచుకోవాలి.
- పోటీలో గెలుపొందిన, సాధారణ ప్రచురణకు ఎంపికయిన కవితల్ని, కథల్ని నవతెలంగాణ ఆదివారం సంచిక 'సోపతి'లో, 'దర్వాజ'లో ప్రచురిస్తాం.
- రచనల ఎంపిక విషయంలో తుదినిర్ణయం నవతెలంగాణ సంపాదకవర్గానిదే. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావులేదు.

కథల పోటీ

ప్రథమ బహుమతి:	రూ. 10,000
ద్వితీయ బహుమతి:	రూ. 8,000
తృతీయ బహుమతి:	రూ. 5,000

5 కథలకు ప్రత్యేక బహుమతులు - ఒక్కొక్క కథకి రూ. 1,000

సింగిల్ పేజీ కథల పోటీ

ప్రథమ బహుమతి:	రూ. 4,000
ద్వితీయ బహుమతి:	రూ. 3,000
తృతీయ బహుమతి:	రూ. 2,000

5 కథలకు ప్రత్యేక బహుమతులు - ఒక్కొక్క కథకి రూ. 1,000

కవితల పోటీ

ప్రథమ బహుమతి:	రూ. 3,000
ద్వితీయ బహుమతి:	రూ. 2,000
తృతీయ బహుమతి:	రూ. 1,000

10 కవితలకు ప్రత్యేక బహుమతులు - ఒక్కొక్క కవితకి రూ. 500.

సాహిత్య విమర్శ వ్యాసాల పోటీ

ప్రథమ బహుమతి:	రూ. 5,000
ద్వితీయ బహుమతి:	రూ. 3,000
తృతీయ బహుమతి:	రూ. 2,000

రచనలు చేరడానికి చివరి తేదీ: 30 నవంబర్ 2019

కవరుపైన 'బండారు అచ్చమాంబ స్మారక రచనల పోటీ కోసం' అని రాయాలి. కవితలు, కథలు, వ్యాసాలు ఈమెయిల్‌లో కూడా పంపించవచ్చు.

రచనలు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, నవతెలంగాణ

ప్లాట్ నెం: 21/1, యం.హెచ్. భవన్, ఆర్టీసి కళ్యాణ మండపం దగ్గర, అజామాబాద్, హైదరాబాద్-500 020, ఫోను: 94900 99079.

Email: sopathisunday@gmail.com

darwajapage@gmail.com

ఏటేటా పెరుగుతున్న ఆత్మహత్యలు

ఆగ్నేయాసియా దేశాల్లో కంటే ఇండియాలో అత్యధికం

- 'ద లాన్సెట్' అధ్యయనంలో వెల్లడి
- ప్రపంచ సగటు 10.5 ఇండియాలో 17.8
- 2016లో 2,30,314 మంది ఆత్మహత్య

న్యూయార్క్ : ఇండియాలో ఆత్మహత్యల రేటు ప్రపంచ సగటు కన్నా ఎక్కువగా ఉందని ప్రఖ్యాత మెడికల్ జర్నల్ 'ద లాన్సెట్' తాజా అధ్యయనం వెల్లడించింది. ఆత్మహత్యలు ఆగ్నేయాసియా దేశాల్లో కంటే ఇండియాలో అత్యధికంగా ఉన్నాయని తెలిపింది. 2016లోనే 2,30,314 మంది ఆత్మహత్య చేసుకున్నారనీ అధ్యయనం తేల్చింది. 1990నాటి గణాంకాలతో పోల్చిచూడగా ఆత్మహత్యల సంఖ్య ఇండియాలో 40శాతం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో యువత, మహిళల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో లేకపోవటమూ ఆత్మహత్యలు పెరగడానికి ఒక కారణమనీ అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకులు తెలియజేశారు.

కొద్ది నెలల క్రితం విడుదలైన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) 'వరల్డ్ హెల్త్ స్టాటిస్టిక్స్ 2019' గణాంకాల్ని 'ద లాన్సెట్' తన తాజా అధ్యయనంలో ప్రస్తావించింది. వివిధ దేశాల్లో చోటుచేసుకున్న ఆత్మహత్యల గణాంకాల్ని ఉదహరించింది. ఇండియాలో 2016లో ప్రతీ లక్షమందికి సగటున 17.8మంది ఆత్మహత్యలు చేసుకున్నారని డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక పేర్కొన్నది. ప్రపంచ సగటు 10.5కన్నా ఇండియాలో చాలా ఎక్కువగా నమోదైందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక ఇండియాలో విడుదల కాలేదు. ఈనేపథ్యంలో తమ తాజా అధ్యయనాన్ని మదింపు చేస్తూ, ఇండియాలో ఆత్మహత్యల ...9లో

epaper.navatelangana.com

హర్యానాలో రెబల్స్ బెడద

బీజేపీలో 12మంది సిట్టింగ్‌లకు టికెట్టు నిరాకరణ

- స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ !
- 10 జన్‌పథ్‌కు చేరిన కాంగ్రెస్ అసంతృప్త నాయకులు

న్యూఢిల్లీ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు రెబల్స్ బెడద ఎక్కువైంది. శుక్రవారంనాటితో అక్కడ నామినేషన్ స్వీకరణ పూర్తయింది. పార్టీ టికెట్లు దక్కనివారు పెద్ద సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. అనేకమంది బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు దక్కకపోవటంతో వారంతా స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. హర్యానాలో అధికారిక బీజేపీకి వ్యతిరేకంగా ప్రజా స్పందన స్పష్టంగా కనపడుతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలపై పెద్ద ఎత్తున ప్రజాగ్రహం నెలకొనడంతో వారిని మార్చేశారని తెలుస్తోంది. బీజేపీలో 12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్టు నిరాకరించారు. ఇందులో పలువురు మంత్రులు కూడా ఉండటం గమనార్హం. తాను ఎన్నో ఏండ్లుగా పార్టీలో నమ్మకంగా పనిచేసినప్పటికీ తనకు బీజేపీ టికెట్టు ఇవ్వలేదని ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే కాప్రి వాస్ ఆవేదన వ్యక్తం చేశారు. తానెప్పుడూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించలేదనీ, అనేక సందర్భాల్లో ప్రజల సమస్యల్ని తెరమీదకు తెచ్చాననీ ఆయన అన్నారు. నియోజకవర్గంతో సంబంధంలేని వ్యక్తిని తీసుకొచ్చి బరిలో నిలబెట్టారని అయన చెప్పారు. గురుగావ్ ఎమ్మెల్యే ఉమేష్ అగర్వాల్‌కు కూడా టికెట్టు దక్కలేదు. దీంతో ఆయన తన భార్య అనితా అగర్వాల్‌ను బరిలోకి దింపారు.

సోనియాగాంధీ తలుపుతడుతోన్న నాయకులు

కాంగ్రెస్‌లోనూ పరిస్థితి గందరగోళంగానే ఉంది. మాజీ పీసీసీ అశోక్ తన్వర్ నేతృత్వంలో ఆయన మద్దతుదారులు, ఇతరులు అంతా కలిసి సోనియాగాంధీ తలుపుతట్టారు. టికెట్ల జారీలో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని 10 జన్‌పథ్ ముందు ధర్నాకు దిగారు. పార్టీ అధినాయకత్వం నుంచి స్పందన లేకపోయేసరికి, అశోక్ తన్వర్ శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీ రాష్ట్ర శాఖలో జరుగుతున్న తతంగాన్ని తెలుపుతూ, ట్విట్టర్‌లో నాలుగుపేజీల లేఖను పోస్ట్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి కొద్ది వారాల ముందు, హర్యానా పీసీసీ పదవి నుంచి అశోక్ తన్వర్‌ను తప్పించి..కుమారి షెల్జాను నియమించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినవారికి అధినాయకత్వం టిక్కెట్లు ఇచ్చిందని కాంగ్రెస్ నాయకుడు అజయ్ సింగ్ యాదవ్ వాపోయాడు. కాంగ్రెస్ నాయకుడు రంజిత్‌సింగ్ చౌతాలా (ఉప ప్రధాని దేవీలాల్ కుమారుడు) కు పార్టీ టిక్కెట్టు దక్కకపోవటంతో, రానియా నియోజిక వర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలబడ్డాడు. ఇక్కడ కాంగ్రెస్ వినీత్ కాంబోజ్‌కు టిక్కెట్టు ఇచ్చింది

హర్యానా శాసనసభలో 90స్థానాలున్నాయి. అధికారం కైవసం చేసుకోవాలంటే 46స్థానాల్లో విజయం తప్పనిసరి. 2014 ఎన్నికల్లో బీజేపీ 47 స్థానాల్ని గెలుచుకుంది. ఈ ఏడాది జింద్ స్థానంలో జరిగిన ఉప ఎన్నిక గెలుపుద్వారా బీజేపీ శాసనసభ్యుల సంఖ్య 48కి పెరిగింది. ఓం ప్రకాశ్ చౌతాలా నేతృత్వంలోని ఐఎన్ఎల్‌డీకి 19 స్థానాలు, భూపిందర్ సింగ్ హుడా నేతృత్వంలోని కాంగ్రెస్‌కు 15స్థానాలు దక్కాయి.

అభినందన్ స్క్వాడ్రన్‌కు 'యూనిట్ సైటేషన్'

- 8న అవార్డు ప్రదానం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళ(ఐఏఎఫ్)వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌కు మరో గౌరవం దక్కింది. పాక్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధవిమానాన్ని కుప్పకూల్చడం ద్వారా అసమాన ప్రతిభ కనబర్చిన అభినందన్ వర్ధమాన్ 51వ స్క్వాడ్రన్‌కు 'యూనిట్ సైటేషన్' అవార్డు లభించింది. తమ టీమ్ తరపున స్క్వాడ్రన్ కమాండింగ్ అధికారి, గ్రూప్ కెప్టెన్ సతీశ్ పవార్ ఈనెల 8న ఈ అవార్డు అందుకోనున్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్‌కెఎస్ బదౌరియా చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం ఉంటుంది. స్క్వాడ్రన్ లీడర్ మింటీ అగర్వాల్‌కు చెందిన 601 సిగ్నల్ యూనిట్‌కు కూడా యూనిట్ సైటేషన్ అవార్డు లభించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 27న భారత్‌పై ఎఫ్-16 యుద్ధవిమానంతో వాయుదాడులకు పాకిస్తాన్ ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అభినందన్ మిగ్-21 బైసన్ ఫైటర్‌లో పీఓకేలోకి అడుగుపెట్టారు. మిగ్-21తో పాక్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్-16ను కూల్చివేశారు. ఆ తర్వాత పాక్ చెరలో ఉన్నప్పుడు కనబరిచిన ధైర్యసాహసాలకు గాను భారత ప్రభుత్వం ప్రకటించిన 'వీర్ చక్ర' అవార్డును 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వర్ధమాన్ అందుకున్న విషయం విదితమే.

ఫరూక్ అబ్దుల్లాను కలిసిన ఎన్‌సీ నాయకులు

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో ఆంక్షలు నెమ్మదిగా సడలించబడుతున్నాయి. రెండు నెలల గృహనిర్బంధంలో మొదటిసారిగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా, ఒమార్ అబ్దుల్లాలను ఆ పార్టీ నాయకులు కలుసుకున్నారు. ఎన్‌సీ నాయకుడు దేవేందర్ సింగ్ రాణా నేతత్వంలో 15 మంది పార్టీ నాయకులు ఆదివారం శ్రీనగర్‌లో ఫరూక్ నివాసానికి వెళ్లింది. ఆయనను కలుసుకునేందుకు ఎన్‌సీ నేతలకు గవర్నర్ సత్యపాల్ మాలిక్ రెండురోజుల క్రితం అనుమతించిన విషయం తెలిసిందే. ఫరూక్‌తో సమావేశనంతరం ఎన్‌సీ నాయకులు అక్బర్ లోన్, మసూదీలు మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎలాంటి రాజకీయ అంశాలను చర్చించలేదనీ, కేవలం ఆయన ఆర్యోగపరిస్థితిని అడిగి తెలుసుకున్నామని తెలిపారు. తమ పార్టీ నాయకులందరూ నిర్బంధంలో ఉన్నందునా.. రాష్ట్రంలో జరుగనున్న బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (బీడీసీ)ఎన్నికల్లో తమ పార్టీ పోటీచేయడం లేదని వెల్లడించారు.

దశల వారీగా నాయకుల విడుదల

జమ్మూకాశ్మీర్‌లో బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో.. నిర్బంధంలో ఉన్న నాయకులందరిపై ఆంక్షలు సడలించినట్టు ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ సలహాదారు ఫరూక్ ఖాన్ వెల్లడించారు. నాయకులను విడతల వారీగా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు.

మొహబూబా ముఫ్తీని కలువనున్న పీడీపీ నేతలు

పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీపీ) చీఫ్ నాయకురాలు మొహబూబా ముఫ్తీని ఆ పార్టీ నాయకులు నేడు కలువనున్నారు. ఈ మేరకు ఆ రాష్ట్ర గవర్నర్ అనుమతి ఇచ్చినట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ .. ప్రజాస్వామ్య వ్యవస్థను పునరుద్ధరించాలనీ, నిర్బంధంలో ఉన్న రాజకీయ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆరిక్టల్ 370 రద్దు, రాష్ట్ర విభజన చేయడానికి ముందు రోజు రాత్రి(ఆగస్టు 4న) ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లాలను ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. వీరితో పాటు పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, జమ్మూకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ చైర్మన్ సజ్జద్ లోన్‌ను సైతం ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. ఇంకా వారిపై ఆంక్షలు కొనసాగుతుండటం గమనార్హం.

ఆకాశ వీధిలో 'సుఖోయ్' అద్భుత విన్యాసాలు

- ట్విట్టర్‌లో పంచుకున్న ఐఏఎఫ్

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం (ఐఏఎఫ్)కు చెందిన 'సుఖోయ్-30ఎంకేఐ' మల్టీరోల్ జెట్ ఫైటర్ ఆకాశ వీధిలో అద్భుత విన్యాసాలు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో హిండన్ వైమానిక స్థావరంలో ఎయిర్ మార్షల్ చీఫ్ ఆర్.కె.ఎస్ భదౌరియాకు గౌరవ వందన కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన నిర్వహించినట్టు ఐఏఎఫ్ వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను ఐఏఎఫ్ తన అధికారిక ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. సుఖోయ్‌తో పలు రకాలు ఫీట్లు చేస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇదిలా ఉండగా, రేపు జరగనున్న భారత వైమానిక దళం 87వ వార్షికోత్సవ వేడుకలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. హిండన్ స్థావరం కేంద్రంగా జరిగే ఈ వేడుకలో చూపరులను ఆకట్టుకునే విధంగా పలు రకాల యుద్ధ విమానాలతో విన్యాస ప్రదర్శనలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఓ ప్రోమో వీడియోను పోస్ట్ చేస్తూ.. 'విన్యాసాలు చూసేందుకు సిద్ధంగా ఉండండి' అంటూ ఐఏఎఫ్ మరో ట్వీట్ చేసింది.

యూపీ 'టిక్‌టాక్' విలన్ ఆత్మహత్య

- మృతుడు మూడు హత్యల్లో నిందితుడు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో టిక్ టాక్ విలన్‌గా పేరొందిన అశ్విన్ కుమార్ అలియాస్ జానీ దాదా తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు హత్యకేసుల్లో నిందితుడిగా ఉన్న అశ్విన్ ఆచూకీ తెలిపిన వారికి పోలీసులు లక్ష రూపాయల బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం వదిలి బస్సులో పారిపోయేందుకు యత్నించిన అశ్విన్‌ను బిజనూర్ జిల్లాలో పోలీసులు గుర్తించారు. దీంతో తన వద్దనున్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిగ్రీ వరకు చదివిన అశ్విన్ మాదకద్రవ్యాలకు అలవాటు పడి తన ఉద్యోగాన్ని వదులుకున్నాడు. ఈ క్రమంలో టిక్‌టాక్, ఫేస్‌బుక్‌లో వీడియోలు చేయడం ప్రారంభించాడు. 'నేను దేన్నైనా వినాశనం చేస్తాను', 'నేనో డెవిల్‌ను' అంటూ విద్వేషపూరిత పోస్టులు పెట్టేవాడు. దీంతో ఆయనకు టిక్‌టాక్ విలన్‌గా పేరొచ్చింది. కానీ అప్పటివరకు ఆయనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేకపోవడం గమనార్హం. అయితే గత 27నుంచి ఐదురోజుల వ్యవధిలో మూడు హత్యలు జరిగాయి. హత్యకు గురైన వారిలో బీజేపీ నాయకుడి కొడుకు, మేనల్లుడు, గతంలో అశ్విన్ వెంటబడ్డ అమ్మాయి ఉన్నారు. దీంతో ఈ కేసులో ప్రథమ నిందితుడిగా అశ్విన్‌ను పోలీసులు గుర్తించారు. అతని ఆచూకీ తెలిపిన వారికి లక్ష రూపాయల బహుమతి కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో అశ్విన్ బిజనూర్‌లోని ఓ బస్సులో పారిపోతున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే ఆ బస్సును పట్టుకున్న పోలీసులు బస్సులోకెళ్లి అశ్విన్ దగ్గరికెళ్తుండగా.. ఒక్కసారిగా తన వద్దనున్న తుపాకీతో పాయింట్ బ్లాక్‌లో కాల్చుకుని అక్కడిక్కడే మృతి చెందాడు. అశ్విన్ ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టినట్టు వెల్లడించారు. మృతుడి నుంచి హత్యలకు సంబంధించిన 14పేజీల నోట్‌తో పాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఎన్నార్సీ బిల్లుపై రగడ

పౌరసత్వ సవరణ బిల్లుపై భగ్గుమంటున్న ఈశాన్య రాష్ట్రాలు

- అమిత్‌షా ప్రకటనపై నిరసనలు
- మత ప్రాతిపదికన పౌరసత్వమేలా ఇస్తారంటున్న స్థానికులు

గౌహతి: పౌరసత్వ సవరణ బిల్లుపై హెూంమంత్రి అమిత్‌షా ఇటీవల చేసిన ప్రకటన పట్ల ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు అమిత్‌షా ప్రకటించారు. దాంతో, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాల్యాండ్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో నిరసనలు మొదలయ్యాయి. నార్త్‌ఈస్ట్ ఫోరం ఫర్ ఇండీజినస్ పీపుల్ ఆధ్వర్యంలో సవరణ బిల్లుకు నిరసనగా పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ బిల్లులో జాతి వివక్షను చూపే అంశాలున్నాయని నార్త్‌ఈస్ట్ ఫోరం ప్రధాన కార్యదర్శి రాబర్ట్‌జునే ఖర్జారిన్ తెలిపారు. రాజ్యాంగంలోని అధికరణం 14లో హామీ ఇచ్చిన సమానత్వపు హక్కులకు భంగం కలిగించే అంశాలు ఇందులో ఉన్నాయని ఆయన తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని ఆయన అన్నారు. ఐక్యరాజ్యసమితికి కూడా ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు. లౌకిక దేశంలో మత ప్రాతిపదికన పౌరసత్వం కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్ విమర్శించింది.ఈ నెల 1న కోల్‌కతాలో బీజేపీ ఏర్పాటు చేసిన సదస్సులో అమిత్‌షా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జాతీయ పౌర పట్టిక(ఎన్ఆర్‌సీ)ని అమలు చేయడానికి తమ ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దేశ భద్రత దృష్ట్యా అది తప్పనిసరన్నారు. చొరబాటుదారుల్ని దేశం నుంచి వెళ్లగొడ్తామన్నారు. అయితే, సవరణ చట్టం ద్వారా శరణార్థులకు దేశ పౌరసత్వం కల్పిస్తామన్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీరుపై అమిత్‌షా విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు చొరబాటుదారులను బెంగాల్ నుంచి వెళ్లగొట్టాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు వారే ఆమెకు ఓటుబ్యాంక్‌గా మారారని అమిత్‌షా విమర్శించారు.

ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే పౌరసత్వ సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు అమిత్‌షా తెలిపారు. దాంతో, ఈశాన్య రాష్ట్రాల్లో మరోసారి ఆందోళనలు మొదలయ్యాయి. మోడీ సర్కార్-1 హయాంలోనే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కాగా, బిల్లు రాజ్యసభ ముందుకు రాకముందే తిరిగి ఎన్నికలు జరిగాయి. దాంతో, ఆ బిల్లుకు కాలం చెల్లింది. 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ బీజేపీ పౌరసత్వ సవరణ బిల్లుకు హామీ ఇచ్చింది. మరోసారి ఈ బిల్లును పార్లమెంట్‌కు తేనున్నట్టు అమిత్‌షా తెలిపారు. ఈ బిల్లు ప్రకారం ముస్లింలు మెజారిటీగా ఉండే ఆఫ్గనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి శరణార్థులుగా వచ్చిన హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్శీలు, క్రైస్తవులకు పౌరసత్వం కల్పిస్తారు. వారు ఆరేండ్లపాటు భారత్‌లో నివామున్నట్టు ఆధారాలు చూపిస్తే చాలు. కానీ, ఆ దేశాల నుంచి వలస వచ్చిన ముస్లింలకు మాత్రం పౌరసత్వం కల్పించరు. కాగా, వలస వచ్చిన ఏ మతస్థులకూ పౌరసత్వం కల్పించొద్దనేది ఈశాన్య రాష్ట్రాల ఆందోళనకారుల డిమాండ్.

బంగ్లా ప్రధానితో సోనియా, మన్మోహన్‌ల భేటీ

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ప్రధాని షేక్‌హసీనాతో కాంగ్రెస్‌పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ, భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌లు భేటీయ్యారు. ఆదివారం సోనియాగాంధీ నివాసంలో ఏర్పాటైన ఈ సమావేశంలో ప్రియాంక గాంధీ, విదేశాంగ శాఖ మాజీ ఆనంద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ భేటీ సుమారు గంట పాటు జరిగింది. కాగా, ఈ సమావేశానికి పెద్దగా రాజకీయ కారణాలేమీ లేవనీ, యూపీఏ ప్రభుత్వంతో ఆమెకు ఉన్న అనుబంధంతోనే సమావేశమైనట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే రెండు దేశాల మధ్య ఉన్న దౌత్య సంబంధాల గురించి చర్చించినట్టు వెల్లడించాయి. కాగా ఈ సమావేశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సమావేశనంతరం ప్రియాంక గాంధీ తన ట్విట్టర్‌లో.. " నేను చాలా కాలం నుంచి మిమ్మల్ని కలువాలని ఎదురుస్తున్నా హసీనా జీ", " నమ్మిన సిద్ధాంతాల కోసం మీరు చేసిన పోరాటం, కష్టాలను అధిగమించడంలో మీరు చూపిన తెగువ, ధైర్యం, పట్టుదల నాకెప్పుడూ స్ఫూర్తిదాయకమే" అంటూ షేక్ హసీనాను ఆత్మీయంగా కౌగిలించుకున్న ఫోటోను పోస్టు చేసింది. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, కనెక్టివిటీ, ఇతర అంశాలను చర్చించడానికి భారత్‌లో బంగ్లాదేశ్ ప్రధాని నాలుగురోజుల అధికారిక పర్యటన చేస్తున్నది.

ఎన్డీయేలో గిరిరాజ్ వ్యాఖ్యల దుమారం

- పాట్నా వరదలపై కామెంట్లు వ్యక్తిగతమా?.. బీజేపీ అభిప్రాయమా?
- వివరణకు జేడీయూ డిమాండ్

పాట్నా: పాట్నా వరదలపై వివాదాస్పద బీజేపీ నేత, కేంద్రమంత్రి గిరిరాజ్ చేసిన వ్యాఖ్యలు బీహార్‌లోని అధికార ఎన్డీయే కూటమిలో దుమారం రేపుతున్నాయి. పాట్నా వరదలపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ను తప్పుబడుతూ కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్రంలో బీజేపీతో భాగస్వామిగా ఉన్న జేడీయూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కేంద్ర మంత్రి వ్యక్తిగత వ్యాఖ్యలా? లేక బీజేపీ అభిప్రాయాన్నే ఆయన వినిపించారా? అనే దానిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. నితీశ్‌కుమార్‌పై వ్యాఖ్యలు చేయడం గిరిరాజ్‌కు పరిపాటైందని ఆదివారంనాడిక్కడ మీడియాతో జేడీయూ ప్రధాన కార్యదర్శి, జాతీయ ప్రతినిధి పవన్ వర్మ మాట్లాడుతూ అన్నారు. పాట్నా వరదలకు నితీశ్ కుమార్ నిర్వాకమే కారణమంటూ ఆయన వ్యాఖ్యానించడం సరికాదని తెలిపారు. అది ఆయన వ్యక్తిగత అభిప్రాయమా? లేక బీజేపీ అభిప్రాయాన్నే ప్రతిబింబించేలా ఆయన మాట్లాడారా? అనే దానిపై ఆ పార్టీ తప్పనిసరిగా వివరణ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రిపై వ్యక్తిగత దాడులు, విమర్శలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని చెప్పారు. జేడీయూ-బీజేపీ భాగస్వామ్య పార్టీలైనందున ఇలాంటి వ్యాఖ్యలకు బీజేపీ అడ్డుకట్ట వేయాలని అన్నారు. అలాగే జేడీయూ నేతలు సంజయ్‌సింగ్, రాజీవ్ రంజన్ ప్రసాద్‌లు కూడా గిరిరాజ్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాట్నాలో వరదల పరిస్థితికి రాష్ట్ర యంత్రాంగమే కారణమనీ, ముఖ్యమంత్రి నితీష్ కుమార్, డిప్యూటీ సీఎం సుశీల్ మోడీలు దీనికి బాధ్యత వహించాలని బెగుసరాయ్ ఎంపీ గిరిరాజ్ సింగ్ రెండ్రోజుల క్రితం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

'ఆరే' నిరసనకారులకు బెయిల్

- ప్రత్యేక కోర్టు ఆదేశాలు

ముంబయి : ముంబయిలోని ఆరే కాలనీలో చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ఆందోళ చేపట్టి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న 29 మంది నిరసనకారులకు షరతులతో కూడిన బెయిల్ లభించింది. ఈ మేరకు ప్రత్యేక సెషన్స్‌కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ముంబయి మెట్రో కార్ పార్కింగ్ కోసం ఆరే కాలనీలో ప్రతిపాదిత స్థలంలో చెట్ల నరకివేతను వ్యతిరేకిస్తూ ప్రభుత్వాధికారుల విధులకు ఆటంకం కలిగిం చారన్న కారణంతో నిరసనకారులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. థానే జైలులో ఉన్న ఆ 29 మందిని విచారణలో భాగంగా బోరివా లీ సెషన్స్ కోర్టు ముందు పోలీసులు ఆదివారం ప్రవేశపెట్టా రు. అనంతరం వారికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ జడ్జీ హెచ్‌సీ షిండే ఆదేశించారు. అలాగే రూ.7000 వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలనీ తెలిపారు. చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా శనివారం నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీంతో ఆరే కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో పోలీసులు 144 సెక్షన్‌ను విధించారు. తొలిరోజే దాదాపు 1500ల చెట్లను నేలమట్టం చేశారు. కాగా, అంతకముందు ఆరే కాలనీలోకి అడుగుపెట్టడానికి ప్రయత్నించిన దళిత నాయకుడు, వంచిత్ బహుజన్ అఘాది(వీబీఏ) చీఫ్ ప్రకాశ్ అంబేద్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కండబలంతో నిరసనకారుల గొంతును నొక్కేందుకు 'మహా'సర్కారు ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు.

హిమాచల్ సీజేగా లింగప్ప నారాయణ స్వామి ప్రమాణస్వీకారం

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ లింగప్ప నారాయణస్వామి ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చేత ఆ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ సీఎం జైరాం ఠాకూర్‌తో పాటు ఆ రాష్ట్ర హైకోర్టు జడ్జీలు సర్వేశ్వర్ ఠాకూర్, వివేక్‌సింగ్ ఠాకూర్, చందంభూషన్ బారోవాలియాలు పాల్గొన్నారు. ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం కోర్టు పరిసర ప్రాంతంలో లింగప్ప గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈయన 1959, జులై 1న జన్మించారు. 2007లో కర్నాటక హైకోర్టు అదనపు జడ్జీగా, 2009లో జడ్జీగా నియమితులయ్యారు. అలాగే ఈ ఏడాది జనవరి17 నుంచి మే 9 వరకు కర్నాటక హైకోర్టు తాత్కాలిక సీజే గా కూడా లింగప్ప వ్యవహరించారు.

అంతర్జాతీయం

ఆస్ట్రేలియాలో కార్చిచ్చు

సిడ్నీ : ఆస్ట్రేలియాలో గతకొద్ది రోజులుగా కార్చిచ్చు చెలరేగుతోంది. వేలాది ఎకరాల అటవీ ప్రాంతం దగ్ధమైంది. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. బలమైన గాలులు వీస్తుండటంతో సహాయక చర్యలకు ఇబ్బందవుతున్నదని అధికారులు తెలిపారు. కార్చిచ్చు కారణంగా ఈ ఏడాది తీవ్ర కరువు నెలకొందని అన్నారు. కార్చిచ్చు చెలరేగడంతో అటవీ ప్రాంతానికి పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న 3లక్షల మంది ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారని అన్నారు.

బంగారు గనిపై ఉగ్రవాదుల మెరుపు దాడి

- 20 మంది మృతి

ఒగాడౌగా : బుర్కినో ఫాసో నగరంలోని బంగారు గనిపై ఉగ్రవాదులు మెరుపు దాడికి పాల్పడ్డారు. ఈఘటనలో 20 మంది మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. సౌమ్ ప్రావిన్స్‌లో ఈ ఘటన జరిగింది. మృతులంతా బంగారు గనిలో పనిచేస్తున్న కార్మికులని అధికారులు ధ్రువీకరించారు. కాగా, గతనెలలో సౌమ్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఓ వంతెనను పేల్చేశారు. అనంతరం కోమ్‌సిల్గా నగరంలో దోపిడీకి పాల్పడి 9 మందిని హతమార్చారు. ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

జోర్డాన్‌లో ముగిసిన ఉపాధ్యాయుల సమ్మె

జీతాల పెంపునకు అంగీకరించిన ప్రభుత్వం

అమాన్ : జీతాల పెంపు డిమాండ్ చేస్తూ జోర్డాన్‌లో గతనాలుగు వారాల నుంచి కొనసాగుతున్న ఉపాధ్యాయుల సమ్మెకు తెరపడింది. ఉపాధ్యాయ సంఘాలకు,తమ ప్రతినిధులకు మధ్య ఆదివారం జరిగిన చర్చలు ఫలప్రదమైనట్టు సర్కారు ప్రకటించింది. గతనాలుగు వారాల నుంచి మూతపడ్డ విద్యా సంస్థలు సోమవారం నుంచి పున:ప్రారంభించాలని ఆదేశించింది. స్కూళ్లు మూతపడటంతో 15లక్షల మంది విద్యార్థులు ఇబ్బందిపడ్డారని తెలిపింది. ఉపాధ్యాయ సంఘాల డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఆ సంఘం అధ్యక్షుడు నసీర్ అల్ నవస్రా స్థానిక మీడియాతో తెలిపారు. ఉపాధ్యాయుల జీతాలను 35 నుంచి 75 శాతం పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, ఇది చారిత్రక విజయమని పేర్కొంది. జీతాల పెంపు కోసం కింగ్ అబ్దుల్లా అంగీకరించారని తెలిపింది. నెల రోజుల నుంచి కొనసాగుతున్న ఆందోళన కార్యక్రమాల్లో పలువురు ఉపాధ్యాయులు గాయపడ్డారని నవస్రా తెలిపారు. అరెస్టయిన టీచర్లను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అమెరికా ఎన్నికలపై హ్యాకర్ల కన్ను

- మైక్రోసాఫ్ట్ హెచ్చరిక

**వా

నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

ఇందిరాపార్కు వద్ద నిరహార దీక్షలు ప్రారంభం

- ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా కార్మిక, ఉద్యోగ సంఘాల పిలుపు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఆర్టీసీ కార్మికుల సమ్మె సంఘీభావంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో నిరసనలు, దిష్టిబొమ్మల దగ్ధం చేయాలని కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందిరాపార్కు వద్ద ఆర్టీసీ జేఏసీ తలపెట్టిన నిరహార దీక్షతోపాటు అన్ని పోరాట కార్యక్రమాల్లో అన్ని కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు భాగస్వాములు కావాలని కోరాయి. దీంతోపాటు కార్మికులకు అండగా ఉండాలనీ, ప్రత్యక్ష ఉద్యమాలకు సైతం వెనుకాడబోమని హెచ్చరించాయి. ఆర్టీసీ కార్మికులను అరెస్టులు చేయడం, కార్మికులను నిర్బంధించడం వంటి చర్యలను ఖండించాయి. ఆదివారం హైదరాబాద్‌లో 'టీఆర్ఎస్ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక, ఉద్యోగ సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం' నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆర్టీసీని సమ్మెలోకి నెట్టిందన్నారు. ఆర్టీసీ ఆస్తులను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వ చర్యల వల్లే సమ్మెకు వెళ్లేలా చేశాయన్నారు. ముఖ్యమంత్రికి విమానాలపై ఉన్న ప్రేమ ఆర్టీసీపై లేదన్నారు. ఆర్టీసీని మూసివేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. ఆర్టీసీతో తనకు సంబంధం లేదన్న మంత్రి పువ్వాడ అజయ్ అర్ధరాత్రి ప్రెస్‌మీట్ పెట్టి ఉద్యోగాల నుంచి తీసేస్తామని ప్రకటించారనీ మంత్రి ఏనాడైనా తెలంగాణ ఉద్యమంలో ఉన్నారా? అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ఎంపీ బినామీ టెండర్‌లో నాలుగు ఎకరాలు దక్కించుకున్నారనీ, కేసీఆర్ కుటుంబం బస్‌భవన్ పక్కన స్థలం అడిగితే...వెంటనే లీజుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తమ పోరాటం కేసీఆర్ పతనానికి నాంది పలుకుతున్నదని హెచ్చరించారు. ఏపీలో మాదిరిగా తెలంగాణలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మైండ్ గేమ్ ఆడుతున్నదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ చెప్పారు. 160 మంది కార్మికులు విధుల్లో పాల్గొన్నారనీ, పదివేల బస్సులు తిరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నదన్నారు. అన్ని బస్సులు పాల్గొంటే ఆర్టీసీకి ఎంత ఆదాయం వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం కార్మికుల పోరాడుతుంటే...ప్రభుత్వం మాత్రం భక్షించాలని ప్రయత్నం చేస్తున్నదన్నారు. టీఆర్ఎస్ అధ్యక్షులుగా కె చంద్రశేఖరావు ఉద్యమాలు చేయొచ్చు కానీ కార్మికులు చేస్తే తప్పేలా అవుతుందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఆర్టీసీకి ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వకుండా పన్నులు మాత్రం వేస్తున్నదన్నారు. సమ్మె కార్మికుల హక్కు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు బాల్‌రాజ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేంతవరకు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. ఐఎఫ్‌టీయూ నేత ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ త్రిసభ్యకమిటీకి విలువలేదా? ఎందుకువేశారు? ఎందుకు రద్దు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. సీసీజీఇడబ్ల్యూ నేత అజీజ్ మాట్లాడుతూ ఉద్యోగులు ఇంటికిపోవాలని సీఎం కేసీఆర్ చెబుతున్నారనీ, ఆర్టీసీ మీ ఇల్లు కాదని హెచ్చరించారు. బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకుడు జానకిరాములు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు. డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేత బి చంద్రయ్య మాట్లాడుతూ ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ నేత ఎంబి విజయకుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని విలీనం చేసినట్టుగానే ఇక్కడ కూడా విలీనం చేయాలని డిమాండ్ చేశారు. టీఎన్‌టీయూసీ నేత ఎంకే బోస్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల ఉద్యోగాలు ఉడగొడతామని బెదిరించడం సబబుకాదన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ సీనియర్ నేత టి నరసింహన్ అధ్యక్షత వహించారు. భూపాల్ (సీఐటీయూ), ఎస్ఎల్ పద్మ (ఐఎఫ్‌టీయూ), రాజేందర్ (ఏఐయుటీసీ), సుబ్బారావు(ఎల్ఐసీ), పి జంగారెడ్డి (తెలంగాణ రైతు సంఘం), స్కైలాబ్‌బాబు (కేపీపీఎస్) సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటితంచారు.

విద్యారంగ మార్పు కోసం త్వరలో సమావేశం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగ మార్పుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో సబితా ఇంద్రారెడ్డిని అవార్డు టీచర్ల సంఘం (ఆట) అధ్యక్షులు బెక్కంటి శ్రీనివాసరావు, నాయకులు పి శివకుమార్, పి లక్ష్మయ్య కలిశారు. విద్యాగణాంకాల ప్రకారం తెలంగాణ 18వ స్థానంలో ఉందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. విద్యారంగ ఉన్నతి కోసం త్వరలో ఏర్పాటు చేసే సమావేశానికి ఉత్తమ ఉపాధ్యాయులను భాగస్వాములను చేస్తామన్నారు. విద్యారంగాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. విద్యారంగంలో తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎల్ ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ నాయుడు, పి కృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారి సమక్షంలో
హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్ వద్ద
C.A.NO.592/66/HDB/2018
ఎన్‌సిఎల్‌టి (ప్రాసీజర్ ఫర్ రిడక్షన్ ఆఫ్ షేర్ క్యాపిటల్ ఆఫ్ కంపెనీ) రూల్స్, 2016తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 66 క్రింద
నార్త్ మలబార్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ విషయంలో
నార్త్ మలబార్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్
దీని కార్యాలయం: డోర్ నెం.1-80/40/ఎస్‌పి/58-65, శిల్పా చోష్మ్స్ లేఔట్, గచ్చిబౌలి, హైదరాబాద్-500032 వద్ద కలదు. ...దరఖాస్తుదారైన కంపెనీ
ఆర్డర్ మరియు మినిట్ యొక్క రిజిస్ట్రేషన్ ప్రకటన
ఇందుమూలంగా ప్రకటన ఇవ్వబడేమేమనగా, గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్ వద్ద వారి తేది.24.09.2019నాటి ఉత్తర్వు ప్రకారం కంపెనీల చట్టం, 2013 ద్వారా అవసరమైన అనేక వివరాలను మార్చబడినట్లుగా పై కంపెనీ యొక్క వాటా మూలధనానికి సంబంధించి చూపిస్తూ గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారినే ఆమోదించిన మినట్ మరియు రూ.5,15,53,290/- (ఐదు కోట్ల పదహేను లక్షల యాభై మూడు వేల రెండు వందల తొంభై మాత్రమే) నుండి రూ.1,00,000/- (రూపాయలు ఒక లక్ష మాత్రమే) 10,000ల ఈక్విటీ వాటాలను రూ.10/- చొప్పున విభజించబడిన పై పేరుగల కంపెనీ యొక్క వాటా మూలధనం తగ్గింపును నిర్ధారిస్తూ 06 సెప్టెంబర్, 2019న రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, తెలంగాణ, హైదరాబాద్ వారినే రిజిస్టర్డు చేయబడినవి.
వి.ఎస్.రాజు & వి.వి.రాజు
లిక్విడేటర్ తరపున అడ్వకేట్స్
చిరునామా: నెం.106, ధనుంజయ టవర్స్, రోడ్ నెం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.
Email: vsrajuco@rediffmail.com; Ph: 9849120947
తేది: 13, సెప్టెంబర్ 2019
ప్రదేశం: హైదరాబాద్

లండన్‌లో ఘనంగా బతుకమ్మ

- తెలంగాణ ఎన్నారై ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తెలంగాణ ఎన్నారై ఫోరమ్ ఆధ్వర్యంలో లండన్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలను ఆదివారం నిర్వహించారు. యూరప్‌లోనే అతిపెద్ద బతుకమ్మ నిర్వహించి చరిత్ర సృష్టించారు. దాదాపు 3000 మంది నూతన పోకడలకు, డీజేల జోలికి వెళ్లకుండా పూర్తి స్థాయిలో సాంప్రదాయ బద్ధంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచందర్‌రావు మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు నిలవాలన్నారు భారత రాయబారి కార్యాలయం ఉన్నతాధి కారి మనమీత్ నరాంగ్ మాట్లాడుతూ.. సౌత్ ఇండియా అతిపెద్ద సంస్కృతి కార్యక్రమం మొదటి సారిగా ఇంత పెద్దగా చూస్తున్నానన్నారు. లండన్ ఎంపీ వీరేంద్ర శర్మ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయాలు కాపాడలిసిన బాధ్యత ఎన్నారైల పైన ఉందనీ, ఏడేండ్లుగా బతుకమ్మ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసినందుకు తెలంగాణకు ధన్యవాదాలు తెలిపారు. అధ్యక్షులు ప్రమోద్ గౌడ్ అంతటి మాట్లాడుతూ యూరోప్‌లోనే అతి పెద్ద బతుకమ్మ నిర్వహణ బాధ్యతకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై ఫోరమ్ వ్యవస్థాపక చైర్మెన్ గంప వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌గౌడ్, రంగుల వెంకట్, కార్యదర్శి పిట్ల భాస్కర్, మహిళా విభాగం నేతలు మీనా అంతటి, వాణి అనసూరి, తదితరులు పాల్గొన్నారు.

'యురేనియం'పై రెండు నాల్కల ధోరణి

బోర్లు వేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదు

- అవగాహనా ర్యాలీలో డీవైఎఫ్ఐ నేతల ఆగ్రహం

నవతెలంగాణ–అమరచింత

యురేనియం తవ్వకాల్లో భాగంగా బోర్లు వేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరిస్తోందనీ, ఈ విషయంలో ప్రభుత్వం రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తున్నదనీ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు విష్ణుకుమార్, విజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తవ్వకాలు చేపట్టవద్దని ఒకవైపు అసెంబ్లీ తీర్మానించి, మరోవైపు గ్రామాల్లో బోర్లు వేస్తున్నా స్పందించడం లేదెందుకని ప్రశ్నించారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం మస్తీపూర్ గ్రామంలో డీవైఎఫ్ఐ బృందం ఆదివారం పర్యటించింది. యురేనియం అన్వేషణలో భాగంగా వేసిన బోర్లను పరిశీలించి, తవ్వకాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ చేపట్టింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి శివారులోని పంట పొలాల్లో బోర్లు వేస్తున్నారనీ, గ్రామసభల అనుమతి కూడా పొందలేదనీ అన్నారు. యురేనియం తవ్వకాల వల్ల మస్తీపూర్ పక్కనే ఉన్న జూరాల ప్రాజెక్టులోని నీరు విషతుల్యమై కిష్టంపల్లి, నందిమల్ల, చంద్రగట్టు, ధర్మపురం, చిన్నకడ్మూర్, మూలమల్ల, ఆర్ఆర్ సెంటర్, ఈర్లదిన్నే గ్రామాల తాగు, సాగు నీరు కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరచింత ఎత్తిపోతల ప్రాజెక్టూ మొత్తం విషపూరితంగా మారుతుందన్నారు. ఈ గ్రామాలను కాపాడుకోవాలంటే బోర్లు వేయడాన్ని అడ్డుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలో ప్లకార్డులు పట్టుకుని యురేనియం వద్దు.. నల్లమల ముద్దు అనే నినాదాలతో ర్యాలీ చేశారు. డీవైఎఫ్ఐ వనపర్తి జిల్లా కన్వీనర్ రాఘవేంద్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారి సమక్షంలో
హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్ వద్ద
C.A.NO.591/66/HDB/2018
ఎన్‌సిఎల్‌టి (ప్రాసీజర్ ఫర్ రిడక్షన్ ఆఫ్ షేర్ క్యాపిటల్ ఆఫ్ కంపెనీ) రూల్స్, 2016తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 66 క్రింద
నార్త్ మలబార్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ విషయంలో
నార్త్ మలబార్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్
దీని కార్యాలయం: డోర్ నెం.1-80/40/ఎస్‌పి/58-65, శిల్పా చోష్మ్స్ లేఔట్, గచ్చిబౌలి, హైదరాబాద్-500032 వద్ద కలదు. ...దరఖాస్తుదారైన కంపెనీ
ఆర్డర్ మరియు మినిట్ యొక్క రిజిస్ట్రేషన్ ప్రకటన
ఇందుమూలంగా ప్రకటన ఇవ్వబడేమేమనగా, గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్ వద్ద వారి తేది.11.03.2019నాటి ఉత్తర్వు ప్రకారం కంపెనీల చట్టం, 2013 ద్వారా అవసరమైన అనేక వివరాలను మార్చబడినట్లుగా పై కంపెనీ యొక్క వాటా మూలధనానికి సంబంధించి చూపిస్తూ గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారినే ఆమోదించిన మినట్ మరియు రూ.5,67,99,050/- (ఐదు కోట్ల అరవై ఏడు లక్షల తొంభై తొమ్మిది వేల యాభై మాత్రమే) నుండి రూ.1,00,000/- (రూపాయలు ఒక లక్ష మాత్రమే) 10,000ల ఈక్విటీ వాటాలను రూ.10/- చొప్పున విభజించబడిన పై పేరుగల కంపెనీ యొక్క వాటా మూలధనం తగ్గింపును నిర్ధారిస్తూ 06 సెప్టెంబర్, 2019న రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, తెలంగాణ, హైదరాబాద్ వారినే రిజిస్టర్డు చేయబడినవి.
వి.ఎస్.రాజు & వి.వి.రాజు
లిక్విడేటర్ తరపున అడ్వకేట్స్
చిరునామా: నెం.106, ధనుంజయ టవర్స్, రోడ్ నెం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.
Email: vsrajuco@rediffmail.com; Ph: 9849120947
తేది: 13, సెప్టెంబర్ 2019
ప్రదేశం: హైదరాబాద్

పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యలు

బదిలీలు లేకే బలవన్మరణాలు

- రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

దీర్ఘకాలంగా ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం లభించడం లేదని రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు ఉద్యోగులపై పని భారం, ఒత్తిడి పెరిగి విశ్రాంతి లేక తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఆదివారం నగరంలో జరిగిన రెవెన్యూ ఉద్యోగ సంఘాల ఐక్య సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) అధ్యక్షులు ఎస్.రాములు, టీవీఆర్ఓడబ్ల్యూఏ అధ్యక్షులు గరికే ఉపేంద్రరావు, టీవీఆర్వోఏ అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.సుదర్శన్, టీజీటీఏ ముఖ్య సలహాదారు ఎండీ.సలీముద్దీన్, టీవీఆర్ఏ ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు, టీఆర్ఎస్ఏ ప్రధాన కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులను స్మరించుకునేందుకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్‌లో సంస్మరణ సభ నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలా మంది ఉద్యోగులు బదిలీలకు నోచుకోక ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి బలన్మరణాలకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. ఇందుకు ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డ జ్వాలా గిరిరావు, వివిధ హోదాల్లో పని చేస్తూ మరణించిన ఉద్యోగులే తార్కాణమని గుర్తు చేశారు. మరణాలతో ఆయా కుటుంబాలకు తీరని లోటు ఏర్పడిందని, వీరందరినీ స్మరించుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులందరిపైనా ఉందన్నారు. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఆర్డర్ టూ సర్వ్ పేరుతో, ఎన్నికల సమయంలోనూ వివిధ జిల్లాలకు బదిలీ చేసిన ఉద్యోగులందరినీ తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని లచ్చిరెడ్డి కోరారు. రెవెన్యూ ఉద్యోగులందరికీ ప్రభుత్వ సెలవు దినాలను వర్తింప చేయాలని, ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలనీ, ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించి రెవెన్యూ శాఖకు పూర్వ వైభవం తేవాలనీవంగూరు రాములు కోరారు. డిమాండ్ చేశారు. సంస్మరణ సభలో అన్ని రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు పాల్గొని నివాళి అర్పించాలని కోరారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలు, వారి బంధుమిత్రులను సంతాపసభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

తాగుబోతుల తెలంగాణగా మారుస్తారా?

దశలవారీగా మద్యనిషేధం అమలేదీ

- బెల్టుషాపులు, పర్మిట్‌రూమ్‌లను ఎత్తివేయాలి
- టీకేజీకేఎస్, గౌడసంఘం, ఐద్వా డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో మద్యాన్ని ఆదాయవనరుగా పరిగణించడం సమంజసం కాదని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (టీకేజీకేఎస్), తెలంగాణ గౌడసంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అభిప్రాయపడ్డాయి. దశలవారీగా మద్యనిషేధం అమలుకు చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించాయి. బంగారు తెలంగాణ బదులు తాగుబోతుల తెలంగాణగా మారుస్తారా?అని ప్రశ్నించాయి. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీకేజీకేఎస్ ప్రధాన కార్యదర్శి ఎంవి రమణ, గౌడసంఘం అధ్యక్షులు నాగరాజుగౌడ్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు కెఎన్ ఆశాలత మాట్లాడుతూ ఆదాయ వనరులను పెంచుకోవడం కోసం మద్యాన్ని ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. 18 నుంచి 35 ఏండ్లలోపు వారు ఎక్కువగా మద్యం తాగుతున్నారని చెప్పారు. మద్యం తాగడం వల్ల మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో హింస పెరుగుతోందని గుర్తు చేశారు. మద్యం తాగడం వల్ల ప్రజలు ఆదాయం కోల్పోతున్నారని, ఆరోగ్యం దెబ్బతింటున్నదని చెప్పారు. బెల్టుషాపులు, పర్మిట్ రూమ్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే మద్యం షాపులను నడపాలని సూచించారు. ప్రభుత్వం కల్లు, నీరాను ప్రోత్సహించాలని కోరారు. నీరాకు అనుమతిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. పాల శీతలీకరణ కేంద్రాల తరహాలో నీరా శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కులవృత్తులను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అన్నారు. కల్తీకల్లు పేరుతో ఎక్సైజ్ అధికారులు కల్లుగీత కార్మికులపై దాడులు చేస్తున్నారని చెప్పారు. వారానికి రెండు రోజులు మద్యం అమ్మకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ వారి సమక్షంలో
కంపెనీ దరఖాస్తు నెం.210/ 230/ హెచ్‌డిబి/2019
కంపెనీల చట్టం, 2013 విషయంలో
మరియు
కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్స్ 230 నుండి 232 మరియు కంపెనీల చట్టం యొక్క ఇతర వర్తించు నియమాలు మరియు కంపెనీస్ (రాజీలు, ఏర్పాట్లు మరియు అమల్గామేషన్) రూల్స్, 2016 క్రింద స్కీమ్ ఆఫ్ అరేంజ్‌మెంట్ (డిమర్జర్)
మధు ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U70109TG1995TC122034
కంపెనీల చట్టం, 1956 క్రింద ఇన్‌కార్పొరేట్‌అయిన కంపెనీ, దీని రిజిస్టర్డు ఆఫీసు: ఫ్లాట్ నెం.633, 6వ అంతస్తు, బ్లాక్-ఏ, ఆల్ కరీమ్ బ్రీడ్ సెంటర్, రాజీవ్‌గాంధీ, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500070, ఇండియా వద్ద కలిగియుండి. .....దరఖాస్తుదారు/ డిమర్జ్‌డ్ కంపెనీ.
ప్రకటన
రాజ్‌కార్న్ ఫీల్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు వారి సంబంధిత వాటాదారులు మరియు రుణదాతలతో మధు ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క కంపోసిట్ స్కీమ్ ఆఫ్ అరేంజ్‌మెంట్ (డిమర్జర్) యొక్క మంజూరు కొరకు కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్స్ 232 నుండి 230 మరియు ఇతర వర్తించు నియమాల క్రింద గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ సమక్షంలో 31 జులై, 2019న దరఖాస్తుదారైన కంపెనీ యొక్క కౌన్సెల్‌చే పిటిషన్ సమర్పించబడినది.
సదరు పిటిషన్‌కు మద్దతిస్తున్న లేదా వ్యతిరేకిస్తున్న ఎవరైనా వ్యక్తి, గౌరవ ట్రిబ్యునల్‌చే పిటిషన్ తదుపరి విచారించుటకు నిర్ణయించిన తేదీ అనగా శుక్రవారం, 18 అక్టోబర్, 2019న లేదా ముందుగా గౌరవ ట్రిబ్యునల్ మరియు/ దరఖాస్తు కంపెనీ యొక్క కౌన్సెల్ వారికి చేరునట్లుగా అతని పేరు మరియు చిరునామా యొక్క నోటీసును గౌరవ ట్రిబ్యునల్ మరియు/ దరఖాస్తు కంపెనీ యొక్క కౌన్సెల్‌కు పంపించాలి. అట్టి నోటీసుతో పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ, ఆధ్యంతరాలకుగల కారణాలు లేదా అతని/ఆమె అఫిడవిట్ యొక్క కాపీని దాఖలు చేయవలెను.
దరఖాస్తు కంపెనీ యొక్క కౌన్సెల్‌చే దాఖలు చేయబడు పిటిషన్ యొక్క కాపీని, అది అవసరమున్న ఎవరైనా వ్యక్తి అందుకు నిర్ణీత చార్జీలు చెల్లించి పొందవచ్చును.
సం/-
మంతేశ్ బాబు
దరఖాస్తు కంపెనీ తరపున కౌన్సెల్
ప్రదేశం: హైదరాబాద్
తేది: 04-10-2019
చిరునామా:
మంతేశ్ బాబు
ఎంఎస్‌కెహెచ్ నెం: 5-9-91 & 93, డి-204, 2వ అంతస్తు, శక్తి సాయి కాంప్లెక్స్, ఉదయ్ ఓమ్ని క్లినిక్ ప్రక్కన, రాపెల్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్-500001. మొబైల్: 9346955001

అతివేగానికి ఆరుగురు బలి

కారు, బైకు ఢీకొని దంపతులు మృతి..

- చిన్నారికి తీవ్ర గాయాలు
- ఇటుక లోడ్ ఢీకొని సింగరేణి కార్మికుడు..

నవతెలంగాణ–రాజేంద్రనగర్, రెబ్బెన

వాహన డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ఆదివారం వేర్వేరుచోట్ల ఆరుగురు బలయ్యారు. రాజేంద్రనగర్‌లో కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దంపతులు మృతిచెందగా చిన్నారి తీవ్రంగా గాయపడింది. కుమురంభీం, రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో మరో నలుగురు మరణించారు.

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలానికి చెందిన చెన్నయ్య (38), పద్మమ్మ(32) దంపతులు మొయినాబాద్‌తో నివసిస్తున్నారు. ఆదివారం సొంత ఊరెళ్లేందుకు తన సోదరుడి కూతురుని తీసుకొని బైక్‌పై బయలుదేరాడు. అప్పా జంక్షన్ ఔటర్ రింగ్‌రోడ్ పక్కన సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్తుండగా కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ముగ్గురు రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పడిపోయారు. దంపతులు అక్కడే మరణించగా చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. కారు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారమందించారు.

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం తక్కెళ్లపల్లి బస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు ఎర్రటి టి.సాంబయ్య (55) మృతిచెందాడు. సాంబయ్య ఆర్కే వన్ ఏరీ జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తుండగా ఆదివారం విధులు నిర్వహించి ఇంటికెళ్లే క్రమంలో మార్గమధ్యంలో వరిపొలంలో కలుపు తీయించేందుకు ఆగాడు. అక్కడ్నుంచి ద్విచక్ర వాహనంపై పోతుండగా తక్కళ్లపెల్లి బస్టాండ్ దాటగానే ఇటుకల లోడ్ వాహనం బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాలై సాంబయ్య అక్కడే మృతిచెందినట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు.

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తుమ్మలోగూడ గేటు సమీపంలో ఆర్టీసీ బస్సును స్కార్పియో వాహనం ఢీకొట్టింది. కారు వెనుక సీటులో ఉన్న గుంటూరు జిల్లా చెందిన బందారపు వీరబాబు(35) మృతిచెందాడు. శేఖర్, మర్రిదాసులకు తీవ్రగాయాలయ్యాయి. చేవెళ్ల

కానుగ నీడ

ఎంత సల్లనిదమ్మ కానుగనీడ
ఎండ తాపము నాపే పందిరి డేర
తలపైన తడికోలె అల్లుకున్నాకులు
తడిలేని వడగండ్ల తలపించు పూతలు
నిలువు నాపరాయి తనువుల తనమాను
ఇరిసిన విరగని పెళుసులేని మేను

ఆ సెట్టు మడిపెట్టు తేమ ఇంకితె ఒట్టు
మగుడు లెండితె బర్లు ఆ మాటనె పట్టు
తడిమిడె తగలని తడినీడ తలుగుతొ
కట్టివేసినట్టు కలగంటు గురుకొట్టు
కసిరేటి ఎండలకు కాపు బెదిరిన వేళ
కానుగె కాపయ్యి కదులనివ్వక నాపు

పొయిల కర్రలేర పొద కంచెలు తిరిగి
అలసిన పడుసుల తన దరికి పిలిసేది
నేలపై తేలిన వేర్ల అరుగుల మీద
వాలి సేద దీరె వనితల తనువులకు
పసరు గాలులనొంపె విసనకర్రయ్యేది

తాపకున్న దూపనాపేది కానుగ

నునుపైన మండలు
నులక తాళ్ళుగ సాగి
పిల్లకోతుల నేమొ ఉయ్యాల లూపేది
పక్షుల పిల్లల పాట ఆటకు మురిసి
చుట్టు ముంగీసలు గస్తియె తిరిగేవి
పాకేటి వాటిని పసిగట్టి ఉరికించి
పసరు నీడల పాన్పు పదిలంగ చూసేవి

కారాలు పొంగేటి కానుగుతొ నోరు
తోమితె లవంగ ఘాటు నోటనూరు
జతగూడె కేళిలొ చతికిల పడెవాళ్ళు
కానుగు నీడలొ కలిసి ఉంటె మేలు
నరుని మేడిమినంత
సులువుగ హరియించె
కాని లేని మందు తేమ ఇసుకల పొందు

కోపమొచ్చిన ఎండ కొరడ ఎత్తిన వేళ
వడదెబ్బనాపేటి తడిగుడ్డ తానవును
దారంచు దర్గాలొ సాధుఫకీరుల
నెమలీకల తాను తలనిమిరి తడిమేది

సేతి రుమాలోలె సెమటనె తుడిసేది
పూతల ఊదుపొడి పుప్పొడిని రాసేది

వేడి సెగలకు సుట్టు నేల పొలమారిన
తననీడలొ ఇసుక తళతళ మెరిసేది
సెట్టు లొట్టి కట్టు పులుపు వారకుండ
ఈ సెట్టు మరుగులొ
సలువతొ నుండేది
పండిరాలిన ఆకు పొలం ఎరువయ్యేది
ఎండి పగిలిన గింజ చీడలను తరిమేది

– గోరటి వెంకన్న

స్వేచ్ఛను తపించే కవి

కవి నిరంతరం అధ్యయనశీలిగా ఉండాలి, నిరంతరం చలనశీలిగా ఉండాలంటారు కవి శివారెడ్డి. కవిత్వాన్ని సాధన చేసే ఈనాటి తరాన్ని మనసారా హత్తుకుని ఆశీర్వదిస్తారు. కవిత్వాన్ని రాసినట్లే కవి జీవించాలని ఆయన నమ్ముటమే కాదు ఆచరించి చూపే సృజనశీలి. దేశవిదేశాల కవిత్వాన్ని చదవటం, కవులతో పరిచయాలు ఇవన్నీ వారి కవిత్వానికో కొత్త పరిమళాన్ని అద్దాయి. అనువాదాలను కలుపుకుంటే ఇప్పటికి ఇరవైఏడు పుస్తకాలు ప్రచురించారు. 2010వ సంవత్సరానికి 'పక్కకి ఒత్తిగిల్లితే' పుస్తకానికి 'సరస్వతీ సమ్మాన్' పురస్కారం అందుకున్నారు. మరో విషయం... కవిత్వాన్ని అందంగా చదవటం వారి ప్రత్యేకత. 'కవులేంజేస్తారు' అన్న వారి కవిత ప్రతి కవి గుండెలోనూ ప్రతిధ్వనించింది.

'కొంచెం స్వేచ్ఛగావాలి' ఇప్పుడు వెలువడిన వారి కొత్త సంపుటి. వారిలోని గాఢతాత్వికతను ప్రతిఫలించే సంపుటి. ఇప్పటికీ వారినల్లుకునుండే పల్లెవాతావరణం, పల్లెపదాలు, పల్లెలోని కుర్రాడిగా మారిపోయి అనేక దృశ్యాలను ఆవిష్కరించాలనే ఆరాటం.. ఇవన్నీ ఆయనలో చెరగని ముద్ర వేసుకున్న కొన్ని జీవన చిత్రాలు. అవన్నీ ప్రాణం పోసుకున్న అక్షరాలై కవితలై మన హృదయంలోకి జారిపోయి మన జ్ఞాపకాలను వెలికి తీస్తాయి. కవి ఇది చేయగలడని చూపిస్తాయి.

రేపటిరోజును కలగనమంటే ఈ కవి ఎలా చెబుతాడో చూడండి...

"ఎప్పుడో భూమిలో పడ్డ విత్తు
రేపు మొలకెత్తి సూర్యుణ్ణి మింగుతుందని
నే కలగంటా...
ఇంటి ముందు గంటవాయించుకుంటూ
నుంచున్న భిక్షార్థి
రేపు పరమశివుడై తాండవ నృత్యం చేస్తాడని
నే కలగంటా...నే కలగంటా"

చుట్టూ చీకటి పేరుకున్నా ఆశలన్నీ నిరాశలై చుట్టూ చీకటి పేరుకు పోతున్నా కలగనడం మానరీకవి. నిశ్చయంగా రేపు తనదే అంటాడు. అందరినీ రేపును జపించమంటారు. సమాజాన్ని మేల్కొలిపే కవి జాగరూకుడై జాగర్తలు చెప్పాల్సిందే అంటారు. అలాగే కవి నిర్ద్వంద్వంగా చెప్పాల్సింది చెప్పాల్సిందే అని, సూత్రాన్ని పాటించడంలో మొహమాటం వుండకూడదంటారు శివారెడ్డి. పుస్తక మకుటం కవిత 'కొంచెం స్వేచ్ఛగావాలి' కవిత వారి ఈ భావాలను స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. ఇంతకీ ఎలాంటి స్వేచ్ఛ కావాలంటాడీ కవి అంటే...

"మనిషిని మనిషని చెబటానికి/ పశువుని పశువని చెబటానికి
కొంచెం స్వేచ్ఛగావాలి/ రాత్రిని రాత్రని చెబటానికి
పగటిని పగలని చెబటానికి"
చివరిగా ఒక మాటంటాడు
"కొంచెం స్వేచ్ఛగావాలి/ రెక్కలల్లార్చి/గాల్లో ఎగరటానికి"

ప్రధానంగా కవి సమాజానికో దిక్సూచిగా నిలవాలని పిలుపిస్తాడిక్కడ.

శివారెడ్డి గారి కవితలన్నీ నిదానంగా నింపాదిగా మొదలై ముగిసే సమయానికో అలజడి సృష్టిస్తాయి. చాలా సందర్భాలలో ఈ కవి తనని తాను వెతుకుతూ సాగుతుంటాడు. ఒక్కోసారి దొరుకుతాడు.. దొరక్క వేదనగా మిగిలిపోయిన క్షణాలనూ కవితీర్చీకరించుకుంటాడు. ఆ ప్రయాణంలోకి మనలను లాక్కెళ్ళిపోతాడు. 'ఒకానొక ఎండాకాలం' అనే శీర్షికతో వచ్చిన కవితలో తప్పిపోయిన బర్రె కోసం వెతికే కుర్రాడిని వర్ణిస్తూ ఎన్నిదేశాలు తిరిగాడో అంటారు. ఎలా తిరిగాడుట.. కాళ్ళకి చెప్పుల్లేక.. నెత్తిమీద గుడ్డలేక.. గుండీల్లేక వేలాడుతున్న చొక్కాతో తిరిగాడుట.

అప్పటి ఆ బాలుడే ఇప్పటి ఈ వృద్ధుడట.. బర్రె కనిపించిన ఆనందాన్ని కవి ఇలా వర్ణిస్తాడు

"దూరాలన్నీ దు:ఖపూరితాలేకాదు/ దుర్మార్గపు ఎండాకాలాలేకాదు
అరవిరిసిన అనుభవ/ ఆనందపు తోటలు కూడా" అని ముగిస్తాడు.

అంటే మార్గాన్ని చూసో గమ్యాన్నో చూసో వెనుకడుగేయొద్దు.. ఎవరు కేక విని రాకపోయినా ఒకడివే పదవోయ్ అన్న టాగోర్‌ని జ్ఞప్తికి తెస్తారు..



ముందే చెప్పుకున్నట్లు శివారెడ్డి గారికి చలనశీలత్వం ఇష్టం. 'ఏదీ ఆగదు' అనే కవితలో "జీవనదర్శనమంటే కదిలే దాన్ని– దాని సమస్త చేతనతో పట్టుకోవడమే" అంటారు. అదే కవితలో మరోచోట "జీవించటమంటే పరిణామశీలంలో ఉన్న పరిపక్వతని అందుకోవటమే" అంటారు. ప్రతి వాక్యమూ పరిపక్వం చెంది మనలను స్పృశించేలా చేయడమే కవి సాధించాల్సిందేమో అనిపిస్తుంది. అలాంటి వాక్యాలను ఈ కవి పుష్కలంగా పొదుగుతాడు.

ఒక జ్ఞాపకం నుంచి ఇంకో జ్ఞాపకంలోకి సాగటం ప్రతి అడుగునూ ప్రతి కదలికనూ విశ్లేషించటం వ్యాఖ్యానించటం ఇష్టం ఈ కవికి. అసలు ప్రతి సందర్భాన్నీ నిర్భీతిగా చూడగలటమే కవి కర్తవ్యమని వీలైనప్పుడల్లా చెబుతుంటారు శివారెడ్డి. చిన్నప్పటి అనుభవాలను ఈనాటి అనుభూతులుగా మార్చుతూనే ఆ అనుభవాలకో సార్వజనీనతను కల్పించటంలో లక్ష్యం వారికి. వేపచెట్టు, అల్లం వంటి కవితల్లో దాన్ని మనం చూడొచ్చు. వేపచెట్టు కవిత చిన్నప్పుడు అందరమూ చూసిన వేపచెట్టు జ్ఞాపకంతో మొదలవుతుంది.

"వేపచెట్టెక్కి ఉయ్యాలూగడం/ ఊళ్ళో పిల్లలకు వేడుక
రాత్రిళ్ళు నిద్ర పోతున్నప్పుడు/ చెట్టు ఒహూం ఒహూం పాడేది"

దానితోపాటు కవి ఇతర అనుభూతులలోకి కూడా వెళతాడు. చేలమీంచి వచ్చే 'పైరగాలి పిట్టలా వచ్చి వాలేది'ట. చావిడో ఇల్లో పశువులో మంత్రంలా మారిపోయే వాళ్ళు అంటూనే ఇపుడవన్నీ 'ఇసుకలో వేగుతున్న వేరుశనక్కాయల్లా కమ్మని వాసనతో చుట్టుముడుతున్నాయని' కవి గుర్తుచేసుకుంటాడు. అయితే...

"అప్పటి వేపచెట్టు యిప్పటికీ నాలోకి చేతులు జొనిపి పురిపెడుతుంది" అంటాడు. కానీ కవి అనుభవం ఇక్కడితో ఆగదు. ఇది తన తరువాతి తరాలకు సాగినప్పుడే అది తీరం చేరిన నావవుతుందంటాడు. అందుకే వేపచెట్టు కవిత ఇలా ముగుస్తుంది.

"చనిపోవని రాయి ఒకటి
నానుంచి, నా మనవడికి సంక్రమిస్తుంది" అని ప్రబోధించాడు.

ఈరోజు ఆ transformation జరుగుతోందా అని అందరమూ వేసుకోవాల్సిన ప్రశ్న.

కవి కున్న అనుభవమూ ఆర్ద్రత మనుషుల పట్ల ప్రేమా ప్రతి కవితనూ తడుముతాయి. మనలను భుజాలు తడుముకునేలా చేస్తాయి. 'ఆకురాలుతుంది' అనే కవితలో రాలిన ఆకు కోటిగొంతుకలతో పాడుతూ విప్పారుతుంది అంటూనే చెట్టును నరికే వాళ్ళను అడవులు చుట్టు ముడతాయి సుమా అని హెచ్చరిస్తాడు కవి.

శివారెడ్డి గారు బాల్యంలోకి వెళ్ళినప్పుడు కళ్ళవెంట నీళ్ళుంటాయి. ఊళ్ళు తిరిగినప్పుడు ఆ ఊరి ఉత్తేజాన్ని పొందుతారు. మనకు పంచుతారు. మనిషిని చూసినప్పుడు ద్రవిస్తారు. క్రమంగా బాధను కవితగా స్రవిస్తారు.... 'మనిషిని వింటాను' కవితలో అదే చేస్తారు. "విప్లవాన్ని భుజాన మోస్తున్న వీరులు కదలికలు రేపుల్ని చూస్తాను.. మీటుతా.. పొద్దుటి పూటల్ని మీటుతా.. శిశువు కనులు మీద వాలుతున్న పావురాలు కృతనిశ్చయాల్ని మీటుతా" అంటూ నిశ్చయించుకున్న దారిలో సాగే బాటసారి ఏక్తార మీటుతున్నట్టు ధ్వనిస్తారు.

పాతతరం వారిని కాస్త గౌరవించాలన్న స్పృహను పెంచుదామన్న విషయం ఎంతందంగా వివరిస్తారో చూడండి. కవితా శీర్షిక 'ఇప్పుడు'.

'నీకు మృదువయిన పిలుపులు కావాలి/ తడిచూపులు కావాలి
కరుణ, ఖర్జూరపు చెట్లు కావాలి'

కానీ అవి దొరకని చోటుగా ఈనేల ప్రస్తుతం మారిపోయింది అన్న బాధను వ్యక్తం చేస్తారు.

'ఇది సర్పవనం– కూర్మికి తావులేదు/ పురాగమనాలు, పూర్వ స్మృతులులేవు' అన్న ముగింపుతో ఎందరో దు:ఖాన్ని పరుస్తారు..

అసలు ఈ కవి తాత్విక భూమిక లేకుండా ఏ కవితైనా ముగించారా అనిపిస్తుంది. అనేక నగరాలను సందర్శించినప్పుడు ఆ నగరపు జ్ఞాపకాలను తనవెంట తెచ్చుకుని కవిత్వం చేస్తారు.

ప్రతి కవితను పరిమళంతోనో, బాధను మెలేసే నిట్టూర్పుగా మార్చటంగానో కవి శివారెడ్డి చేస్తుంటారు. దాదాపు నూటిరవై పద్యాలకు పైగా ఉన్న 'కొంచెం స్వేచ్ఛగావాలి' సంపుటి చదవటమంటే అనుభూతుల సంద్రంలో పడవ ప్రయాణం లాంటిది. ఇంకా ఇంకా కలియ తిరగాలనిపిస్తుంది. ఇది శివారెడ్డి గారు చేసిన మరో ఆంతరంగిక ప్రయాణం. చుట్టూ ఉన్న ప్రపంచపు కోణాలను తన కంటితో మనకు చూపుతారు. ప్రేమగాలి తరకలు మనలను తాకుతాయి. అందుకే మనమూ దు:ఖిస్తాము. కాస్త ప్రేమను నింపుకుంటాం. మరికొంత ఆవేశాన్ని ఒంపుకుంటాం. కాసేపు ఒంటరి ద్వీపాలమవుతాం. శివారెడ్డిగారు మిమ్మల్ని కుదురుగా కూర్చుండ నివ్వకపోయినా వేకువ వెలుగులో వేసే అడుగులా ఈ కవితలన్నీ నిద్రించే లోపలి మనిషిని తట్టిలేపి భుజం తడతాయి. మనిషికో భరోసా ఇమ్మంటాయి. ఇది గదా కవి చేయాల్సిందని సూచన చేస్తాయి.

– సి.యస్.రాంబాబు, 9490401005

ఊరి గుండె బండ బారింది

శౌతవాహన శాసన వేదికలు
ఎలగందుల ఏలుబడి కోటలు
పత్రహరిత దుప్పట్ల పల్లెలు
మానేరు తీర పూతోటలు
సంతోషాల పరిమళ మల్లెలు
ప్రకృతి ప్రసాద సౌభాగ్య తోరనాలు!
ఎములాడ రాజన్నసాక్షిగా
నాంపల్లి నరసింహుని ఎదుట
పాలకులు, నాయకులు ఏకమై
బరితెగించి బండల్ని భోంచేసి
బంగళాలు కట్టారు బతుకనేర్చినోళ్ళు
ఉసూరుమన్నాయి అమాయక బతుకులు!
క్వారీలు, కట్టింగు, పాలిషింగ్‌ల
కబంధ హస్తాల్లో పల్లె సీమలు
బండల్ని పిండి చేసే విస్పోటనాలు
బీటలు వారెను గుట్టలు, గుండెలు
ధూళి దూరి కన్నీటి ఊటలు
బరువెక్కిన ఊసులు, ఊపిరితిత్తులు!
ఊరి గుండె బండబారింది
బావుపేట బావురుమంది
ఖాజీపూర్ ఖాళీ అయ్యింది
ఒద్యారం ఓదార్పు కోరింది
ఎలగందుల ఎక్కెక్కి ఏడ్చింది
బద్దిపల్లి బోరు బోరుమంది
ఆసిఫ్ నగర్ అదిరిపడింది!
హలానికి చెదలు పట్టింది
కర్రును తుప్పు భోంచేసింది
చేను చెల్క ఎండి మండింది
కర్ణభేరి బెంబేలెత్తింది
మనిషి, మాట మూగబోయింది
పర్యావరణం అనాథ అయ్యింది!
చట్టాలకు తిరిగి పదునుపెట్టి
బడాయిబాబుల్ని తడిమి, తరిమి
ఊరికి ఊపిరిపోసి, పోషించి
దుక్కిలో నాగలిని నాట్యమాడింది
ఫలసాయంతో గుమ్ములు నింపి
పల్లెల్లో శ్రీమంత శోభలద్ది
గ్రామీణ భారతం గర్వంగా బతుకాలే!

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

వివక్షపై ధిక్కార స్వరం

అంగారస్వప్నంలోని కవిత్వమంతా దాదాపుగా స్త్రీ కేంద్రంగా సాగుతుంది. నేరుగా, అంతర్లీనంగా స్త్రీ స్వరం పలుకుతుంది. భౌతికమైన అస్తిత్వవాద గొంతుకలోనూ, స్వప్న లోకాలలోనూ స్త్రీ ప్రతిబింబం దర్శనమిస్తుంది. స్త్రీవాద అస్తిత్వాన్ని, వేదనను, నిస్సహాయ స్థితిని, పురుషాధిక్య భావజాలంలో నలిగిపోతున్న ఓ సమూహాన్ని సున్నితంగా వేదనాభరితంగా ఆవిష్కరించినా, అంతర్లీనంగా ధిక్కారస్వరం వినబడుతుంది. ఇందలి కవితలకు కవయిత్రి ఊర్మిళ ఎంచుకున్న వస్తువు ఏంటి అన్న సంశయాత్మక ఆలోచనల్లోకి పాఠకుడిని అడుగులు వేయించేలా కవితా గమన ప్రవాహం ఉంది. పలు కవితల్లో వస్తు గమనంతో పాటు కవితాత్మ ప్రస్ఫుటమైతే, మరి కొన్ని కవితల్లో చివరి అక్షరం అంచున నిలబడ్డ పాఠకుడిని, మరోసారి కవిత మొదటి అంచు నుండి ప్రయాణించాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతుంది. ఇక్కడ ఈ కవితల్లో పాఠకుడిలో సమాధానం కాదు, సంఘర్షణ మొదలవుతుంది. ఆ వస్తువు పట్ల కవితలోని పాదాల నుండి పాఠకుడు తనకున్న ఆలోచనా విధానంలోకి, పరిణితిలోకి ఆత్మావలోకనం చెందుతూ ప్రయాణం చేస్తాడు. అక్కడ, ఆ సమయంలో, ఆయా భావావేశాల్లో జనించిన సంస్కరణాత్మక విధానాల వల్ల ఆ కవితకు సర్వకాలీనత లభిస్తుంది. అలాంటి కవితా నిర్మాణ శైలే 'అంగారస్వప్నం' నిండా ఊహాతీత కలల నుండి వాస్తవిక ప్రపంచాన్ని చూపిస్తూ సజీవంగా శ్వాసిస్తూ పలకరించి కదిలిస్తాయి. సరళమైన పద బంధాలతో, కొంగొత్త అభివ్యక్తులతో లోతైన భావోద్వేగాలు, భావావేశాలు ఈ కవితల్లో ప్రాణం పోసుకుని, అస్తిత్వ ప్రకంపనలను సృష్టిస్తాయి. కప్పి చెప్తూ సాగే కవితా నిర్మాణ ప్రక్రియలైన అల్లిగొరి, మెటాఫర్‌లు ఈ కవితల్లో భాగమై, కవిత్వమై తారసపడి కవిత్వ స్థాయిని నిర్దేశించాయి. కవితలోని ఇమేజరీ పాఠకుడికి పాఠకుడికి మధ్య భిన్నంగా దృశ్యమానం అవుతుంది. స్త్రీ జీవితంలోని అనేక పార్శ్వాల్ని 'చిరు నవ్వులను కన్నీళ్లను, వాస్తవాలను స్వప్నాలను, చేదు గత వర్తమానాలను, ఆశా కాల గమనాలను' స్పృశిస్తూ విభిన్నంగా విలక్షణంగా సాగుతుందీ కవిత్వం.

'ఆమె ఒక నిశీధి నిస్వన గీతం, కానీ అంతరంగంలో తుఫాను బీభత్స శకలాల చిరునామా'. ఆ శకలాల చిరునామాయే కవయిత్రి ఎంచుకున్న కవితాత్మ. ఆ చిరునామా అంత: వేదన ఏంటి అన్నది పాఠకుడికి వదలబడిన అంత: సంఘర్షణ.

ఒకే ఒక వాక్యంలో స్త్రీ వాద కవిత్వ అస్తిత్వాన్నీ, మనో వేదనలను ఆర్ద్రతతో తడుతూ, పురుషాధిక్య భావజాలాన్ని సున్నితంగా విమర్శించిన వాక్యం 'ఛాయా గీతిక' కవితలోని 'రాయని ఉత్తరం చివరి సంతకాన్ని'. ఒక్క వాక్య నిర్మాణంలో సగటు స్త్రీ జీవితం, సమాజంలో అనాదిగా సాగుతున్న వివక్ష లోతుగా ఆవిష్కృతమైంది. ఆ రాయని ఉత్తరం శూన్యమైన స్త్రీ జీవితానికి ప్రతీకగా కవి చెప్పదలుచుకున్నారా, లేక మరేదైనా అంతర్లీన కోణం దాగి ఉందా అన్న భిన్న ఆలోచన పాఠకుడికి వస్తుంది. అక్కడ 'మేటవేసిన ఇసుకలో కూరుకుపోయిన ఆలోచన స్వరం' గుండెతడిని తట్టి లేపి అనాచ్ఛాదిత మనసు కదలికలలోని ప్రకంపనలు సృష్టిస్తుంది. ఆ ప్రకంపనల నుండి భావ సంద్రపు అలల్లోకి ప్రవేశించిన మనసుకు అస్తిత్వం కోసం, స్వాతంత్ర్యం కోసం వేచి చూస్తున్న పొడి బారిన ఓ సమూహం కన్నీటి చెమ్మలను వేదనతో నింపుకుని కదిలిస్తుంది.

'మూసుకున్న పెదవులు సైతం లావాను పొంగించగలవు. మూగగా ముడుచుకున్న మనోనేత్రం కత్తుల వంతెన కట్టగలదు' అంటూ కటువైన స్వర భావావేశానికి అంతరంగాలలో ప్రజ్వరిల్లుతున్న ఆక్రోశపు తడి అద్దుకున్న కవిత చిత్రిక. కవితలోని పదాలలో భావోద్వేగాలతో నిండిన భావావేశం ఉంది. భావంలో తరాల తరబడి కొనసాగుతున్న వివక్షకు కన్నీటి చిత్రాన్నద్దిన ఇమేజరీ ఉంది. కవిత ప్రారంభంలో సగటు మహిళ మనోఫలకంపై పడ్డ మాయని మచ్చలు ఆవిష్కృతమైతే, 'నడి రోడ్డు మీద రాలి పడ్డ అర్ధణాకై వంగడంలో కూడా ఆనందముందంటే' అన్న వాక్యం ద్వారా వస్తు నిర్మాణం సగటు స్త్రీ నుండి వేశ్యగా మారిన నిస్సహాయురాలి వైపుకు పాదులు కదిపింది. విలక్షణమైన అభివ్యక్తి నవ్యతతో, వ్యూహాత్మక శైలితో సాగిన ఇలాంటి కవితలు సంపుటి నిండా ఓ వర్గపు అస్తిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తూ జీవం పోస్తున్నాయి.

ఈ కవితల్లో 'నా శవ పేటికను నేనే నిర్మించుకోనా' లాంటి వాక్యాల్లో ఉన్న ధిక్కార స్వరం, నేరుగా పురుష ఆధిపత్య భావజాలాలపై కాక, ఆ ఆధిపత్య వ్యవస్థలో నలుగుతున్న మరో వర్గపు కొన ఊపిరులను ప్రపంచం ముందు ఆవిష్కరించడానికి అధిక ప్రాముఖ్యతను ఇచ్చింది. విమర్శించడం కన్నా

సంస్కరించడానికి అధిక ప్రాధాన్యతనిచ్చి సంయమనం పాటించింది.

భౌతికమైన వాస్తవికమైన ప్రపంచాన్ని దృశ్యమానం చేసిన చోటే, 'చూపుల తాకిడిని మొగ్గలా ముడుచుకునే' పరవశమూ ఉంది.

'సౌగంధిక పరిమళాల ఒంపులో, గూటిలో ఒదిగిన గువ్వ నిర్నిద్ర కలవరింత'ల స్వప్నావేశమూ వుంది. ప్రేమ విరహం స్వప్నాలతో సగటు మహిళ మనసులో మెదిలే భావాలూ ఇక్కడ వస్తువులో వైవిధ్యాన్ని స్పృశించాయి.

'అంగారస్వప్నం'లోని కవితల్లో జీవితంలోని ఒడిదుడుకులను దగ్గరగా చూసిన తాత్వికత, అందులోని లోగుట్టును గుప్పిట బంధించిన మార్మికత, అభివ్యక్తి నిర్మాణంలో నూత్న సరళి ప్రస్ఫుటమవుతున్నాయి. వస్తువును క్రమబద్ధీకరించిన విధానంలోనూ, శిల్పంలోని నవ్యత లోనూ, బలమైన ఉద్వేగాలకు సున్నితత్వాన్ని జోడించడంలోనూ లోచూపు ప్రద్యోదకమవుతుంది. ప్రతీ కవితలో నుండి ప్రాణం పోసుకునే అంతరంగ కోణాలు విస్తృతవ్యాప్తిని పరుచుకుని సమాధానం కోసం అన్వేషించమని ప్రశ్నిస్తాయి. నిలదీస్తాయి. ఆ నిలదీత నుండి అసలైన వాస్తవికతలోకి పాఠకుడు అడుగులు వేస్తాడు. కవయిత్రి ఊర్మిళ గారి జీవితాభవఘర్షణను నింపుకున్న కవిత్వంతో సంలీనమైన పాఠకుడు, తనదైన జీవితపు ధోరణులనుండి నిర్మాణాత్మక సమసమాజ ప్రపంచంలోకి, సంస్కరణలోకి అడుగులు వేస్తాడు. అదే అంగారస్వప్న విజయం.

(ఊర్మిళ కవితాసంపుటి 'అంగారస్వప్నం', 'రొట్టమాకురేవు కవిత్వ అవార్డు – 2019' అందుకుంటున్న సందర్భంగా)

– పరవస్తు విష్వక్సేన, 8328384951

నేడు సాహితీకిరణం కవితల పోటీ బహుమతి ప్రదానం

మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్, సాహితీకిరణం ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ కళాలలిత కళావేదికలో జరుగుతుంది.

–పొత్తూరి సుబ్బారావు, మద్దాళి రఘురామ్

యువకవి సమ్మేళనం

నల్లమల – యురేనియం సమస్యలపై ఈ నెల 10 తేదీ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటలకు యువకవి సమ్మేళనం జరుగుతుంది. ఈ సభలో కె.శ్రీనివాస్, ఎం.విప్లవ కుమార్, డా॥బెల్లి యాదయ్య, సుద్దాల అశోక్‌తేజ, ఉత్తేజ్, పసునూరి రవీందర్, భూపతి వెంకటేశ్వర్లు, ఎ.విజయ్ కుమార్, గడ్డం మోహన్‌రావు, అనంతోజు మోహనకృష్ణ, నర్రా ప్రవీణ్, జి.నరేష్ పాల్గొంటారు.

నవలా స్రవంతి

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'నవలా స్రవంతి'లో భాగంగా ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో ఆచార్య బిరుదురాజు రామరాజు 'తెలుగు వీరుడు' నవలపై డా॥సాగి కమలాకర శర్మ ప్రసంగం వుంటుంది. సభకు డా॥నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు.

– డా॥ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి

పోతులూరి వీరబ్రహ్మం రాష్ట్రస్థాయి సమ్మేళనం

కర్నూలు లలిత కళాసమితిలో ఈ నెల 12వ తేదీన ఉదయం నుండి సాయంత్రం వరకు పోతులూరి వీరబ్రహ్మం రాష్ట్రస్థాయి సాహిత్య సాంస్కృతిక సమ్మేళనం జరుగుతుంది. ఇందులో కేతు విశ్వనాథ రెడ్డి, కొలకలూరి ఇనాక్, తెలకపల్లి రవి, నగ్నముని, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, పులికొండ సుబ్బాచారి, ఎం.వి.ఎస్. శర్మ, ఎస్. వెంకట్రావు, మేడిపల్లి రవికుమార్, షేక్ హుస్సేన్ సత్యాగ్ని, శాంతి నారాయణ, దార్ల వెంకటేశ్వర రావు, ఎం.ఎం. వినోదిని, మూల మల్లికార్జున రెడ్డి, ప్రసాదమూర్తి, కోయి కోటేశ్వర రావు, కె. ఆనందాచారి తదితరులు పాల్గొంటారు. ఇదే సభలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 1. కర్మయోగి వీరబ్రహ్మం (ఆచార్య ఎన్. గోపి), 2. పోతులూరి వీరబ్రహ్మం (డా॥ ఎం.ఎం. వినోదిని), 3. కాళికాంబ సప్తశతి, 4. పోతులూరి వీరబ్రహ్మం పద్యాలు (డా॥ రాచపాళెం), 5. వేమన–వీరబ్రహ్మం–ఒక సంభాషణ (జి.కళ్యాణరావు), 6. బ్రహ్మంగారి రచనలు–సామాజిక స్పృహ (డా॥ఎం. మల్లిఖార్జున రెడ్డి), 7. విప్లవ కవియోగి వీరబ్రహ్మం (ఆచార్య పులికొండ సుబ్బాచారి), 8. పోతులూరి వీరబ్రహ్మం తాత్వికత – తులనాత్మకత, 9. సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం, 10. వీరబ్రహ్మం గారి కవిత్వం, కవిత్వాంశాలు పుస్తకాల ఆవిష్కరణ వుంటుంది.

- కెంగార మోహన్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి - 94933 75447

రొట్టమాకురేవు కవిత్వ అవార్డు ప్రదానోత్సవ సభ

ఈ నెల 12వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం దొడ్డి కొమరయ్య హాల్లో రొట్టమాకు రేవు కవిత్వ అవార్డు ప్రదానోత్సవ సభ జరుగుతుంది. కృష్ణుడు (ఆకాశం కోల్పోయిన పక్షి), సిద్ధార్థ కట్టా (ఒక...), ఊర్మిళ (అంగార స్వప్నం) లకు అవార్డులు ప్రదానం చేస్తారు. 2017 వ సంవత్సరానికి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ అవార్డు అందుకున్న నర్సింకు సత్కారం, యాకూబ్ ఐదవ కవితా సంపుటి 'తీగల చింత' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాలు వుంటాయి. ఈ సభలో ప్రసేన్, కె.శ్రీనివాస్, కె.శివారెడ్డి, దేవిప్రియ, జూలూరు గౌరీశంకర్, జి.లక్ష్మీనరసయ్య పాల్గొంటారు.

– శిలాలోలిత, కవి యాకూబ్ – 91 9849156588

పుస్తక సంపుటాల పోటీకి ఆహ్వానం

సృజనసాహితి వారి 'శ్రీ శివేగారి దేవమ్మ స్మారక జాతీయ పురస్కారం – 2019' పుస్తక సంపుటాల పోటీకి నవల, కథా, కవితా, వ్యాసాల సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. పుస్తకాలను డిసెంబర్ 31వ తేదీలోపు శివేగారి చిన్నికృష్ణ, ఇంటి నంబరు 1–76, కాలువపల్లి (గ్రామం), కొటూరు (పోస్ట్), పలమనేరు (మండలం), చిత్తూరు (జిల్లా), ఆంధ్రప్రదేశ్ – 517408 చిరునామాకు పంపాలి.

– శివేగారి చిన్నికృష్ణ, 6300318230

బాలసాహిత్య రచనలకు ఆహ్వానం

నారంశెట్టి బాల సాహిత్య పీఠం వారు అందించే 'నారంశెట్టి బాల సాహిత్య పురస్కారం 2019' కోసం బాల సాహిత్యంలో వివిధ రంగాలలో కృషి చేస్తున్న వారి నుండి బాల సాహిత్యాన్ని ఆహ్వానిస్తుంది. అక్టోబర్ 15 లోపు సాహిత్యకారులు తమ రచనలను 8328642583 కు వాట్సాప్ కు గాని, UMAMAHESHNARAM@GMAIL.COM కు మెయిల్ గాని చేయవచ్చు. చిరునామా : గుడ్ల అమ్మాజీ ప్రధాన కార్యదర్శి, నారంశెట్టి బాల సాహిత్య పీఠం, పార్వతీపురం – 535 501.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

అవినీతి వ్యతిరేక కవితల పోటీ

అమరావతి సాహితీమిత్రులు, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సంయుక్త నిర్వహణలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'అవినీతి వ్యతిరేక కవితల పోటీ' నిర్వహిస్తున్నది. ఇందుకోసం 20 పాదాలకు మించని పద్య కవిత/ వచన కవిత/ గేయం ఏదైనా ఒకటి మాత్రమే పంపించవచ్చు. కవితల్ని నవంబర్ 20లోపు అందేలా డా॥ రావి రంగారావు, 101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్, 5వ లైను తూర్పు గోరంట్ల, గుంటూరు 522034 అడ్రసుకు పంపాలి. వాట్సాప్ నెం : 9247581825.

– డా.॥రావి రంగారావు, డా॥ టి.సేవకుమార్ 9247581825

తెలంగాణ బాల సాహిత్య చరిత్ర సర్వస్వం

తొలినాళ్ళ నుండి ఇప్పటి వరకు తెలంగాణలో వచ్చిన బాల సాహిత్యాన్ని రికార్డు చేయాలని 'తెలంగాణ బాల సాహిత్య చరిత్ర సర్వస్వం' సంకల్పించింది. ఇందుకోసం పాల్కురి సోమన నుండి నేటి దాకా వచ్చిన తెలంగాణ బాల సాహిత్య వివరాలను సూచించాల్సిందిగా, అందుబాట

మనసు పెట్టి నేర్చుకోవాలి..

అరుదైన కళాప్రదర్శనలకు రవీంద్రభారతి మరోసారి వేదికైంది. ఒకేసారి 125మంది వీణా కళాకారులు వేదికపై కొలువై సప్తస్వరాల రాగాలాపనలతో సంగీతాభిమానుల మనసులు రాగరంజితం చేశారు.'గాంధీ వాదం విపంచి నాదం' గా వేదికపై సంగీత స్వరాలను పలికించారు. వీణాధారలై ఆశీనులైన వారిలో సగానికి వీణా కళాకారులు పైగా ఒకే వ్యక్తి శిష్యులు, ప్రశిష్యులు. ఈ అరుదైన సంఘటన తన జీవితంలో మధురమైన సందర్భం అంటున్నారు ప్రముఖ సంగీత గురువు, వీణా విద్వాన్ శారద శర్మ. వందలాది మంది శిష్యులకు, వేలాది మంది ప్రశిష్యులకు సంగీత స్వరాలు నేర్పించిన వీణావిశారద. నాలుగు దశాబ్దాలుగా ఎందరినో కళాకారులుగా తీర్చిదిద్దిన ఆమె పరిచయం..

చిన్నతనం నుంచే సంగీత పాఠాలు వింటూ పెరిగినా.. సంగీతం నేర్చుకోవాలన్న ఆసక్తి మాత్రం ఉండేది కాదు. మా అమ్మ సీతామహాలక్ష్మిగారికి సంగీతమంటే చాలా ఇష్టం. బాగా పాడతారు. ఆమె పాడితే ఎం.ఎస్ సుబ్బలక్ష్మి గాత్రం విన్నంత మధురంగా ఉండేది. కానీ, ఆమెకు సంగీతం అబ్బలేదు. మా ఇంటి పక్కనే ఉండే సత్యనారాయణ గురువు గారు సంగీతం నేర్చుకోమని ఎంతో ప్రోత్సహించేవారు. విజయవాడ మ్యూజికల్ కాలేజీలో వాయలిన్ విద్వాంసులు కోటిపల్లి సూర్యప్రకాశ్ రావు గారు లెక్చరర్‌గా ఉండేవారు. ఆయన మా ఇంట్లో అద్దెకు వచ్చారు. ఆయన పిల్లలకు సంగీతం నేర్పిస్తున్నప్పుడు వింటూ ఉండేవాళ్లం. అలా మాకు సంగీతజ్ఞానం వచ్చింది. అలా ఆయన ప్రోద్బలం, అమ్మ ప్రోత్సాహంతో అక్కకు తోడుగా సంగీతం క్లాసులకు వెళ్ళేదాన్ని.

వీణా యాభై రూపాయలు..

అక్కతో పాటు మ్యూజికల్ కాలేజికి వెళ్లి సంగీతం నేర్చుకున్నాను. సంగీతం క్లాసులకు వెళ్ళిన తర్వాత వీణా నేర్చుకోవాలన్న ఆసక్తి పెరిగింది. వీణా కొనిమ్మని అడిగాను. నేర్చుకుంటేనే కొనిస్తాను అనేవారు. ఆ రోజుల్లో వీణా యాభై రూపాయలు. అంత డబ్బు పెట్టి కొనడం కూడా కష్టంగానే ఉండేది. సర్టిఫికేట్ కోర్సు పరీక్ష రాయాలంటే పదేండ్లు నిండాలి. ఏడేండ్లకే మ్యూజికల్ కాలేజీకి వెళ్ళినా పదేండ్లు వచ్చిన తర్వాత 1969లో సర్టిఫికెట్ కోర్సు ,. 1971లో డిప్లొమా పాస్ అయ్యాను. ఈ లోగా పెండ్లి చేశారు. ఆ తర్వాత మావారి ప్రోత్సాహంతో టిటిసీ పూర్తి చేశాను.

మూడు ప్రాంతాల్లో...

కర్నూలు మ్యూజికల్ కాలేజీలో ఉద్యోగాల ఇంటర్వ్యూ కోసం పిలుపు వచ్చింది. ఉద్యోగం అక్కరలేదు అని నాన్నగారు అభ్యంతరం చెప్పినా అన్నయ్య నన్ను ఇంటర్వ్యూకు తీసుకువెళ్ళారు. అలా నేను ఇరవై ఏండ్లకై కర్నూలు మ్యూజికల్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. అక్కడ చేరిన తర్వాత ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీపాద పినాకపాణిగారి వద్ద సంగీతం, ఆయన భార్య బాలాంబగారి వద్ద వీణాలో మెళకువలు నేర్చుకున్నాను. 18ఏండ్లు కర్నూలు మ్యూజికల్ కాలేజీలో పనిచేశాను. విజయవాడ మ్యూజికల్ కాలేజీలో విద్యార్థిగా సంగీతం నేర్చుకుని కర్నూలు మ్యూజికల్ కాలేజీలో గురువుగా పాఠాలు చెప్పి మంథని మ్యూజికల్ కాలేజీలో ప్రిన్సిపల్‌గా రిటైర్ అయ్యాను.

రేడియో, టీవీల్లోనూ..

కర్నూలులో మ్యూజికల్ కాలేజీకి వయసులో పెద్దవాళ్ళు కూడా

వచ్చేవారు. వారిలో చాలామంది ఇంటి వద్ద 'ఓ సే శారద' అంటూ పిలిచినా కాలేజీలో మాత్రం మేడమ్ గారు అని పిలిచేవారు. చాలా సరదాగా ఉండేది. మావారు విద్యాశాఖలో పనిచేసేవారు. ఆయనకు హైదరాబాద్‌కు బదిలీ కావడంతో నేను కూడా సికింద్రాబాద్‌లో శ్రీ భక్త రామదాసు మ్యూజికల్ కాలేజీలో లెక్చరర్‌గా బదిలీ పై వచ్చాను. 13ఏండ్ల పాటు ఇక్కడ పనిచేసిన తర్వాత మంథని మ్యూజికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ వచ్చింది. అక్కడ పనిచేస్తూ 2011లో రిటైర్ అయ్యాను. ఆకెళ్ళ మల్లిఖార్జున శర్మగారి ప్రోత్సాహంతో రేడియోలోనూ, ఆ తర్వాత టీవీలోనూ వీణా వాయించాను. విదేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చాను. ఎన్నో విశిష్టకార్యక్రమాలకు సంగీతం కంపోజ్ చేశాను.

ప్రతిపటా..

సంగీతం ఒక సబ్జెక్ మాదిరిగా కాకుండా జీవితమాధుర్యాన్ని అందించే అంశంగా భావించేదాన్ని. అందుకే సంగీత సాధన, బోధన ఎంతో ఇష్టంగా చేస్తూ ప్రతి ఏటా బెస్ట్ మ్యూజిక్ టీచర్ అవార్డు తీసుకున్నాను. సంగీత విద్వాంసులు, సినిమా మ్యూజిక్ డైరెక్టర్స్ చేతుల మీదగా అవార్డు అందుకున్నాను. రిటైర్‌మెంట్ తర్వాత ఇంటివద్ద సంగీతం నేర్పిస్తున్నాను. ఇప్పటికీ ప్రతిరోజూ వీణా సాధన చేస్తాను. మా ఇద్దరు కొడుకులకు సంగీతంలో ప్రవేశం ఉంది. మనుమలిద్దరూ వీణా నేర్చుకుంటున్నారు.

అరుదైన గౌరవం...

ఇటీవల రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా 'గాంధీ వాదం విపంచి నాదం' పేరుతో 125మంది వీణాకళాకారులతో సంగీత కచేరి నిర్వహించింది. మ్యూజిక్ కాలేజీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వచ్చింది. అక్కడకు వెళ్ళిన తర్వాత చూస్తే వారిలో నా శిష్యులు, ప్రశిష్యులే సగానికి పైగా ఉన్నారు. అందరూ ఒకే వేదికపై కూర్చోని సప్తస్వరాలను పలికించడం అరుదైన, అపురూపమైన దృశ్యంగా అనిపించింది. నా జీవితంలో లభించిన అద్భుతమైన అవకాశంగా భావించాను.

నిరంతర సాధన..

చిన్నప్పుడు సంగీతం నేర్చుకుంటే ఏం వస్తుంది.. అనుకునేదాన్ని. ఇప్పుడు సంగీతంతో జీవితం సంతోష మయం అవుతుంది అన్నది అనుభవపూర్వకంగా స్పష్టమైంది. కళ మనల్ని ఎప్పుడూ ఉల్లాసంగా ఉంచుతుంది. కళ నేర్చుకోవడానికి వయసుతో పనిలేదు. కావల్సిందల్లా మనసు పెట్టి నేర్చుకోవడమే. తాము ఎంచుకున్న కళలో రాణించాలనుకునేవారు నిరంతర సాధన చేయాలి. నిరంతర సాధనతో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు.

✍ వి.యశోద

పాలిచ్చే తల్లికి పోషకాహారం

- తల్లి పాలు తల్లీ, బిడ్డల యొక్క శారీరక, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయన్న విషయం అందరికీ సుపరిచితమే. పాపాయి రోగనిరోధక శక్తిని పెంచి, శరీర ఎదుగుదలకు కావలసిన పోషకాలను అందించటమే కాకుండా బిడ్డకు తల్లిపట్ల నమ్మకాన్ని ప్రేమని పెంచుతుంది. తల్లిని రొమ్ము క్యాన్సర్ల బారినుండి కాపాడి, బిడ్డకు తనే పాలివ్వగలుగుతున్నాననే మానసిక ఆనందాన్ని సొంతం చేస్తుంది.
- అందుకని తల్లి ఆహారంలో అన్ని పోషక పదార్థాలుండటం చాలా అవసరం. అయితే గర్భంతో ఉన్నప్పటికంటే పాలిచ్చేటప్పుడు తల్లి 500 కేలరీల ఆహారాన్ని అధికంగా తీసుకోవలసిన అవసరం ఉంది. ఈ అదనపు కేలరీలు అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, తాజా పండ్లు, ఎండు పండ్లు తినడం ద్వారా శరీరానికి అందిస్తే, తల్లికీ, బిడ్డకీ ఎంతో ఆరోగ్యకరం.

- చాలామంది తల్లులు బిడ్డకు అజీర్తి చేస్తుందనో లేదా సుస్తి చేస్తుందనో తమ ఆహారాన్ని కొన్ని కూరగాయలు, పండ్ల వరకే పరిమితం చేసుకుంటారు. అది మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతీ 100 మంది పిల్లల్లో కేవలం 3 నుండి 7గురిలో మాత్రమే తల్లి ఆహారపుటలవాట్లు బిడ్డ మీద ప్రభావం చూపుతాయంట. అదీ చాలా తక్కువ స్థాయిలో. అందుకని పాలిచ్చే తల్లులను అన్ని రకాల ఆహారాలను తినమని సూచిస్తున్నారు. దీనివల్ల ఇంకొక లాభం ఏంటంటే ఆరు నెలల తరువాత పిల్లలు ఘన ఆహారాలకు తొందరగా అలవాటు పడతారంట. తల్లిపాల ద్వారా తల్లి ఆహారంలో తీసుకున్న అన్ని రకాల రుచులు వాళ్ళ నాలుకకు ముందే తెలియడమే దీనికి కారణం.

పాలిచ్చే తల్లి తప్పకుండా తీసుకోవలసిన ఆహారం

నీరు: పాలిచ్చే సమయంలో మన శరీరంలోని నీటి శాతం తగ్గిపోతుంది. మన శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవటం కోసం ఎక్కువ నీరు తాగడం ఎంతో అవసరం.

ఆకుకూరలు: అన్ని ఆకుకూరలు మంచివే. కాని ముఖ్యమైనవి పాలకూర, తోటకూర. వీటిలో ఉండే ఫైటో ఈస్ట్రోజెన్ అనే పదార్థం రొమ్ము ఆరోగ్యాన్ని మెరుగుపరచి పాల ఉత్పత్తిని పెంచుతుంది.
క్యారెట్: వీటిలో ఫైటో ఈస్ట్రోజన్ తో పాటు నాణ్యమైన పాల ఉత్పత్తికి అవసరమైన విటమిన్ ఎ, బీటా కెరోటిన్ ఉంటాయి.

చిక్కుడు: చిక్కుళ్ళ జాతికి చెందిన కందిపప్పు, గోరుచిక్కుడు, బఠాణీలు, చిక్కుడు కాయలు తల్లి శరీరానికి అవసరమైన పిండిపదార్థాలను అందిస్తుంది. శనగలు నానబెట్టి, ఉడకబెట్టి గుగ్గిళ్ళలాగా కొద్దిగా ఉప్పు, నిమ్మరసం, వెల్లుల్లి తాళింపు వేసుకుని తింటే రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం.

బొప్పాయి పండు: తల్లికి పాలు బాగా పడాలంటే పండు బొప్పాయి కంటే పచ్చి బొప్పాయి ఎంతో తోడ్పడుతుంది. తురుముకుని కూర చేసుకున్నా, పాలు, చక్కెర వేసుకని హల్వా చేసుకున్నా మంచిదే.

దంపుడు బియ్యం: దంపుడు బియ్యంలో ఉండే కార్బోహైడ్రేట్ల వల్ల తల్లికి ఎక్కువ శక్తిని అందించటమే కాకుండా పాల ఉత్పత్తిలో సహాయపడే ప్రొలాక్టిన్ హార్మోన్ ని విడుదల చేయటంలో కూడా తోడ్పడుతుంది.

డ్రై ఫ్రూట్స్: కుర్బానీలు, ఖర్జూరాలు, అంజూరపండ్లలో ఎక్కువగా ఉండే కాల్షియం పాల ఉత్పత్తికి దోహదపడుతుంది.

చేపలు: చేపలలో ఉండే ఒమేగా-3-ఫాటీ యాసిడ్స్ మరియు ఎసెన్షియల్ ఫాటీ యాసిడ్స్ పాలల్లో మంచి కొవ్వును పెంచి ఇంకా ఆరోగ్యవంతమైన పాల తయారీలో సహాయపడతాయి.

చర్మం తాజాగా

రోజూ కాసేపు సమయం కేటాయిస్తే చాలు చూపు తిప్పుకోనివ్వని అందం మీ సొంతమవుతుంది. రోజూ పావుకప్పు పాలలో చెంచా గంధం, కాస్త నూనె, రెండు చుక్కల తేనె కలిపి ముఖానికి పూతలా రాసుకోవాలి. ఆరే వరకూ ఉంచి ఆ తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఆపై పాలమీగడ ముఖానికి రాసుకుని కాసేపాగి కడిగేసుకుంటే సరి. మృత కణాలు తొలగి చర్మం తాజాగా మారుతుంది.

-సమాన పరిమానంలో కీరదోస రసం, గులాబీ నీళ్ల, నిమ్మరసం, గ్లిజరిన్ కలిపి ఆ మిశ్రమాన్ని బయటి నుంచి తిరిగొచ్చాక ముఖానికి రాసుకోవాలి. ఇలా రోజూ చేయడం వల్ల మొటిమలు, బ్లాక్‌హెడ్స్ సమస్యలు తగ్గుముఖం పడతాయి. అలాగే కప్పు నిమ్మరసంలో అరకప్పు కాచిన పాలూ, టేబుల్ స్పూను గంధం పొడీ కలిపి ముఖానికీ, మెడకీ పూతలా వేసుకుని ఆరాక కడిగేసుకోవాలి. ఇలా రోజూ చేస్తుంటే చర్మంపై టాన్ తొలగిపోతుంది. చెంచా చొప్పున తేనె, చక్కెరా, కొంచెం పాలమీగడా తీసుకుని దాన్ని ఒంటికి పట్టించి నలుగుపెట్టుకోవాలి. తరువాత గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే చర్మం నునుపుగా మారుతుంది.

నిద్రపట్టట్లేదా?

వయసు పెరుగుతుంటే నిద్ర సరిగా పట్టదు అంటుంటారు. అయితే ఈ మధ్య కాలంలోటీనేజ్ పిల్లలనుంచి మధ్య వయస్కుల దాకా వయసుతో సంబంధం లేకుండా నిద్రలేమితో భాదపడుతున్నారు. అందుకు మారిన జీవన విధానం, ఒత్తిడి, వేళకి ఆహారం తీసుకోకపోవడం ఇలా ఎన్నో కారణాలు వున్నాయి. అయితే తరచూ నిద్రలేమితో భాదపడుతుంటే ఒక్కోసారి మీరు తీసుకునే ఆహారం గురించి ఆలోచించండి అంటున్నారు నిపుణులు.

- మంచి నిద్ర పట్టాలంటే పిండి పదార్థాలు ఎక్కువగా వుండే ఆహారం తీసుకోవాలి. ఎందుకంటే పిండి పదార్థాలు ఎక్కువగా వుండే ఆహారం తీసుకోవడం వల్ల అవి "ట్రిప్టోఫాన్" అనే అమినోఆమ్లాలను మెదడుకు పంపిస్తాయి. దాంతో నిద్ర ముంచుకు వస్తున్న భావన కలుగుతుందట. అందువల్ల పిండి పదార్థాలు అధికంగా వుండే బియ్యం, గోధుమలు, బ్రెడ్, రాగి, కార్నెఫ్లెక్స్ వంటివి రోజూ నిద్రపోయే ముందు మన ఆహారంలో వుండేలా చూసుకోవాలట.
- అలాగే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ మన శరీరంపై మత్తుగా ఉండేలా ప్రభావం చూపిస్తాయట. కాబట్టి మనం తీసుకునే ఆహారంలో వీటి శాతం తగ్గితే నిద్రలేమి కలగవచ్చు. అందుకు పాలు , ఆకు కూరలు, బాదం, జీడి పప్పు, వంటివి ఆహారంలో చేర్చటం తప్పనిసరి.

- పడుకునే ముందు మాంసకృత్తులు అధికంగా వుండే స్నాక్స్ తినకపోవటమే మంచిది. ఎందుకంటే ఈ మాంసకృత్తులు మనం తిన్న ఆహారం నుంచి "ట్రిప్టోఫాన్స్"ని మెదడును చేరకుండా అడ్డుకుంటాయట. దాంతో సరిగా నిద్రపట్టదు. కాబట్టి రాత్రిపూట ప్రోటీన్లు ఎక్కువగా వుండే ఆహారం తీసుకుంటే అజీర్ణంతో నిద్రపట్టదు. అలాగని అన్నలు తినకపోతే ఆకలికి నిద్రపట్టదు. కాబట్టి సమతులాహారం సరిపడా తీసుకోవడం ఉత్తమం అని సూచిస్తున్నారు నిపుణులు.

శశాంకభుజాంగాసనం

రెండుకాళ్ళు ముందుకు చాపి దండాసనంలో కూర్చోవాలి. ఇప్పుడు కుడికాలు కుడితొడ కింద, ఎడమ కాలు ఎడమతొడ కింద పెట్టి వజ్రాసనంలోకి మారాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ రెండు చేతులు పైకి ఎత్తాలి. శ్వాస నెమ్మదిగా వదులుతూ రెండు చేతులు ముందుకు సాగదీస్తూ తల భూమికి తాకేలా వంచాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ భుజాంగాసనంలోకి రావాలి. ఇలా ఒక రౌండ్ చేయాలి. క్రమం తప్పకుండా రోజూ పదిరౌండ్స్ చేయాలి.

ఉపయోగాలు..

- అధిక బరువు తగ్గుతారు. ముఖంలో కాంతి పెరుగవుతుంది
- శ్వాసక్రియ మెరుగయ్యి, శ్వాస కోశ వ్యాధులు తగ్గుతాయి.
- ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరగవుతుంది.
- నడుము నొప్పి తగ్గుతుంది, చేతులలో బలం చేకూరుతుంది.
- థైరాయిడ్ సమస్య తగ్గుతుంది.

ఆరోగ్యానికి యోగ

జాగ్రత్తలు..

- మోకాళ్ళ నొప్పులు ఉన్నవారు చాలా జాగ్రతగా ఈ ఆసనం సాధన చేయాలి.
- మోకాళ్ళ సర్జరీలు, భుజాల సర్జరీలు అయిన వారు డాక్టరు సలహాతో యోగానిపుణుని పర్యవేక్షణలో సాధన చేయాలి.

శ్రీచందన
9666665458

ఇలా చేస్తే నల్లులు మాయం

కావలసినవి: ఉల్లిపాయ సగం, నాలుగు వెల్లుల్లి రెబ్బలు , రెండు కప్పుల నీరు, రెండు చెంచాల మిరియాల పొడి, సగం చెంచాడు ద్రవ రూపంలో ఉన్న గిన్నెల సబ్బు, గరాటు, స్ప్రే బాటిల్, పాత నైలాన్ వస్త్రం.

తయారీ విధానం: ఒక గిన్నెలో ఉల్లిపాయ, వెల్లుల్లి, నీరు, మిరియాల పొడి, గిన్నెలని కడిగే సబ్బు తీసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని మరొక గిన్నెలోకి నైలాన్ వస్త్రం సహాయంతో వడపోయాలి. ఇలా వేరుచేసుకున్న ద్రావణాన్ని గారాటు ద్వారా స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. నల్లులు ఎక్కువగా కనపడే ప్రదేశాలలో ఈ ద్రవాన్ని చల్లితే ఇట్టే మాయవుతాయి.

epaper.navatelangana.com

49 మంది ప్రముఖులపై దేశద్రోహం కేసు ఉపసంహరించుకోవాలి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ: దేశంలో పెచ్చరిల్లిపోతున్న మూకదాడులు, విద్వేష ప్రచారాలను వ్యతిరేకిస్తూ వివిధ రంగాలకు చెందిన 49 మంది ప్రముఖులు ప్రధాని మోడీకి బహిరంగ లేఖ రాస్తే, వారిపై దేశద్రోహం కేసు బనాయించడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. వారిపై పెట్టిన తప్పుడు కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ప్రధానికి లేఖ రాసినవారంతా ఆయా రంగాల్లో లబ్ధ ప్రతిష్టులు. అటువంటివారిపై కేసులు బనాయించడం గర్హనీయమని పేర్కొంది. పార్టీ పొలిట్‌బ్యూరో ఆదివారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం కూడా దేశద్రోహ నిబంధనను ఇంకా కొనసాగించడాన్ని సీపీఐ(ఎం) ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటుంది. దేశ ద్రోహ చట్టాన్ని బ్రిటీష్ పాలకులు తీసుకొచ్చారు. తమ రాచరిక వ్యవస్థను, సామ్రాజ్యాన్ని కాపాడుకోవడం కోసం దీనిని ఒక సాధనంగా ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం వాడుకుంది. గాంధీజీతో సహా ఇతర స్వాతంత్ర్య సమరయోధుల నోరు నొక్కేందుకు దీనిని ప్రయోగించింది. గాంధీజి 150వ జయంతిని జరుపుకుంటున్న ఈ సందర్భంలో ఈ నిబంధనను నేర శిక్షా స్మృతుల నుంచి తొలగించడం అత్యంత సముచితంగా ఉంటుంది. దేశంలో జరుగుతున్న పలు ముఖ్యమైన అంశాలపై తమ అభిప్రాయాలను చెబుతూ ప్రధానికి లేఖ రాయడం ఎంతమాత్రం నేరం కాదు, దేశ వ్యతిరేకత అంతకన్నా కాదు. ఈ చర్య ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై అసమ్మతి తెలియజేసిన వారినందరినీ శిక్షించడమే. ప్రజాతంత్ర హక్కులను ఇది పూర్తిగా నిరాకరించడమే.దేశంలో పెరిగిపోతున్న నిరంకుశ పోకడలకు ఇది దర్పణం పడుతోంది. రాజ్యానికి వ్యతిరేకంగా హింసను ప్రేరేపిస్తూ నేరుగా పిలుపునిచ్చినప్పుడు మినహా మరే ఇతర సందర్భాల్లోను దేశద్రోహ క్లాజు కింద అభియోగం మోపడానికి వీల్లేదని 1961లో సుప్రీం కోర్టు స్పష్టంగా వెలువరించిన తీర్పు కళ్లముందున్నప్పటికీ, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులపై దేశద్రోహం కేసు నమోదు చేయాలంటూ ముజఫర్‌పూర్ కోర్టు ఆదేశాలు ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. ఈ రీత్యా సుప్రసిద్ధ మేధావులు, కళాకారులపై మోపిన దేశద్రోహ అభియోగాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

48 గంటల్లో గేటు బిగిస్తాం

- మూసీ రిజర్వాయర్ పరిశీలించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-కేతెపల్లి

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం మూసీ రిజర్వాయర్‌లో నీటి ఉధతికి కొట్టుకుపోయిన 6వ నెంబర్ రెగ్యులేటర్ గేటును 48 గంటల్లో అమర్చి డ్యామ్ మరమ్మతులు పూర్తి చేస్తామని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మూసీ ప్రాజెక్టు 6వ నెంబర్ గేటు ఊడిపోయిందన్న సమాచారం అందగానే సీఎం కేసీఆర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. సీఎం వ్యక్తిగత కార్యదర్శి స్మితసబర్వాల్, ఇంజనీరింగ్ చీఫ్ మురళీధర్‌రావుతో కలిసి ఆదివారం మూసీ ప్రాజెక్టును మంత్రి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. 1991లో మూసీ ప్రాజెక్టు కోసం అదనంగా ఐదు గేట్లు నిర్మించినట్టు చెప్పారు. అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి సమీపంలోని కల్యాణ డ్యాం కోసం అదనంగా ఏర్పాటు చేసిన గేట్లను అక్కడికి తరలించారన్నారు. అక్కడ మూడు గేట్లను వినియోగించుకోగా మరో రెండు గేట్లు అలాగే ఉన్నాయన్నారు. కల్యాణ డ్యాం నుంచి అదనపు గేటును తీసుకురావాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని చెప్పారు. ఈ నెల 9 వరకు మరమ్మతులు పూర్తి చేసి నీటిని నిల్వచేస్తామని చెప్పారు. ఆయకట్టు రైతులకు రెండు పంటలకు కుడి, ఎడమ కాల్వ ద్వారా నీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారివెంట రాజ్యసభ సభ్యులు బి.లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్లు డాక్టర్ గౌరవ్‌ఉప్పల్, అమయ్‌కుమార్, నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలవనున్న ఆర్టీసీ జేఏసీ నేతలు!

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల సమ్మెపై రాష్ట్రప్రభుత్వ అణచివేత ధోరణిని గవర్నర్ శ్రీమతి తమిళసై సౌందర్‌రాజన్‌కు వివరించాలని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలు యోచిస్తున్నారు. ఇందిరాపార్కు వద్ద దీక్షలు చేపట్టకుండా పోలీసులు అర్ధరాత్రి అనుమతి నిరాకరించినందున గవర్నర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరనున్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఇప్పటికే మద్దతు తెలిపిన రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు కూడా గవర్నర్‌ను కలవాలని సూచించాయి. దీనిపై సోమవారం నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే కేంద్రమంత్రుల్ని కూడా కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం.

అప్పుల బాధతో కానిస్టేబుల్ ఆత్మహత్య

నవతెలంగాణ-నేరేడుచర్ల

అప్పుల బాధతో తట్టుకోలేక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు గ్రామానికి చెందిన వీరపనేని శ్రీధర్ (36) మహబూబ్‌నగర్ జిల్లాలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పెద్దకుమారుడికి అక్షరాభ్యాసం చేయించడానికి ఇటీవల తన సొంత గ్రామానికి వచ్చాడు. అక్షరాభ్యాసం చేయించిన శ్రీధర్ ఆదివారం చిన్నకుమారుడికి అన్నప్రాసనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఇంతలోనే ఆయనను కుటుంబ సభ్యులు అప్పుల విషయమై మందలించే సరికే మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మురళి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీనది ప్రాజెక్టు గేటు బద్దలయిన నేపథ్యంలో నష్టనివారణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.జంగారెడ్డి, టి.సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. గేటును ఎత్తడంలో వైఫల్యం వల్లనే నీటి వత్తిడితో గేటు బద్దలయినట్టు తెలుస్తున్నదని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి నష్టం మళ్లీ జరగకుండా నిధులు కేటాయించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. గేటు సరిగ్గా ఉన్నదా? లేదా? అనే విషయాన్ని ప్రాజెక్టులో నీరు చేరక ముందే నిర్వహణలో భాగంగా పరీక్షించాల్సి ఉన్నా అధికారుల వైఫల్యమే ప్రమాదానికి కారణంగా కనిపిస్తున్నదన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం కూడా ఇలాగే గేట్లు కొట్టుకుపోవడంతో నీరు నిల్వక రైతులు మాగాణి వేయలేకపోయారన్నారు. బద్దలైపోయిన గేటు స్థానంలో వెంటనే మరొక గేటును బిగించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ సమ్మెకు ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు కార్మికుల మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్‌ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పూర్తి మద్దతిస్తున్నట్టు తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్(ఎఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రభుత్వ రంగ సంస్థ అనీ, ప్రజా రవాణా వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సంస్థ నష్టాలకు కార్మికులే కారణమంటూ రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారాన్ని చేయడాన్ని ఖండించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతూ, ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్మికులు నిరసనలు, దిష్టిబొమ్మ దహనాలు, ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు.

మెట్రో పిల్లర్ల నీటిధారలు!

చిన్నపాటి వర్షాలకూ ఊరుస్తున్న వైనం

- ప్రయాణించాలంటేనే జంకుతున్న ప్రజలు
- అనుభవాల నుంచి మేల్కొని అధికారులు
- వలలు ఏర్పాటు చేయాలంటున్న వాహనదారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షాలకు మెట్రో పిల్లర్ల నుంచి నీళ్లు కారుతున్నాయి. చిన్నపాటి వానలకు కూడా చెమ్మతో తడిగా కనిపించడంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. అమీర్‌పేట ఉదంతాన్ని గుర్తుచేసుకుంటూ గుండెలు చేతిలో పట్టుకుని మెట్రో మార్గాల కింద ప్రయాణిస్తున్నారు. క్షణం కూడా అక్కడ నిలవకుండా లంకించుకుంటున్నారు. అమీర్‌పేటలో పెచ్చులూడి మహిళ మృతిచెందిన తర్వాత అన్నిస్టేషన్లలో సమస్యలు గుర్తించి భద్రతా చర్యలు చేపట్టామని అధికారులు ప్రకటించినా నగరపౌరులు నేటికీ భయం భయంగానే మెట్రోల కింద వెళ్తున్నారు.

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎల్‌బీనగర్ - మియాపూర్ రూట్‌లోని పలు పిల్లర్లు చెమ్మ పడుతున్నాయి. వర్షం ఆగిన తర్వాత కూడా వాటి మీద నుంచి నీరు పారుతోంది. హైటెక్ సిటీ రూట్‌లో ఇటీవలే చేపట్టిన మెట్రో ఫ్లైఓవర్లు సైతం పలుచోట్ల పగుళ్లు వచ్చాయి. నగరంలో దాదాపు అన్ని శివారు ఏరియాలను ప్రధానమైన జేబీఎస్, ఎంజీబీఎస్, అమీర్‌పేట, మియాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, తార్నాక, నాంపల్లి వంటి ప్రాంతాలను కలుపుతూ మెట్రో నిర్మాణాలు చేపట్టారు. మెట్రో మార్గాల కింద లక్షల మంది ప్రయివేటు, సొంత వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. ఇటీవల మహిళ ప్రమాదం తర్వాత వారంతా ప్రాణాలు చేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి. ఉప్పల్, స్టేడియం, తార్నాక, బేగంపేట స్టేషన్లలో వర్షం కురిస్తే ప్లాట్‌ఫాం వద్ద నిలబడేందుకు కూడా వీలు ఉండదు. నాగోల్, ఉప్పల్, హబ్సిగూడ, తార్నాక, మెట్టుగూడ స్టేషన్ల వరకూ మెజారిటీ మెట్రో పిల్లర్లు నీటి చెమ్మతో తడిసి పాతబడిపోయాయి. ఆదివారం వర్షం ఆగిన గంట తర్వాత కూడా తార్నాకలోని పలు పిల్లర్ల నుంచి నీటి ధారలు వస్తుండటం గమనార్హం.

హెచ్‌ఎంఆర్‌లో పలు నిర్మాణాలు చేపట్టేందుకు ఎం-30,40,45 కాంక్రీట్, 12టి13 లేదా 19ఇ15 స్టీల్‌ను వినియోగిస్తున్నామని అప్పట్లో ప్రకటించారు. మాస్ రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం (ఎంఆర్‌టీఎస్) అభివృద్ధి యత్నంలో భాగంగా మెట్రో నిర్మించారు. ఈ నిర్మాణాల్లో రైళ్లు గంటకు 90కిలోమీటర్ల వేగంతో నడిపించే సామర్థ్యంతో చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం 35 కి.మీ వేగంతో రైళ్లు నడుస్తున్నాయి. చెబుతున్న టెక్నాలజీ ప్రకారం నిర్మాణం చేపడితే ఏండ్ల తరబడి నిలవాల్సింది..మూడేండ్లకే పగుళ్లు పట్టి కనిపించడం విస్తుపరుస్తున్నది. రానున్న రోజుల్లో మెట్రో రైళ్ల వేగం, ఫ్రీక్వెన్సీ మరింత పెరగనుండటంతో ఆ మేరకు నిర్మాణాల సామర్థ్యం ఉన్నదా అనేది నగరవాసులను వేధిస్తున్న ప్రశ్న. వరుస వర్షాలతో పిల్లర్లు చెడిపోయి త్వరగా కూలిపోయే అవకాశం ఉంది. ఇటీవల స్టేషన్లను పరిశీలించి భద్రతాపరంగా చర్యలు తీసుకుంటామన్న అధికారులు నిర్మాణాలను కాపాడే ప్రయత్నాలేవీ చేయలేదు. సీఎంఆర్‌ఎస్ చేపట్టిన పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొనేందుకు వచ్చిన వారిని అన్ని వివరాలు అడిగిన తర్వాతే లోపలకు పంపించడం ద్వారా ఎల్‌అండ్‌టీ, హెచ్‌ఎంఆర్‌ఎల్ అధికారులు విమర్శల పాలయ్యారు.

ఫ్లైఓవర్ల కింద వలలు అవసరం..

మెట్రో పిల్లర్లు, స్టేషన్ల అవసరాన్ని బట్టి 20 మీటర్లు, ఆపైన నిర్మాణాలు చేపట్టారు. అంత ఎత్తు నుంచి పడే చిన్న పెచ్చు కూడా ప్రాణాలు తీస్తుందని ఇటీవల ఘటన నిరూపించింది. మెట్రో నిర్మాణం ప్రతిపాదన నాటినుంచీ వాటి కింది సిమెంట్ నిర్మాణాలు రోడ్ల మీద పడకుండా వలలను ఏర్పాటు చేయాలని కోరుతూ వస్తున్నారు. అయినా మెట్రో అధికారులు పెడచెవిన పెడుతున్నారు. నిర్మాణాలను పరిశీలిస్తే వచ్చే రోజుల్లో మరెందరికి ప్రమాదంగా మారనున్నాయోననో ఆందోళన కలిగిస్తున్నది. మెట్రో అధికారులు స్పందించి నిర్మాణాల నాణ్యతను పెంచేలా చర్యలు తీసుకోవాలనీ, నగరవాసుల భద్రతా దృష్ట్యా వలలు ఏర్పాటు చేయాలనీ డిమాండ్ వ్యక్తమవుతున్నది.

10 నుండి నైరుతి నిష్క్రమణ ఆరంభం

- ఏపీలో సాధారణం, యూపీ, బీహార్, జార్ఖండ్, బెంగాల్‌లో లోటు
- మిగిలిన రాష్ట్రాల్లో 10 శాతం అదనపు వర్షపాతం

విశాఖ: నైరుతి రుతు పవనాల నిష్క్రమణ ప్రక్రియ ఈ నెల 10 నుంచి వాయువ్య భారతదేశం నుండి ఆరంభం కానుందని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) ప్రకటించింది. క్రమంగా రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్, ఒడిషా, ఆంధ్రా, తెలంగాణ, కర్నాటక, కేరళ మీదుగా నైరుతి వెనక్కు వెళుతుందని తెలిపింది. ఈ దశ లోనూ మోస్తరు నుంచి భారీ వర్షపాతం పడనుంది. వాస్తవానికి సెప్టెంబరు 30 నాటికే భారతదేశం నుంచి నైరుతి వెళ్లిపోవాల్సి ఉంది. ఈ ఏడాది నిష్క్రమణ ఆలస్యంగా మొదలవుతోంది. ఈ ఏడాదే కాకుండా 2009 నుంచి కూడా వాయువ్య భారతదేశం నుంచి నైరుతి నిష్క్రమణ ఆలస్యమవుతూనే ఉంది. మరీ ముఖ్యంగా ఈ ఏడాది మరింత ఆలస్యం కావడం గమనార్హం. ఆలస్యం కావడం అంటే దేశంలో ఎక్కువ రోజులు నైరుతి పవనాలు ఉండటం కింద లెక్క. ఈ పరిణామం దేశానిరి మంచిదేనని ఐఎండి అధికారులు చెబుతున్నారు. ఎక్కువ వర్షపాతం నమోదవుతుందంటున్నారు. ఈ ఏడాది ఎపి, తెలంగాణలో సాధారణ వర్షపాతం నమోదైంది. మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురవడంతో కృష్ణా, గోదావరి వంటి నదుల్లో వరదలు పొటెత్తాయి. ఇప్పటికే నైరుతి పవనాల నిష్క్రమణ ప్రకటించాల్సి ఉన్నా ఉత్తరాదిలో వర్షాలు కురుస్తున్నందున ప్రకటించలేదని, 10 తర్వాత రెండు మూడు రోజుల్లో నిష్క్రమణతో పాటు ఈశాన్య రుతుపవనాలు ప్రవేశాన్ని ఐఎండీ ధ్రువీకరించే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రజ్ఞులు రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు.

ఉత్తర కోస్తా, రాయలసీమలో భారీ వర్ష సూచన

ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా కర్నాటక వరకూ అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని ఐఎండీ తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, రాయలసీమలో నాలుగు రోజులు పాటు పలు చోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

ఆర్టీసీని విధ్వంసం చేసే కుట్ర

సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం..: ఎం.సాయిబాబు,సీఐటీయూ

ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం. కార్మికులను తొలగిస్తామనటం దారుణం. ఆర్టీసీని విధ్వంసం చేసే కుట్ర ప్రగతిభవన్ సాక్షిగా బట్టబయలైంది. ఇది నిరంకుశ విధానం. 2015లో ఆర్టీసీ వేతన సవరణను చేస్తానన్న సీఎం కేసీఆర్...నేడు వారికి జీతాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదం. నిరంతరం పెరుగుతున్న డీజిల్‌రేట్లు, విపరీత పన్నుల భారం, రాయితీలు ఇవ్వకపోవడం లాంటి విధానాలే ఆర్టీసీ నష్టాలకు కారణం. తమ ప్రభుత్వ విధానాలను కప్పిపెడుతూ ఆర్టీసీ కార్మికులు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని చెప్పడం దుర్మార్గం. కార్మిక ఉద్యమాలను అణచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక నియంతృత్వ ధోరణితో ముందుకువెళ్తున్నది. రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా మేధావులు, ప్రజాసంఘాల వాళ్లు, సబ్బండ వర్గాల వారు ఏకమై సర్కారుపై పోరాటం చేయాలి. ప్రజారవాణా వ్యవస్థ పరిరక్షణ కోసం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతాం.

ఆర్టీసీ కార్మికులను తొలగిస్తామనడం చట్టవిరుద్ధం: వీఎస్‌బోస్, ఏఐటీయూసీ

ఆర్టీసీ కార్మికులను తొలగిస్తామనడం చట్టవిరుద్ధం. ఆయనకు ఆ హక్కు లేదు. వేరే రాష్ట్రాల్లో చేయలేదని సీఎం అంటున్నరు. మరి వేరే రాష్ట్రాల్లో చేసినవి ఈయన చేశారా? వేరే రాష్ట్రాల గురించి ఎందుకు...పక్క రాష్ట్రంలో ఆర్టీసీని విలీనం చేశారు కదా? ఇక్కడెందుకు చేయరు. కొత్తవాళ్లను తీసుకుంటామంటున్నరు...ఇదీ చట్టవిరుద్ధమే. ప్రయివేటు పరం చేసే కుట్ర బట్టబయలైంది. 50 పర్సెంటేజ్ ప్రయివేటు పరం చేస్తామంటున్నారు...అలా అని ఏ చట్టంలో ఉంది? నిజాం పరిపాలన నుంచి ప్రభుత్వ పరిధిలోనే ఆర్టీసీ నడుస్తున్నది. కార్మికులకు నష్టం చేయాలని చూస్తే కార్మిక లోకం ఏకమైతది. కార్మికుల వాదం ముందు సీఎం వాదం ఓడిపోతుంది.

కార్మికులంటే లెక్కలేని తనమే : పవన్‌కుమార్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ,

ఆర్టీసీ కార్మికులంటే సీఎం కేసీఆర్‌కు లెక్కలేనితనంగా కనిపిస్తున్నది. సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. అడ్డగోలుగా ముఖ్యమంత్రి నిర్ణయాలు తీసుకోవడం దివాళాకోరుతనం. సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులు లేకుంటే తెలంగాణ వచ్చేదా? రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు కార్మికుల గురించి, సమ్మె గురించి ఏమైనా తెలుసా? ఇలాంటోళ్లు కార్మికులకు న్యాయం ఏం చేస్తారు? హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఆర్టీసీ కార్మికులకు ఐఎన్‌టీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నది.

మధ్యప్రదేశ్‌లో ఆర్థిక మందగమనం తీవ్రత

మూతపడ్డ వందలాది చిన్న పరిశ్రమలు

- ఉత్పత్తి తగ్గించిన భారీ పరిశ్రమలు
- 30-35 శాతంమేర పడిపోయిన డిమాండ్
- ఉపాధి కోల్పోయిన 15,000మంది ఒప్పంద కార్మికులు

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఆర్థిక మందగమనం స్పష్టంగా కనిపిస్తోందని పారిశ్రామికవేత్తలతోపాటు కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. పెద్దనోట్ల రద్దు, హడావుడిగా జీఎస్టీని అమలులోకి తెచ్చిన తర్వాత ఒప్పంద కార్మికుల్లో 15,000మంది ఉద్యోగాలు కోల్పోయారని, రెగ్యులర్ ఉద్యోగులకు వేతనాలు అందడంలో ఆలస్యమవుతోందని ఆ వర్గాలు తెలిపాయి. అన్ని రకాల పరిశ్రమల్లోనూ మందగమనం కనిపిస్తోందని, పారిశ్రామిక ఉత్పత్తులకు డిమాండ్ 30 నుంచి 35 శాతంమేర పడిపోయిందని వారు తెలిపారు. ఈ విధమైన పరిస్థితి వాహన రంగానికే పరిమితం కాదని, ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, సిమెంట్, రవాణా, జౌళి, విద్యుత్ పరికరాలు, థర్మల్ పవర్‌పైనా ఉన్నదని వారు చెబుతున్నారు. ఈ రంగాలలో ఉత్పాదకత, అమ్మకాలు తగ్గిపోయాయి. వందలాది చిన్న పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి.

ఆర్థిక మందగమన ప్రభావం ప్రధాన పారిశ్రామిక జోన్లయిన పీతాంపూర్(ఇండోర్‌కు సమీప ప్రాంతం), మండీదీప్, గోవిందపూర్(భోపాల్‌కు దగ్గరలో),బన్మోర్-మలన్‌పూర్(గ్వాలియర్-భింద్ ప్రాంతం), రేవా-సంతాలోని సిమెంట్ పరిశ్రమలపై కనిపిస్తోంది. మాలన్‌పూర్ పారిశ్రామిక ప్రాంతంలోని జమ్నా ఆటో ఇండస్ట్రీస్‌లో డిమాండ్ 80 శాతం తగ్గింది. జేకే టైర్ తమ ట్రక్ టైర్ల ఉత్పత్తిని నిలిపివేసింది. చిన్న టైర్ల ఉత్పత్తిని తగ్గించింది. పీతాంపూర్‌లోని జౌళిలాంటి చిన్న పరిశ్రమలు, వాహన తయారీ పరిశ్రమలు బ్యాంకులకు అప్పులు చెల్లించలేని స్థితికి చేరుకున్నాయి. ప్రభుత్వ రంగసంస్థ బీహెచ్‌ఈఎల్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేయలేని స్థితికి చేరుకున్నది. మండీదీప్‌లో పదుల సంఖ్యలో చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. మరికొన్ని కార్మికుల సంఖ్యను తగ్గించుకున్నాయి. కొన్ని వారాలుగా డిమాండ్ లేకపోవడంతో సిమెంట్ కంపెనీలు ఉత్పత్తిని నిలిపివేశాయి.

ఆర్థిక మందగమనం వల్ల 40 శాతం డిమాండ్ తగ్గిందని పీతాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియా అసోసియేషన్ అధ్యక్షుడు గౌతమ్‌కొఠారీ తెలిపారు. పలు కంపెనీలు ఒప్పంద ఉద్యోగులను తొలగించాయని, రెగ్యులర్ ఉద్యోగుల సమ్మతితో వారి వేతనాలను 10 నుంచి 15 శాతంమేర తగ్గించాయని కొఠారీ తెలిపారు. పీతాంపూర్ ప్రాంతం ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్‌ఈజెడ్) అన్నది గమనార్హం. ఇక్కడ భారీ, మధ్యతరహా, చిన్న పరిశ్రమలన్నీ కలిపి 850 వరకూ ఉన్నాయి. వాహనాల తయారీ, జౌళి, ఔషధ పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. ఈ ప్రాంతంలో దాదాపు 35,000మంది ప్రత్యక్షంగా, 8000మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. వాహనాల విడిభాగాల తయారీ పరిశ్రమల్లో 35 శాతంమేర డిమాండ్ తగ్గిందని కొఠారీ తెలిపారు. 350 ఔషధ కంపెనీలు మూతపడటం లేదా అప్పుల ఎగవేత జాబితాలో చేరడం జరిగిందని ఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు అలోక్‌దేవ్ తెలిపారు.

సదర్‌మాట్ కాల్వలో పడి బాలుడు మృతి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

సరదాగా ఆడుకుంటున్న ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు సదర్‌మాట్ కాల్వలో పడిపోయారు. స్థానికులు ఒకర్ని రక్షించినా మరొకరు నీటి ఉధృతికి కొట్టుకుపోయి మరణించాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీలో ఆదివారం ఈ ఘటన జరిగింది. ఎడ్ల సుమలత, శ్రీధర్ దంపతుల కమారుడు మహేశ్(9) మరో బాలుడితో కలిసి ఆడుకుంటూ కాలనీ సమీపంలోని సదర్‌మాట్ కాల్వ వద్దకు వెళ్లాడు. కాల్వ మెట్లపై ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు ఇద్దరు పిల్లలు కాలువలో పడిపోయారు. కాలనీవాసులు పరుగున వచ్చి ఓ బాలున్ని బయటకు తీశారు. రెండుగంటల గాలింపు అనంతరం పైపుల్లో చిక్కుకున్న మహేష్ మృతదేహాన్ని గుర్తించారు.

బహరైన్‌లో విరిసిన పూల సంబురం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ పూల పండుగ బహరైన్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. తెలంగాణ జాగృతి బహరైన్ శాఖ ఆధ్వర్యంలో బహరైన్‌లోని అదిలియాలో జరిగిన బతుకమ్మ సంబురాలు తెలంగాణ ఔన్నత్యాన్ని చాటాయి. ఈ కార్యక్రమానికి ఇండియన్ కౌన్సిల్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి మోహినీ భాటియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగతి గల్ఫ్ అధ్యక్షులు చెల్లంశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ గల్ఫ్ లో ఉన్నప్పటికీ తెలంగాణ ఆడబిడ్డలు మన పండుగలు జరుపుకోవడం, సంస్కృతిని కాపాడుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగతి బహరైన్ అధ్యక్షులు బర్కుంట బాబూరావు, నాయకులు నాగశ్రీనివాస్, ప్రభాకర్, విజయవర్ధన్, విజయ్ షిండే, అరుణ్, రవీందర్, నజీర్, సందీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

- కారుపైకి దూసుకెళ్లిన ట్రక్కు
- 8మంది మృతి, ఆరుగురికి గాయాలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ట్రక్కు కారు పైకి దూసుకెళ్లడంతో కారులో ఉన్న ఎనిమిది మంది అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఝాన్సీ జిల్లా తొండి ఫాతేపురిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి గల కారణాలు, మృతుల వివరాలు ఇంకా తెలియరాలేవని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్టు తెలిపారు. కాగా, దీనిపై స్పందించిన ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందజేయనున్నట్టు ప్రకటించింది.

బీహార్‌లో విజృంబిస్తున్న డెంగ్యూ

-

నిర్బంధాల చెలికాడు

స్ఫూర్తి

సీతారామయ్య భార్య అనసూయ గారిని ప్రత్యక్షంగా కలిసినప్పుడు, పార్టీ కృషి వలన క్రమశిక్షణ, చైతన్యం, సంస్కారం, సాహసం అతనికి అలవడ్డాయని, అవే కుటుంబ జీవితంలో కూడా వెలుగులు నింపాయని చెప్పింది. ఆ వెలుగులు పంచాడు కనుకనే, చనిపోయి ఇన్నాళ్లవుతున్నా అతని జ్ఞాపకాలు ప్రజలకూ, కుటుంబానికీ స్ఫూర్తినిస్తున్నాయన్న ఆమె మాటలు అక్షర సత్యాలు. కుల పట్టింపులు, అంటరానితనం వంటి దురాభిప్రాయాలను పార్టీ ఇచ్చిన చైతన్యంతోనే వదులుకున్నాననీ చెప్పింది. రాజకీయ ఐక్యతే అన్ని బంధుత్వాలకంటే బలమైనదనీ, పార్టీ అంటే కుటుంబమన్న భావన జీవితం తనకు నేర్పిందనీ, అందుకే పోరాటంలో వచ్చిన నిర్బంధాలు, ఆర్థిక ఇబ్బందులు చేదు జ్ఞాపకాలుగా కాక ఓ చరిత్రగా స్ఫూర్తినిస్తాయనీ, అన్నింటికీ మించి కమ్యూనిస్టు రాజకీయ పరిచయం ప్రపంచాన్ని చూపిన వెలుగురేఖగా భావిస్తాననీ ఆమె చెబుతుంటే అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. సీతారామయ్య గురించి ఆవిడ రాసిన పుస్తకాన్ని ఇస్తూ, "ఇందులో మా జీవితం ఉంది. అనుభవాలు ఆ యుధాలైన చరిత్ర ఉంది. మట్టి పొత్తిళ్లలో మరుబాంబులై పేలిన కష్టజీవుల కన్నీటి కథ ఉంది" అంటూ అట్టపై సీతారామయ్య గారి బొమ్మను చేతితో తడిమి తదేకంగా చూస్తూ కన్నీటి బిందువులు రాల్చింది. ఆమెకు ఎన్ని జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయో! బతికినంత కాలం నిర్బంధాల చెలికాడుగా, పోరాటాల విలుకాడుగా నిలిచిన సీతారామయ్య... 1997లో కన్నుమూసాడు. కానీ.. అతని మహోజ్వల జీవితాన్ని మరిపించే శక్తి మరణానికెక్కడిది...!?

కంటి పాపలకు కత్తులు మొలిపించుకొని, నిప్పుల సుడిగుండాల మధ్యన, చుట్టుముట్టిన భూస్వామ్య గుండాలను బతుకంతా ఎదిరించిన ధీశాలీ.., కష్టాల కొలిమిలో కుటుంబాన్ని పుటం పెట్టుకొని, ఎర్రజెండాను సమున్నతంగా ఎగరేసిన కార్యశీలీ కామ్రేడ్ మెదరమెట్ల సీతారామయ్య!!

నల్గొండ జిల్లా వెలిదండ గ్రామంలో లక్ష్మీనర్సయ్య, ఆ దెమ్మ గార్లకు 1924లో జన్మించాడు. తల్లి చిన్నప్పుడే మరణించింది. నాయనమ్మ శేషమ్మ గారి పెంపకంలో పెరిగాడు. భూములున్నా, సాగుయోగ్యం కాక కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. దాంతో ఊరిలో ఉన్న ప్రాథమిక విద్యతోనే చదువు ముగిసింది. తర్వాత 11ఏండ్ల వయస్సు నుండే పశువులను కాయడం, వ్యవసాయం చేయడం మొదలెట్టాడు. పాటలు, నాటకాలు, భాగవతాలు, భజనలపై ఆసక్తితో 14 ఏండ్ల వయసులోనే రామాయణ, భారత పురాణాలను చదివేవారు. దానితో ఆయన చదువు అభివృద్ధి చెందింది. పురాణ గాథలను శ్రావ్యంగా పాడే సీతారామయ్య.. అనేక పురాణ, జానపద పాత్రల్లో ప్రజలను అలరించేవారు. 19 ఏండ్లు వచ్చేవరకు ఊరిలో యువకులను నాటకాలకోసం సమీకరించిన సీతారామయ్యకు.. ఆ తర్వాత వారిని పోరాటాలకు సమీకరించాల్సిన అవసరమేర్పడింది.

వెలిదండ గ్రామం పటేల్ పట్వారీల ఆధ్వర్యంలో నిజాం ఏలుబడిలో ఉండేది. వారి అంతులేని దోపిడీ, అణచివేతలు సీతారామయ్యకు సహింపరానివిగా ఉండేవి. ఆ సమయంలో నవ యువకుడిగా, కళాకారుడిగా ఉన్న సీతారామయ్య సహజంగానే ఆంధ్ర మహాసభకు ఆకర్షితుడయ్యాడు. తన కళా నైపుణ్యాన్ని దొరతనంపైకి గురిపెట్టాడు.. దాన్ని మొగ్గలోనే తుంచివేయడానికి ఊరి దొరలు చేసిన అనేక ప్రయత్నాలు అతడిని మరింత రాటుతేల్చాయే తప్ప నీరుగార్చలేకపోయాయి.. ఊళ్లోని కొంతమంది యువకులు ఆడివినుండి చెట్టు కొట్టుకొచ్చారని, వారిపై జరిమానా విధించినప్పుడు, యువకులకు మద్దతుగా సీతారామయ్య గట్టిగా నిలబడ్డాడు. దాన్ని మనసులో పెట్టుకొన్న పటేల్ పట్వారీలు సీతారామయ్య పాటలు పాడుతున్నాడనీ... జనాలను రెచ్చగొడుతున్నాడని కేసులు పెట్టి జైలులో నిర్బంధించారు. కొన్ని సమస్యలు మనకు చెప్పి రావు. చెప్పకుండా వచ్చిన సమస్యల నుండి మనమూ తప్పించుకోలేము. అది మనం బతకడానికైనప్పుడు... మనచుట్టూ ఉన్నవారిని బతికించుకోవాల్సి వచ్చినప్పుడు వయసుతో నిమిత్తం లేకుండా పరిస్థితులే అనేక రకాల జ్ఞానాన్ని అందిస్తాయి. అదే జరిగింది మేదరమెట్ల విషయంలో!!

జైలులో కమ్యూనిస్టు నాయకుడు కొండపల్లి గోపాలరావు ద్వారా జరుగుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితులు, కమ్యూనిస్టు సిద్ధాంత విషయాలు నేర్చుకొని 9 నెలల తర్వాత బయటకొచ్చాడు. ఒకసారి సిద్ధాంతం అర్థమయ్యాక, కమ్యూనిస్టులకు కార్యాచరణ లేకుండా ఉండడం సాధ్యమవుతుందా!? అయితే ఆయన ఇంటికొచ్చేలోపే ఊరి పటేల్ ఆయన ఇల్లును తగులపెట్టించాడు. నిలువ నీడలేదు... కుటుంబమంతా చెదిరిపోయింది. భార్య పుట్టింటికి పోయింది. తమ్ముడిని వాళ్లక్క తీసుకొని పోయింది. చిన్న చెల్లెలును పక్కింటివారు వారి బంధువుల ఇంటికి తీసుకెళ్లారు. పెద్ద తమ్ముడు నారాయణ 13 ఏండ్ల వయసులో పట్టించుకునేవారు లేక, ఇల్లులేక దేశం మీద పడి తిరుగుతూ వెళ్లిపోయాడు (ఆ తర్వాత దేశ దిమ్మరిగానే చనిపోయాడు). మామూలు మనుషులైతే నీరసపడుతారు. పరిస్థితులను చూసి భయపడతారు. కానీ సీతారామయ్య జైలులోకి పోతున్నప్పటి యువకుడు కాదు. కమ్యూనిస్టు సిద్ధాంత వెలుగులో కదులుతున్న జ్ఞాని..! సమస్యల పరిష్కారం కోసం సమరానికి సిద్ధపడ్డ కామ్రేడ్..! చుట్టూ ఊరుంది.. నమ్ముకున్న ప్రజలున్నారు..అన్నిటికీ మించి చేతిలో ఎర్రజెండా ఉంది. ఇంకేం, గెలవడానికి ప్రపంచమే ఉందనుకున్నాడు. అడుగులు ముందుకేసాడు. అణువణువు తపించాడు. బతుకంతా పేదోళ్ల చేతుల్లో బందూకై నిలిచాడు.

చుట్టూ పోలీసు క్యాంపులున్నా సరే.. అంత నిర్బంధంలోనూ పార్టీ పిలుపు మేరకు వెలిదండ చుట్టూ దాదాపు 20 గ్రామాలు, తండాలల్లో రహస్యంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పూనుకున్నాడు. ఈ క్రమంలోనే వెలిదండ గ్రామ పటేల్ వక్కవంతుల మట్టయ్య అరాచకాలపై పార్టీ ప్రజాకోర్టు నిర్వహించి అతనికి ఉరిశిక్ష విధించింది. అప్పుడు సీతారామయ్యపై హత్య కేసు పెట్టడంతో, చెంచన్న, రామారావు అనే పేర్లతో అజ్ఞాత జీవితంలోకెళ్లాడు.

ఆ తర్వాత పార్టీ ఇచ్చిన మిలిటరీ శిక్షణలో పాల్గొని సాయుధ దళపతిగా తయారయ్యాడు. గ్రామాల మీద రాజాకార్లు, పోలీసులు బందిపోటు ముఠాల్లాగా దాడులు చేస్తున్నప్పుడు అడుగడుగునా అడ్డం పడ్డాడు. నిజాం పిశాచాలు గుర్రాలపై వచ్చి దాడి చేయడం మొదలయ్యాక, అశ్విక దాడులను ఎదుర్కోవాలన్న పార్టీ పిలుపు మేరకు, వ్యూహాత్మకంగా గుర్రాలపై కాల్పులు జరిపి, అవి భయపడి అడ్డదిడ్డం పరిగెత్తేలా చేసిన నైపుణ్యం సీతారామయ్య దళానిది. దాంతో రాజాకార్లు అటుపక్క రావాలంటేనే భయపడేవారు. అలా అశ్వికదళాలలో అదురు పుట్టించిన సీతారామయ్య దళం పేరు చుట్టుపక్కల గ్రామాల్లో మారుమోగిపోయింది. మెదరమెట్ల సీతారామయ్య దళమంటేనే శత్రువు హడలిపోయే పరిస్థితి..! సీతారామయ్య గురి చూసి కొడితే శత్రువు ఎంతటివాడైనా నేల కూలాల్సిందేనని ప్రతీతి..! ప్రత్యక్ష యుద్ధంలో గెలవలేనప్పుడు శత్రువు పరోక్షంగా దెబ్బకొట్టే పనిచేస్తాడు. రాజ్యానికి ఏ విలువ లుంటాయి కనుక? సీతారామయ్యను ఎదుర్కోలేక ఆయన ఇంటిని మిలిటరీ అనేకసార్లు దోచుకుంది. భార్య, అత్త, సోదరున్ని చిత్రహింసలు పెట్టారు.. భార్య అనసూయ, ఆమె తల్లి ఎర్రమ్మ, అమ్మమ్మ రాఘవమ్మ గారల తలవెంట్రుకలు తీసి గుండు కొట్టించారు. వాళ్లింటికి చుట్టం చూపుగా వచ్చిన వారిని కూడా విపరీతంగా కొట్టి గుండు కొట్టించారు. ఈ నేపథ్యంలో పార్టీ వీరి కుటుంబాన్ని గుంటూరుకు పంపింది. అక్కడా పోలీసుల వేధింపులు తప్పలేదు. రహస్యంగా బతకడానికి అన్నీ అమ్ముకొని కాలం గడుపుతూ పూట గడవని స్థితికి వచ్చారు. దాదాపు మూడేండ్లు ఎవరికీ తెలియకుండా ఒక పొగాకు కంపెనీలో పని చేసుకుంటూ అజ్ఞాతంలో బతికారు అతని భార్య అనసూయ, ఆమె అమ్మమ్మ రాఘవమ్మ..! అప్పుడు అనసూయ గారికి నెలల పాప. ఉద్యమకారుల జీవితాల చుట్టూ నిర్బంధపు వలయాలు నిరంతరం వెన్నాడుతూనే ఉంటాయి. అందుకే ఉద్యమకారుల కుటుంబ సభ్యులది కనపడని త్యాగం. లేకపోతే చిన్నవయసులో చంటి పాపతో బతకడం.... నిరంతరం శత్రువు చూపులకు చిక్కకుండా ఉండడం ఎన్ని జీవిత సత్యాలు నేర్పిందో ఆమెకు!! ఒక సారి పోరాటమే జీవితమనుకున్నాక కష్టాల పూలమాలలు తెలియకుండానే మెడలో అలంకరించబడుతాయి.

పార్టీపై నిషేధం ఎత్తేశాక కూడా 1956 వరకు సీతారామయ్య రహస్య జీవితంలోనే ఉన్నాడు. ఆ తర్వాత బయటకు రాగానే హైదరాబాద్ సెంట్రల్ జైలులో 20 రోజులుంచారు. బెయిలు మీద విడుదలై 1956 మే నుండి పార్టీ లీగల్ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాడు. సాయుధ పోరాట విరమణానంతరం కూడా భూమి కోసం జరిగిన పోరాటాలనుండి సీతారామయ్యను విడదీసి చూడలేము. రైతులకు చెందాల్సిన భూమి దొరల చేతుల్లో చిక్కుబడ్డ ప్రతీ సందర్భంలో, సీతారామయ్య పోరాటముంది. తెలంగాణ పోరాటంవల్ల అమల్లోకొచ్చిన కౌల్దారి చట్టం, కౌలుదార్లకు అనేక హక్కులు కల్పించింది. ఆ చట్టం ప్రకారం జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములకు చెందిన భూములను కౌలుకు సాగు చేస్తున్న రైతులకే ఆ భూములపై హక్కులు సంక్రమించాయి. అయితే భూస్వాములు కుట్రచేసి అనేక కేసులతో భూములు కౌలుదార్లకు చెందకుండా చేసేవారు. వెలిదండ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలను సమీకరించి ఆ భూములను నిలబెట్టడంలో నిర్విరామ కషి చేశాడు సీతారామయ్య. ఈ కృషిలోనూ అనేక దాడులు దౌర్జన్యాలను, పోలీసు కేసులను ఎదుర్కోక తప్పలేదు. వాలంటీర్ల దళాలను తయారు చేసి వాటిని ప్రతిఘటిస్తూ భూములను ప్రజలపరం చేయడంలో మొనగాడుగా నిలిచాడు.

కొన్నికొన్ని పోరాటాలు చూడడానికి చిన్నగానే ఉంటాయి... కానీ లోతుగా పరిశీలిస్తే జీవితమంత విశాలంగా ఉంటాయి. వెలిదండ ఊరిలో మాలలు బావి తవ్వుకుంటే అక్కడ నీళ్లు బాగా పడి వ్యవసాయం బాగా సాగేది. ఈ భూములను ఆ ఊరి పటేల్ పట్వారీలు కుట్రతో వారి పేరున రాయించుకున్నప్పుడు, ప్రజలు న్యాయం కోసం కోర్టుకెక్కాల్సివచ్చింది. మాలబావి వాజ్యంగా పేరుగాంచిన ఆ కేసులో సీతారామయ్య దళితుల పక్షానా నిలబడి నికరంగా పోరాడాడు. ఒకవైపు సాయుధ పోరాటంలో పాల్గొంటూనే మరోవైపు మాలబావి వాజ్యం పైనా రాజీలేని పోరు సాగించాడు. పోరాటంలో భాగంగానే ఆ కేసునూ పరిష్కరించాడు. ఈ క్రమంలో సాయుధ పోరాటంలోనే కాడు, పోరాట విరమణ తరువాత కూడా సీతారామయ్య అనేకసార్లు రహస్య జీవితం గడపాల్సి వచ్చింది. 1964 నుండి1966 వరకు, పార్టీన్ని నిర్మించే క్రమంలో, కాంగ్రెస్ వారు పోలీసుల సహాయంతో కేసులు పెట్టి, హంతక ముఠాలతో దాడులు చేయిస్తుంటే, రహస్యంగా ఉంటూనే ప్రతిఘటించాడు. సీపీఐ(ఎం) రాష్ట్రకమిటీ సభ్యుడిగా, నల్లగొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా సేవలందించిన సీతారామయ్య..1971లో మిర్యాలగూడలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడు. ప్రజల కోరిక మేరకు 1981 నుండి 86వరకు వెలిదండ గ్రామ సర్పంచ్‌గా, 1992 నుండి 1995 వరకు వెలిదండ సహకార సంఘ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. పోరాట యోధుడిగానే కాదు, ప్రజా ప్రతినిధిగానూ అనేక విలువలు నెలకొల్పాడు.

శత్రువును అంచనా కట్టడంలో, ఎత్తుగడలతో దెబ్బతీయడంలో మహా దిట్టగా పేరుగాంచిన సీతారామయ్య గొప్ప వక్త. రాజకీయాలు చెప్పేటప్పుడు పురాణాలను, రామాయణ, భారత కథలను ఉదాహరణగా తీసుకొని చెప్పేవాడు. హాస్య ప్రియత్వం, పోరాటతత్వం కలగలిసిన ఆయన జీవనశైలి ఆయనను గొప్ప ప్రజానాయకుడిగా రూపుదిద్దింది. విప్లవంకోసం ప్రాణాలను తణప్రాయంగా భావించే సాహసం, ప్రజలకోసం పనిచేయటమే అత్యున్నత కర్తవ్యమనే విశ్వాసం, స్వప్రయోజనాలను పక్కనపెట్టి సర్వం ప్రజాసేవకే ధారపోసిన త్యాగనిరతి ఆయనకు సహజాభరణాలు. గడియకో గండాన్ని దాటిన ఆయన జీవితం అతడిని వీరోచితపోరాటయోధుడిగా రాటుదేల్చింది.ఆ వీరత్వమే అతనిజీవితానికి అమరత్వాన్ని సాధించి పెట్టింది.

ఈ వ్యాస రచయిత సీతారామయ్య భార్య అనసూయ గారిని ప్రత్యక్షంగా కలిసినప్పుడు, పార్టీ కృషి వలన క్రమశిక్షణ, చైతన్యం, సంస్కారం, సాహసం అతనికి అలవడ్డాయని, అవే కుటుంబ జీవితంలో కూడా వెలుగులు నింపాయని చెప్పింది. ఆ వెలుగులు పంచాడు కనుకనే, చనిపోయి ఇన్నాళ్లవుతున్నా అతని జ్ఞాపకాలు ప్రజలకూ, కుటుంబానికీ స్ఫూర్తినిస్తున్నాయన్న ఆమె మాటలు అక్షర సత్యాలు. కుటుంబమంతా కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీవారే తోడునీడగా ఉండడమనేది ఎన్నటికీ మరువలేననీ, చిన్నాడు చుట్టూ ఉండిన కుల పట్టింపులు, అంటరానితనం వంటి దురాభిప్రాయాలను పార్టీ ఇచ్చిన చైతన్యంతోనే వదులుకున్నాననీ చెప్పింది. రాజకీయ ఐక్యతే అన్ని బంధుత్వాలకంటే బలమైనదనీ, పార్టీ అంటే కుటుంబమన్న భావన జీవితం తనకు నేర్పిందనీ, అందుకే పోరాటంలో వచ్చిన నిర్బంధాలు, ఆర్థిక ఇబ్బందులు చేదు జ్ఞాపకాలుగా కాక ఓ చరిత్రగా స్ఫూర్తినిస్తాయనీ, అన్నింటికీ మించి కమ్యూనిస్టు రాజకీయ పరిచయం ప్రపంచాన్ని చూపిన వెలుగురేఖగా భావిస్తాననీ ఆమె చెబుతుంటే అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. సీతారామయ్య గురించి ఆవిడ రాసిన పుస్తకాన్ని ఇస్తూ, "ఇందులో మా జీవితం ఉంది. అనుభవాలు ఆ యుధాలైన చరిత్ర ఉంది. మట్టి పొత్తిళ్లలో మరుబాంబులై పేలిన కష్టజీవుల కన్నీటి కథ ఉంది" అంటూ అట్టపై సీతారామయ్య గారి బొమ్మను చేతితో తడిమి తదేకంగా చూస్తూ కన్నీటి బిందువులు రాల్చింది. ఆమెకు ఎన్ని జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయో! బతికినంత కాలం నిర్బంధాల చెలికాడుగా, పోరాటాల విలుకాడుగా నిలిచిన సీతారామయ్య... 1997లో కన్నుమూసాడు. కానీ.. అతని మహోజ్వల జీవితాన్ని మరిపించే శక్తి మరణానికెక్కడిది...!?

సెల్ : 9490098694

నిజంగా ప్రపంచం మనవైపు చూస్తున్నదా?

ఆర్.మహేష్

రోజురోజుకూ దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారిపోతున్నదని పలు అంతర్జాతీయ నివేదికల్లో వెల్లడైంది. దీనికితోడు దేశ ఆర్థిక నిపుణులు సైతం ఆర్థిక మందగమనం తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశమున్నదని అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశ ఆర్థిక మందగమన పరిస్థితికి అంతర్జాతీయ పరిణామాలే కారణమంటూ యావత్ ప్రజానీకాన్ని మనదేశాధినేతలు మభ్యపెడుతున్నారు. అయినప్పటికీ వాస్తవ విషయాలను ఒప్పుకోక తప్పలేదు. ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి ప్రస్తుత పరిస్థితులను అధిగమించడానికి కార్పొరేట్లకు, ధనికులకు తాయిళాలు అందించారు. అయినప్పటికి పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో మరో అడుగు ముందుకేసి.. కార్పొరేట్ పన్నును 34.94 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. కార్పొరేట్లకు రాయితీల పేరుతో పేదోడిపై రోజురోజుకూ భారం పెంచుతున్నారు. ఇటీవల ఆర్బీఐ వెల్లడించిన పలు అంశాలు పేద, మధ్యతరగతి కుంటుంబ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. కుటుంబ పొదుపు పడిపోయిందనీ, ఆదాయ మార్గాలు తగ్గిపోయాయని కేంద్ర బ్యాంకే వెల్లడించిందంటే పరిస్థితేంటో చూడండి.. ఆర్థిక భారాన్ని, ప్రస్తుత ఆర్థిక మందగమన పరిస్థితులను అధిమించే చర్యల పేరుతో ప్రభుత్వరంగ సంస్థల్లో భారీగా ప్రయివేటు పెట్టుబడులకు మన పాలకులు తెరలేపారు. దీని కారణంగా మళ్లీ సామన్యుడిపైనే భారం పడనున్నది. ఎలాగంటే తాజాగా రైల్వేల్లో ప్రయివేటు పెట్టుబడులతోపాటు, పలు రైళ్లను నడిపే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్ని మార్గాల్లో అమలుచేస్తున్నారు. ప్రయివేటు సంస్థలు ఏ విధంగా నడుచుకుంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వాటికి కావాల్సింది లాభాలు మాత్రమే.. ప్రజాశ్రేయస్సు గురించి మాట్లాడటం దండగ... ఇన్ని ప్రతికూలతల మధ్య మన పాలకుల ప్రవర్తనా తీరు ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. దిగజారిపోతున్న పరిస్థితులను అదుపులోకి తీసుకురాడానికి బదులు వాటిని మరింతగా పెంచుతున్నారని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారంటే.. పాలకులకు తోడు మనం కూడా ఆలోచించాల్సిన తరుణమిది. కాగా మొన్నటి అమెరికా పర్యటన అనంతరం యావత్ ప్రపంచం మన వైపే చూస్తున్నదనీ.. ఎక్కడికెళ్లినా మన దేశం గురించే ఆలోచిస్తున్నారని ప్రధాని అంటున్నారు. దేశ పరిస్థితి బ్రహ్మాండంగా ఉన్నదని చెబుతున్నారు. అలాంటి పరిస్థితులుంటే జీడీపీ ఎందుకు తగ్గుతున్నది? నిరుద్యోగం ఎందుకు పెరిగిపోతున్నది? ఎందుకు విశ్లేషకులు, మేధావులు దేశ పరిస్థితుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు? ఎవరు చెప్పేది నమ్మాలి మరీ?

దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చాలా రంగాల్లో అనేక మార్పులు తీసుకొచ్చింది. వాటిల్లో ఫలితాలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ పాలకుల తీరులో మార్పు రాలేదు. దీని కారణంగా తాజా పరిస్థితులు ఏర్పడ్డాయనేది అక్షరసత్యం. కేంద్ర ఆర్థిక విధానాలతో నిరుద్యోగం పెరిగిపోతున్నది. ఈ విధానాల ఫలితంగా ఉద్యోగాలు పోగొట్టుకున్నవారు ఒకెత్తయితే.. చదువు పూర్తయి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న కోట్లాదిమంది ఎదురు చూపులు ఒకెత్తు. ఈ కారణంగా నిరుద్యోగిత పెరుగుదల రేటు రికార్డుస్థాయికి చేరింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తాజా గణాంకాలే ఇందుకు ఉదాహరణ. ఈ ఏడాది ఆగస్టు నాటికి నిరుద్యోగం పెరుగుదల రేటు 10శాతానికి చేరిందని ఆ సంస్థ తెలిపింది. నిరుద్యోగ జనాభా 4.17కోట్లకు చేరిందని నివేదిక సారాంశం. 2018లో నిరుద్యోగుల సంఖ్య 3.4కోట్లు. ఒక్క ఏడాదిలోనే కోటీ 13లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. నిరుద్యోగం ఏ స్థాయిలో పెరిగిపోతున్నదనేదానికి ఈ గణంకాలే నిదర్శనం. ఎన్ఎస్ఎస్‌వో, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ వంటి సంస్థలూ నిరుద్యోగ తీవ్రతను బయటపెట్టిన విషయం విదితమే. ఎన్ఎస్ఎస్‌వో నివేదిక బయటకు రాకుండా మోడీ ప్రభుత్వం చాలాకాలం తొక్కిపెట్టినా చివరికి బహిర్గతం చేయక తప్పలేదు. 2017-18లోనే నిరుద్యోగిత పెరుగుదల 6.1శాతానికి చేరింది. 1972-73 తర్వాత ఈ స్థాయిలో నిరుద్యోగం నమోదు కావడం ఇదేనని నివేదిక తేల్చింది. 45ఏండ్లలో ఇది గరిష్టం. చివరికి దీనిని కేంద్రం అధికారికంగా అంగీకరించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. మళ్లీ అధికారం చేపట్టిన తర్వాత అయినా కేంద్రం దిద్దుబాటు చర్యలు తీసుకుందా? అంటే అది శూన్యం! తాజాగా బీజేపీ నాయకుడు సుబ్రమణ్య స్వామి చేసిన వ్యాఖ్యలు ఆందోళనను, ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి. రాబోయే ఆరు నెలల్లో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రపరిణామాలను ఎదుర్కొనుందనీ, ఆర్థిక వృద్ధి మరింతగా దిగజారే ప్రమాదమున్నదని ఆయన చెప్పారు. ఇప్పటికైనా వాస్తవ విషయాలను గ్రహించి పాలన సాగిస్తే దేశానికి ప్రయోజనం కలుగుతుందని సగటు ప్రజానీకం కోరుకుంటున్నారు. అలాగే తమకు చేయూతనిచ్చే, వృద్ధిపథంలో నడిపించే చర్యలు ఇప్పటికైనా తీసుకుంటుందని ప్రజలు ఆశిస్తున్నారు.

rajamonimahesh@gmail.com

రావుల లావణ్య రాజేశం

పనిభారం ఎక్కువ.. జీతం తక్కువ!

తెలంగాణ ప్రభుత్వం నూతనంగా నియమించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగ భద్రత లేక పనిభారం ఎక్కువై, జీతం తక్కువై కష్టాల కడలిలో కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులపై విపరీతమైన పని భారం మోపడంతో ఉద్యోగం చేయలేక ఒత్తిడిని తట్టుకోలేక త్రిశంఖు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏ ఉద్యోగులకూ లేని కఠినమైన నిబంధనలు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగ నియమావళిలో చేర్చడం పట్ల తెలంగాణ రాష్ట్రంలోని 9000 కార్యదర్శులు ఉద్యోగం చేయడమా, మానివేయడమా? అనే మీమాంసలో ఉన్నారు. 2018 అక్టోబర్‌లో ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని 9500 పోస్టులకు రిక్రూట్‌మెంట్ నిర్వహించింది. జిల్లా స్థాయిలో మెరిట్ సాధించిన వారికి 2019 ఏప్రిల్ నెలలో హడావుడిగా నియామక పత్రాలను జిల్లా కలెక్టర్లు అందజేశారు. డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన వారు కూడా ఈ ఉద్యోగాలు సాధించారు. రాక రాక సర్కారు ఉద్యోగం రావడంతో సంబురపడ్డారు కానీ వారి సంబరం కొద్దిరోజుల్లోనే ఆవిరైపోయింది. అన్ని శాఖల సర్కారు ఉద్యోగులకు ప్రతి నెల రంచనుగా 1వ తేదిన జీతాలు వస్తుండగా జేపీఎస్‌లకు మాత్రం 3నెలలకు ఒకసారి జీతాలు రావడంతో వారి కుటుంబాల్లో నిరాశ ఏర్పడింది. జీతాలు ఆలస్యంగా రావడంతో వారి కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారింది. ప్రభుత్వం విపరీతమైన పని ఒత్తిడి పెట్టడం వల్ల మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా నష్టపోతూ శారీరకంగా అలసిపోయారు. ఇప్పటికే చాలామంది ఉద్యోగాలకు రాజీనామా చేసి ప్రైవేట్ ఉద్యోగాల వైపు పరుగులు తీస్తున్నారు. ఇంత కాలంగా ఉన్న జాయింట్ చెక్ పవర్ పోవడం, మరిన్ని అధికారాలకు ప్రభుత్వం కత్తెర వేయడం అడ్డగోలు నిబంధనలతో కొత్త చట్టం రావడం మూలిగే నక్కపై తాటి పండు పడిన విధంగా తయారైంది.

ఉద్యోగంలో చేరి 5 నెలలు గడిచినప్పటికీ వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వకపోవడంతో జీపీ రికార్డులను రాయరాక లబోదిబోమంటున్నారు. ఉద్యోగంలో చేరిన 3 నెలలకే హరితహారం ప్రోగ్రాం రావడం వీరిని ఇబ్బందులకు గురి చేసింది. ఓడీఎఫ్ టార్గెట్లు, పెట్టిన మొక్కలు బతుకపోతే కార్యదర్శులను ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రభుత్వం ప్రకటించడం వీరి జీవితాలను చిన్నాభిన్నం చేసింది. కొన్ని గ్రామాలలో అవగాహన లేని సర్పంచులు జేపీఎస్‌లకు సహకరించడం లేదు. మండలస్థాయి అధికారులు రాచిరంపాన పెడుతున్నారు. 30 రోజుల జీపీ ప్రణాళిక వీరి జీవితంలో గుది బండలా మారింది. తీవ్రమైన పోటీ పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించి మెరిట్‌లో ఉద్యోగం పొందిన వీరికి అడుగడుగున గ్రామస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు. అన్ని శాఖల సర్కారు ఉద్యోగులకు ప్రతి సంవత్సరం వేతన వృద్ధి జరుగుతుండగా వీరికి మాత్రం 3 ఏండ్లపాటు నెలకు రూ.15000 మాత్రమే ఇస్తామని ప్రకటించడం శ్రమ దోపిడికి గురిచేయడమేనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 3ఏండ్ల ప్రొహిబిషన్‌ను విజయవంతంగా పూర్తిచేసిన వారికే రెగ్యులరైజ్ చేస్తామనడం వీరికి ఉరి తాడులా మారింది. ప్రభుత్వం ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా టార్గెట్లు చేరాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం హరితహారం వంటి కార్యక్రమాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు శరవేగంగా పూర్తిచేయడానికి పోటీపడి లక్ష్యం చేరుకోలేక నిరాశకు గురౌతున్నారు. ఉద్యోగంలో తక్కువ అనుభవం, ఎక్కువ పనిభారం ఉండటంతో మానసికంగా కుంగిపోయి ఉద్యోగాలు మానుకుంటున్నారు. మండలస్థాయి అధికారులు అభివృద్ధి కార్యక్రమాల పేరిట ప్రతిరోజు (సెలవు రోజుల్లో కూడా) ఆఫీసుకు పిలిపించుకొని నానా నిబంధనలు పెడుతున్నారు. పొద్దంతా గ్రామంలో పాలకవర్గ సభ్యులతో అలసిపోయి ఎంపీడీవో కార్యాలయానికి వస్తే సమీక్ష సమావేశాల పేరిట అక్కరకురాని విషయాలతో రాత్రి వరకు సమీక్షలు నిర్వహించి "నాకు వద్దు బాబు ఈ నౌఖరి" అనే పరిస్థితి కల్పిస్తున్నారు. దీంతో ఇటీవల తమ హక్కులను కాపాడుకోవడం కోసం మండల కార్యాలయాల ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సీమలు బాగుపడాలంటే గ్రామస్థాయిలో ఉన్న అన్ని శాఖల అదికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పాటుపడాలే తప్పా ఒక్క కార్యదర్శుల వల్ల ఒరిగేమి లేదు. ఉద్యోగ భద్రత కల్పించడం తోపాటు ఉద్యోగం నుంచి తొలగించాలనే నిబంధనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. ప్రతి ఏట 25శాతం జీతాలు పెంచాలి.

సెల్ :7780185674

**అన్ని శాఖల సర్కారు ఉద్యోగులకు ప్రతి సంవత్సరం వ

శక్తివంతమైన
మహిళా ప్రధాన యాక్షన్ చిత్రాలు









మిస్‌బాలా

గ్లోరియా.. మేకప్ ఆర్టిస్టు. ఫ్రెండ్ కోసం మెక్సికో వెళ్ళినప్పుడు ఉగ్రవాదులు దాడి చేసి తన ఫ్రెండ్‌ని ఎత్తుకెళ్ళిపోతారు. ఆమెని కనిపెట్టడం కోసం గ్లోరియా కూడా ఉగ్రవాదుల గ్రూప్‌లో చేరి దాడులకు పాల్పడుతుంది. క్రైమ్ వరల్డ్‌లో గ్లోరియా ఎలాంటి స్థానానికి చేరుకుంది?, తన స్నేహితురాలిని కనిపెట్టిందా లేదా ఈ క్రమంలో గ్లోరియా ఇచ్చే ట్విస్టుల సమాహారమే ఈ చిత్రం. యాక్షన్ క్రైమ్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రానికి 'థర్టీన్', 'ట్విలైట్', 'లార్డ్స్ ఆఫ్ డాగ్‌టౌన్' వంటి చిత్రాలను రూపొందించిన మహిళా దర్శకురాలు కేథరిన్ హార్విక్ దర్శకత్వం వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. గ్లోరియా పాత్రలో గినా రోడ్రిగ్విజ్ అత్యద్భుత యాక్షన్‌తో మెస్మరైజ్ చేసింది.

ఏ విజిలెంట్

భర్తల వేధింపులకు గురవుతున్న మహిళలకు అండగా నిలిచేందుకు, అపహరణకు గురవుతున్న చిన్న పిల్లలను కాపాడటం కోసం కొంత మంది మహిళలు కలిసి ఓ గ్రూప్‌గా ఏర్పడతారు. తనను తరచూ వేధింపులకు గురి చేస్తున్న భర్తని సాడీ అనే మహిళ వదిలేస్తుంది. తన తోటి మహిళలకు సపోర్ట్ చేస్తూ గ్రూప్‌ని లీడ్ చేస్తుంటుంది. ఈ క్రమంలో వేధింపులకు గురి చేస్తున్న వారిని ఎలా కట్టడి చేసింది?, తన పోరాటానికి కారణమేంటనే ఆసక్తికర సన్నివేశాల సమాహారమే సినిమా. మిస్టరీ క్రైమ్ డ్రామాగా సారా డాగ్గర్, నిక్సన్ మహిళా దర్శకులు తెరకెక్కించిన ఈ చిత్రం మహిళా శక్తిని చాటింది.

ప్రౌడ్ మ్యారీ

టారాజి.. బోస్టన్‌లోని నేరస్థుల కుటుంబానికి చెందిన మహిళ. ప్రొఫెషనల్ హంటర్ అయిన టారాజి చాలా మందిని చంపేస్తుంది. సమాజం హితం కోసం నేరస్థులను, తన ప్రత్యర్థులను మట్టు పెట్టేందుకు వీరోచితంగా పోరాడుతుంటుంది. ఈ నేపథ్యంలో తనకి పరిచయం అయిన కుర్రాడు ఎవరు?. అతని రాకతో టారాజిలో వచ్చిన మార్పేంటి?, తన లక్ష్యం పక్క దారి పట్టడానికి కారణాలేంటనే ఆసక్తికర సన్నివేశాల సమాహారమే ఈ సినిమా. బాబక్ నజాఫి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ గతేడాది విడుదలై విమర్శకుల ప్రశంసలు పొందింది.

షో

మంచి కోసం, మనుగడ కోసం, సమాజ శ్రేయస్సుకోసం చేసే పోరాటంలో మహిళలు సైతం ఏమాత్రం తీసిపోరనే విషయాన్ని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించిన కొన్ని శక్తివంతమైన మహిళా ప్రధాన యాక్షన్ చిత్రాల గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ షో..

స్కార్చ్‌డ్ ఎర్త్

21వ శతాబ్దం మధ్య కాలంలో ప్రకృతి విపత్తులు పెరిగిపోతుంటాయి. వర్షం బీభత్సం సృష్టిస్తుంది. పరిశ్రమల వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. మానవ మనుగడ కష్టంగా మారిపోతుంది. ఈ నేపథ్యంలో నేరస్తులు పెరిగిపోతుంటారు. వారిని అంతం చేసేందుకు సమాజ శ్రేయస్సు కోసం హంతకురాలిగా మారిన ఓ హంటర్ తన బృందంతో కలిసి నేరస్థులను ఏరివేయడమనే కథాంశంతో రూపొందిన చిత్రమిది. దీనికి పీటర్ హౌవిట్ దర్శకత్వం వహించారు. గతేడాది విడుదలైన ఈ సినిమా మంచి ఆదరణ పొందింది. ప్రధాన పాత్రలో గినా కరానో చేసే యాక్షన్, స్టయిలీష్ నటన సినిమాకి హైలైట్‌గా నిలిచింది.

ఇంటెన్సివ్ కేర్

ఓ సంపన్న కుటుంబానికి చెందిన వృద్ధురాలు మరణానికి చివరి దశలో ఉంటుంది. ఆమెకి సంబంధించిన ఆస్తులను కొల్లగొట్టాలని ముగ్గురు దొంగలు ప్రయత్నిస్తుంటారు. స్పై ఏజెంట్ అలెక్స్‌ని సంపన్న వృద్ధురాలు నర్స్‌గా ఎంపిక చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో దొంగల బారి నుండి అలెక్స్ ఆ వృద్ధురాలిని కాపాడేందుకు చేసే పోరాటమే ఈ సినిమా. యాక్షన్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రానికి జేర్డ్ బెంట్లీ దర్శకత్వం వహించారు. అలెక్స్‌గా టారా మకెన్ అద్భుత అందం, అభినయంతోపాటు ఒళ్ళు గగుర్పొచేడి యాక్షన్‌తో మంత్రముగ్ధుల్ని చేసింది.

కిడ్నాప్

వెయిటర్‌గా పనిచేసే కార్లా పార్క్‌లో ఆడుకుంటున్న తన కొడుకుని దుండగులు కిడ్నాప్ చేయడం చూస్తుంది. వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తుంది. వాళ్ళని కారులో వెంబడించే క్రమంలో అనేక రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుంది. అయినప్పటికీ కొడుకు కోసం ఆమె చేసిన పోరాటం ఏమిటి?, అంతిమంగా కొడుకు దొరికాడా?, రోడ్డు ప్రమాదాల వల్ల తనకు ఎదురైన ఇబ్బందులేంటనే ఆసక్తికర ఉత్కంఠభరిత సన్నివేశాల సమాహారమే ఈ చిత్రం. క్రైమ్ డ్రామా థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా 2017లో విడుదలైంది. స్పానిష్ డైరెక్టర్ లూయిస్ ప్రీటో దర్శకత్వం వహించిన ఈ మహిళా ప్రధాన యాక్షన్ చిత్రం చిన్న చిత్రాల్లో పెద్ద విజయం సాధించింది. కార్లా పాత్రలో హల్లె బెర్రీ నటన ఆద్యంతం భావోద్వేగానికి గురిచేస్తుంది.





నవచిత్రం

ఆహ్లాదకరంగా ఉందంటున్నారు

పి.ఎల్.ఎన్.రెడ్డి, రమ్య, శ్రీహరి మంగళంపల్లి, నవీన్ విజయ్ కృష్ణ, బాలాజీ

నవీన్ విజయ్ కృష్ణ, మేఘనా చౌదరి, శ్రీనివాస్ అవసరాల, సోఫియా సింగ్ హీరోహీరోయిన్లుగా, బాలాజీ సానల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్.రెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో నిర్మాత శ్రీహరి మంగళంపల్లి మాట్లాడుతూ, "సినిమాకి అన్ని చోట్ల నుంచి పాజిటివ్ టాక్ వస్తోంది. 'సైరా' లాంటి పెద్ద సినిమా వల్ల థియేటర్ల కొరత ఏర్పడింది. కానీ చూసినవాళ్ళు సినిమా చాలా బాగుందని, ఎంతో ఆహ్లాదకరంగా ఉందని అంటున్నారు. రెండు మూడు రోజుల్లో థియేటర్లతోపాటు మల్టీఫెక్స్‌లు పెరుగుతాయి. 'వాల్మీకి', 'గ్యాంగ్‌లీడర్' చిత్రాలకి క్లాష్ వచ్చినప్పుడు దిల్‌రాజుగారు పండక్కి మూడు, నాలుగు సినిమాలైనా ఆడుతాయన్నారు. కానీ ఇప్పుడు మాకు థియేటర్లు దొరకడం లేదు. చిన్న సినిమాలకి కూడా సపోర్ట్‌నివ్వాలని కోరుకుంటున్నా' అని అన్నారు. "సినిమాని విడుదల వరకు తీసుకురావడమే ఓ విజయం. దాన్ని "సైరా నరసింహారెడ్డి' లాంటి పెద్ద సినిమా టైమ్‌లో, అదీనూ పండుగ టైమ్‌లో విడుదల చేయడమంటే గట్స్ కావాలి. మా నిర్మాతల గట్స్ కి అభినందనలు. కథ బాగుంటే, ఎమోషన్స్ కనెక్ట్ అయి లాజిక్స్ పట్టించుకోరు. సినిమాని చూసిన వాళ్ళంతా బాగుందని అంటున్నారు. ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ కి బాగా కనెక్ట్ అవుతున్నారు. ముఖ్యంగా లాస్ట్ 30 నిమిషాలకి మంచి స్పందన వస్తుంది. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది' అని హీరో నవీన్ విజయ్ కృష్ణ తెలిపారు.

అలాంటి వారికి బాధ్యత తెలిపే సినిమా

తేజస్

తేజస్ హీరోగా, పాయల్ రాజ్‌పుత్ కథానాయికగా నటించిన చిత్రం 'ఆర్‌డీఎక్స్ లవ్'. శంకర్ భాను దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "ఉషారు'తో హీరోగా మంచి బ్రేక్ వచ్చింది. సి.కళ్యాణ్‌గారి బ్యానర్‌లో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. ఇందులో నాది లవర్‌బాయ్ క్యారెక్టర్. నా పర్సనల్ క్యారెక్టర్‌కి పూర్తి భిన్నమైన పాత్రలో కనిపిస్తాను. ఊరు కోసం హీరోయిన్ పాయల్ గొప్ప పని చేయాలనుకుంటుంది. ఆ పనికి నేను సహకరిస్తుంటాను. ఆమె తన గోల్ రీచ్ కావడంలో నేను కీలక భూమిక పోషిస్తా. ప్రతి మగాడి సక్సెస్ వెనకాల స్త్రీ ఉంటుందన్నట్టు ఇందులో అమ్మాయి విజయం వెనకాల నేనుంటాను. మరి మా మధ్య ప్రేమ ఎలా పుట్టింది? అది ఎలాంటి మలుపు తిరిగింది?, మా నేపథ్యాలేంటనేది తెరపై చూడాలి. మంచి ఫన్నీగా సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. పని చేసి వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ ఇంటిని, భార్యాపిల్లల్ని చూసుకోని మగవాళ్ళకి బాధ్యతని తెలియజేసే చిత్రమవుతుంది. జనాన్ని ఎడ్యూకేట్ చేసేలా ఉంటుంది. టీజర్‌లో సన్నివేశాలు ఓ పాటకే పరిమితం. సినిమాలో ఉండవు. పాయల్‌తో వర్క్ చేయడం మంచి అనుభవం. ఆమె పాత్ర చాలా బలంగా ఉంటుంది. నేను నటించిన 'ఉషారు' కెరీర్ పరంగా ఓ మెట్టు ఎక్కించింది. ఈ సినిమా హీరోగా మరో మెట్టు ఎక్కిస్తుందని నమ్ముతున్నా. నెక్స్ట్ 'ఛలో' ఫేమ్ వెంకీ కుడుముల దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నా. పూర్తి భిన్నమైన చిత్రమది. ప్రస్తుతం ఆయన నితిన్ హీరోగా 'భీష్మ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆ సినిమా తర్వాత మా చిత్రం ప్రారంభమవుతుంది. నిర్మాతగానూ రాణించాలనుకుంటున్నా. మంచి కథ బలమున్న చిత్రాలను నిర్మిస్తా. పరిశ్రమలో సంపాదించిన ప్రతి పైసా ఇక్కడే ఖర్చు చేస్తా' అని అన్నారు.

కల్తీ మాఫియా నేపథ్యంలో వదలడు

నరేష్, శ్రీధర్, గోవర్ధన్‌రెడ్డి, కేథరిన్, అంజయ్య, నట్టికుమార్

సిద్ధార్థ్, కేథరిన్ థ్రెస్సా జంటగా సాయి శేఖర్ దర్శకత్వంలో తెలుగు, తమిళంలో రూపొందుతున్న చిత్రం 'వదలడు'. టి.అంజయ్య సమర్పణలో పారిజాత క్రియేషన్స్ పతాకంపై టి.నరేష్‌కుమార్, టి.శ్రీధర్ నిర్మించారు. త్వరలో విడుదల కాబోతున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక ఇటీవల జరిగింది. అతిథిగా విచ్చేసిన ప్రముఖ రాజకీయ నాయకులు గోవర్ధన్ రెడ్డి ట్రైలర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నిర్మాత అంజయ్య తెలంగాణకి చెందిన నిర్మాత కావడం ఆనందంగా ఉంది. ఆయన దిల్‌రాజ్ అంతటి పేరు తెచ్చుకోవాలి. మరిన్ని మంచి సినిమాలు తీయాలి. కేథరిన్‌కి 'సరైనోడు'లో నిజమైన ఎమ్మెల్యే కంటే మంచి పేరు వచ్చింది. సిద్ధార్థ్ మనకు పరిచయం అక్కర్లేని హీరో. వీరంతా కలిసి చేస్తున్న సినిమా పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'సిద్ధార్థ్, దర్శకుడు బిజీగా ఉన్నారు. సంగీత దర్శకుడు థమన్ మరో చోట ఉన్నారు. వారందరి తరపున నేను ప్రమోషన్‌కి వచ్చా. ఇది మంచి సందేశాత్మక చిత్రం. జ్యోతి అనే టీచర్‌గా కనిపిస్తాను. కల్తీఫుడ్‌పై సినిమా సాగుతుంది. కచ్చితంగా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది' అని హీరోయిన్ కేథరిన్ తెలిపారు. నిర్మాత శ్రీధర్ చెబుతూ, 'అనివార్య కారణాల వల్ల హీరో సిద్ధార్థ, దర్శకుడు రాలేకపోయారు. వాణిజ్య అంశాలు మేళవించిన సందేశాత్మక చిత్రమిది. కల్తీ ఆహారాన్ని తీసుకోవడం వల్లే కేన్సర్ బారిన పడుతున్నారనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించాం. ఈ నెల 11న దాదాపు 450 థియేటర్లలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు. 'డిఫరెంట్ చిత్రమిది. పెద్ద సక్సెస్ కావాలి' అని నట్టికుమార్ అన్నారు.

అయినప్పటికీ ఐదోసారి..

దీపికా పదుకొనె

ఇప్పటికే 'రామ్‌లీల', 'బాజీరావు మస్తానీ', 'పద్మావత్' చిత్రాలతో రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనె జోడీ ప్రేక్షకుల్ని విశేషంగా మెప్పించింది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన ఈ మూడు విజువల్ వండర్స్‌లో ఈ జంట స్క్రీన్‌పై చేసిన మ్యాజిక్‌కి యావత్ భారతీయ ప్రేక్షకులు ఫిదా అయ్యారు.

ఈ ఇద్దరూ కలిసి నాలుగవసారి '83'లో నటిస్తున్న విషయం విదితమే. కపిల్‌దేవ్ జీవితం ఆధారంగా 1983 క్రికెట్ వరల్డ్ కప్ నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతుంది. పెళ్లైన తర్వాత తొలిసారి రణ్‌వీర్, దీపికా కలిసి నటిస్తున్న చిత్రం కావడం మరో విశేషం. ఇదిలా ఉంటే, మరోసారి ఈ జోడీ తెరపై మ్యాజిక్ చేసేందుకు సిద్ధమవుతోందట. అది కూడా సంజయ్‌లీలా భన్సాలీ చిత్రంలో కావడం చెప్పుకోదగ్గ విశేషం.

సల్మాన్, అలియా భట్ జంటగా భన్సాలీ తెరకెక్కించాలనుకున్న 'ఇన్‌షాల్లా'లో ఈ జోడీ జత కట్టే అవకాశం ఉందని సమాచారం. మొత్తమ్మీద ఐదోసారి కూడా ఈ జోడీ ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు రంగం సిద్ధమవుతోందని వేరే చెప్పక్కర్లేదు. దీపికా ప్రస్తుతం నటిస్తున్న 'ఛపాక్' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా రిలీజ్ కానుంది.

epaper.navatelangana.com

ఘనంగా సద్దుల బతుకమ్మ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో బతుకమ్మ సంబురాలు వైభవంగా ముగిశాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన సద్దుల బతుకమ్మ ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఎల్బీస్టేడియంలో సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ హాజరై బతుకమ్మ శకటాల ఊరేగింపు జెండా ఊపి ప్రారంభించారు. ఎల్బీ స్టేడియం నుంచి ట్యాంక్‌బండ్ వరకు సుమారు 10వేల బతుకమ్మలతో మహిళలు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. లంబాడీల నృత్య బృందం, రాగిణిచోలు, కాటికాపర్లు, రామాయణ-లంకాదీశులు రాక్షసులు, చిరుతల భజన, ట్రైబల్ గుస్సాడీ, డప్పుల దరువులు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, ఒగ్గు, కోయ, బుర్రకథ కళాకారులు, చిందుల, బోనాల కోలాటం వంటి 26 కళారూపాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వేడుకల్లో సుమారు 1500 మంది కళాకారులు పాల్గొన్నారని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో కళకళలాడాయి. ట్యాంక్‌బండ్‌పై రాకపోకలను పోలీసులు పూర్తిగా నిలిపివేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో హోంమంత్రి మహముద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ మేయర్ ఫసీయుద్దీన్, ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి, టూరిజం చైర్మెన్ భూపతిరెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టీజీవో అధ్యక్షురాలు మమతా, నగర మేయర్ సతిమణి శ్రీదేవీ పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరింత వైభవంగా : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బతుకమ్మ వేడుకలను భవిష్యత్తులో మరింత వైభవంగా నిర్వహిస్తామని సాంస్కృతిక శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గతంలో ఎన్నో ఆంక్షలతో బతుకమ్మ పండుగను జరిపేవాళ్లమనీ, తెలంగాణలో అధికారికంగా నిర్వహించుకుంటున్నామనీ హర్షం వ్యక్తం చేశారు.

సమ్మెలో ఉన్న వారిని ఉద్యోగాల్లోకి తీసుకునే ప్రసక్తే లేదు

- ఇక ఆర్టీసీలో మిగిలింది 1,200 మంది లోపు సిబ్బందే
- తక్షణ చర్యగా 2,500 అద్దె బస్సులు నడుపుతాం
- స్టేజ్ క్యారెజ్‌లుగా 4,114 ప్రయివేటు బస్సులు
- త్వరలోనే కొత్త సిబ్బంది నియామకం
- యూనియన్లలో చేరబోమంటూ వారితో సంతకాలు పెట్టించుకోండి
- 'ఆర్టీసీ'పై సమీక్షలో ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు
- చట్ట విరుద్ధంగా సమ్మె చేస్తున్న వారితో రాజీలేదని స్పష్టీకరణ
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయబోమని వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'గడువు పూర్తి అయ్యేలోపల.. అంటే ప్రభుత్వం విధించిన గడువు లోపల విధుల్లోకి హాజరు కాని సిబ్బందిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకునే ప్రసక్తే లేదు.. ఆర్టీసీలో ఇక మిగిలింది కేవలం 1,200 మంది లోపే సిబ్బందే...' అని ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. తక్షణ చర్యగా 2,500 బస్సులను అద్దె పద్ధతిలో తీసుకుని నడపాలంటూ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. 4,114 ప్రయివేట్ బస్సులు ఇంకా ఉన్నాయి.. వాటిని స్టేజ్ కారేజ్‌లుగా చేస్తే అవి కూడా ఆర్టీసీలోకి వస్తాయని తెలిపారు. ఈ విషయమై ప్రయివేటు వారితో ఆర్టీసీ, రవాణా అధికారులు చర్చలు జరుపుతున్నారని వివరించారు. అతికొద్ది రోజుల్లోనే కొత్త సిబ్బంది నియామకం చేపట్టాలనీ, నియామక ప్రక్రియ అతిత్వరగా చేపట్టాలనీ సూచించారు. కొత్తగా చేర్చుకునే సిబ్బంది చేత యూనియన్లలో చేరబోమనే విధంగా ఒప్పంద పత్రం మీద సంతకం చేయించుకోవాలని ఆదేశించారు. వారిది షరతులతో కూడిన నియామకం అవుతుందని తెలిపారు. ప్రొబేషనరీ పీరియడ్ ఉంటుందని పేర్కొన్నారు. ఏయే కేటగిరీలకు చెందిన సిబ్బంది సమ్మెలో ఉన్నారో.. ఆయా కేటగిరీలకు చెందిన సిబ్బందిని భర్తీ చేయడానికి వీలుగా నియామకాలు ఉంటాయని చెప్పారు. ఇక నుంచి ఆర్టీసీ నడపబోయే బస్సుల్లో సగం ప్రయివేటు బస్సులుంటాయని వివరించారు. మిగతా సగం ఆర్టీసీ యాజమాన్య బస్సులు ఉంటాయనే విధంగా ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఈ పద్ధతిలో చర్యలు చేపడితే బస్సులు బాగా నడుస్తాయని తెలిపారు. రెండు మూడేండ్లలో నష్టాలను పూడ్చుకుని సంస్థ లాభాల్లోకి వస్తుందని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయ పడ్డారు. మొత్తం 15 రోజుల్లో ఆర్టీసీని పూర్వస్థితికి తీసుకు రావాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు.

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం మధ్యాహ్నం ప్రగతి భవన్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్టీసీ చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని ప్రారంభించబోతున్నట్టు ప్రకటించారు. ఇందులో భాగంగా ఆర్టీసీని లాభాల్లోకి తీసుకు పోవాలనీ, సంస్థ మనుగడ కొనసాగాలంటే కొన్ని చర్యలు తప్పవనీ అన్నారు. యేడాదికి రూ.1,200 కోట్ల నష్టంతో, రూ.5 వేల కోట్ల రుణభారంతో, క్రమబద్ధంగా పెరుగుతున్న డీజిల్ ధరలతో సంస్థ పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని తెలిపారు. ఇలాంటి సమయంలో చట్ట విరుద్ధమైన సమ్మెకు, అదీ పండుగల సీజన్‌లో దిగిన వారితో ఎలాంటి రాజీ సమస్యే లేదని తేల్చి చెప్పారు. వారు చేసింది తీవ్రమైన తప్పిదమని వ్యాఖ్యానించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రసక్తే లేదనీ, ఇక వారితో ఎలాంటి చర్చలు జరిపేది లేదని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఆర్టీసీకి సంబంధించి, ఎప్పటికీ క్రమ శిక్షణా రాహిత్యం, బ్లాక్ మెయిల్ విధానం, తలనొప్పి కలిగించే చర్యలు శాశ్వతంగా ఉండకూడదనేది ప్రభుత్వ భావనగా ఆయన చెప్పారు.

అఖిలపక్షం అసంబద్ధం...

'గత నలభై సంవత్సరాలుగా ఆర్టీసీ చుట్టూ అల్లుకున్న వ్యవహారం ఒక నిరంతర సమస్యాత్మకం. దీనికి ఒక శాశ్వత పరిష్కారం కనుగొనాలి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక అనేక రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ లాంటి సమస్యలు ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేసే విధంగా మారాయి. ఇప్పుడు ఆర్టీసీ చేస్తున్న సమ్మె చట్ట వ్యతిరేకం, ఆలోచనా తప్పిదం, భాద్యతారాహిత్యం. ఇప్పుడు రాష్ట్రానికి ఈ విషయంలో శాశ్వతమైన లాభం చేకూరాలి. మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, చత్తీస్‌ఘడ్, మణిపూర్ రాష్ట్రాలలో ఆర్టీసీ లేనే లేదు. బీహార్, ఒరిస్సా, జమ్మూ కాశ్మీర్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో నామమాత్రంగా ఉన్నాయి. ఆ విధంగా చూస్తే కర్నాటక తర్వాత తెలంగాణలోనే అత్యధికంగా బస్సులు నడుస్తున్నాయి. ఇంత మంచిగా ఆర్టీసీని చూసుకుంటుంటే వారు సమ్మెకు దిగడం అవసరమా...? అని సీఎం వ్యాఖ్యానించారు. 'భవిష్యత్‌లో ఆర్టీసీని ఏం చేయాలనే అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఆర్టీసీలో నైపుణ్యమైన, వత్తిపరమైన యాజమాన్యం ఉంది. అన్ని విధాలా స్థిరత్వం సాధించుకునే వీలుంది. మనం ఏదైనా నిర్ణయం తీసుకునే ముందర సమతుల్యతను పాటించాలి. ఒక పక్క ప్రయివేటు భాగస్వామ్యం, మరో పక్క ఆర్టీసీ యాజమాన్యం ఉంటేనే మంచిది. ప్రజలు సమ్మెకు దిగిన ఆర్టీసీ సిబ్బందిమీద చాలా కోపంగా ఉన్నారు. సోషల్ మీడియాలో కూడా వ్యతిరేకత వస్తున్నది. సమ్మెద్వారా ప్రజలకు ఎంతో అసౌకర్యం కలిగింది. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ విధులకు హాజరుకాని వారిని తిరిగి తీసుకోబోం. గడపదాటితే బయటికే... మళ్లీ గడపలోకి వచ్చే సమస్యే లేదు. విలీనం గురించి అఖిల పక్ష సమావేశం జరపాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. వారికి ఆర్టీసీ విషయంలో మాట్లాడే హక్కులేదు. సీపీఐ(ఎం) అధికారంలో ఉన్ననాడు పశ్చిమ బెంగాల్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారా? కేరళలో చేసారా? బీజేపీ ఎన్నో రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. కానీ ఎక్కడైనా విలీనం చేశారా? కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఏ రాష్ట్రంలోనైనా చేశాయా? అందుకే వాళ్లకు అడిగే హక్కు లేదు. అఖిల పక్ష సమావేశం డిమాండ్ అసంబద్ధం. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అందరి కళ్లూ తెరిపించాలి...' అని సీఎం వ్యాఖ్యానించారు.

యూనియన్లది బ్లాక్‌మెయిల్ రాజకీయాలు...

'ఆర్టీసీ తప్పకుండా లాభాల్లోకి రావాలి. దాన్ని లాభాల్లో నడిచే సంస్థగా రూపొందించాలి. ఏదేమైనా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకూడదు. ఆర్టీసీ చేస్తున్న ఏర్పాట్లతోపాటూ రాష్ట్రంలో వివిధ రకాలకు చెందిన 1,22,58,433 ప్రయివేటు వాహనాలున్నాయి. ఇవన్నీ ప్రజల రవాణాకు ఉపయోగ పడేవే. వారి ఇబ్బందులు కొంతవరకు తొలగించేవే. ఆర్టీసీలో ఉన్న యాజమాన్య నైపుణ్యాన్ని చక్కగా వాడుకోవాలి. ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా కూడా లాభాలు రాబట్టాలి. ఈ పోటీ ప్రపంచంలో వినూత్నంగా ఆలోచించి సంస్థను లాభాల్లోకి తీసుకురావాలి. అనేక రంగాల్లో ముందున్న తెలంగాణ రాష్ట్రం ఆర్టీసీ విషయంలో కూడా ముందుండాలి. దానికి అవసరమైనదంతా చేయాలి. ఒక అద్భుతమైన, గొప్పదైన, సమర్థమైన లాభాలబాటలో నడిచే సంస్థగా ఆర్టీసీ రూపుదిద్దుకోవాలి. హైదరాబాద్ నగరానికి చెందినంతవరకు నష్టాలను ప్రభుత్వం భరిస్తుంది. ప్రస్తుతం 10,400 బస్సులలో సుమారు కోటి మంది ప్రయాణం చేస్తున్నారు. భవిష్యత్‌లో కూడా ఆ సౌకర్యం కొనసాగుతుంది. సగటున ఆర్టీసీ సిబ్బందికి నెలకు రూ.50 వేల జీతం వస్తున్నా ఇంకా పెంచాలంటూ అడగడంలో అర్థం లేదు. ఇలాంటి యూనియన్ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు ప్రభుత్వం తల వంచదు..' అని సీఎం వ్యాఖ్యానించారు.

రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన కమిటి...

ఆర్టీసీకి సంబంధించిన విషయాలన్నింటిపై కూలంకుషంగా చర్చించి, ఒక నివేదిక సమర్పించడానికి వీలుగా రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. కమిటీలో సభ్యులుగా రవాణాశాఖ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా, టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పాండురంగ నాయకులు ఉన్నారు.

వారు తమ ప్రతిపాదనలను సోమ వారం ప్రభుత్వానికి సమర్పిస్తారు. సమీక్షా సమావేశంలో మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపి మహేందర్‌రెడ్డి, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగరావు, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, రవాణాశాఖ కమిషనర్ సందీప్ సుల్తానియా, అడిషనల్ డీజీపీ జితేంద్రతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐఎంఎస్ స్కాంలో మరో ఫార్మాసిస్ట్ అరెస్ట్

- 9 కోట్లకు పైగా ప్రభుత్వ ఖజానాకు నష్టం తెచ్చిన నాగలక్ష్మీ

నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

సంచలనం రేపిన ఈఎస్ఐ ఐఎంఎస్ స్కాంలో మరోఫార్మాసిస్ట్‌ను అవి నీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. నాచారం ఈఎస్ఐ డిస్పెన్సరీలో ఫార్మాసిస్ట్‌గా పనిచేసే కొడాలినాగలక్ష్మీని ఆదివారం అదుపు లోకి తీసుకున్నారు. ఈవిభాగానికి చెంది భారీ మొత్తంలో మందుల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డ ఇతర నిందితుల తరహాలోనే నాగలక్ష్మీ సైతం ఏకంగా 9కోట్ల 28లక్షల 56వేల రూపాయలకు పైగా రాష్ట్ర ప్రభు త్వ ఖజానాకు నష్టం తెచ్చేలా మందుల కొనుగోళ్లకు పాల్ప డినట్టు ఏసీబీ దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా ఇప్పటికే అరెస్టయిన ఫార్మాకంపెనీ ఎం డీ సుధాకర్‌రెడ్డితో అంటకాగి అక్రమంగా మందుల కొనుగోళ్లకు పాల్పడి భారీ మొత్తంలో నాగలక్ష్మీ లబ్ది పొందినట్టు కూడా ఏసీబీ తేల్చింది. అంతేగాక గతంలో చర్లపల్లి డిస్పెన్సరీలో సైతం 17 లక్షల రూపాయల మేరకు అక్రమాలకు పాల్పడినట్టుగా కూడా బయ టపెట్టింది. దీంతో ఈ స్కాంలోనే నాగలక్ష్మీని సైతం ఏసీబీ అధికారులు అరెస్టు చేసినట్టు ఏసీబీ డైరెక్టర్ జనరల్ జె.పూర్ణచంద్రరావు తెలిపారు. ఇంకా ఈ కేసులో మరి కొందరి అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిసింది.

ఆర్టీసీ జేఏసీ దీక్షలకు అనుమతి నిరాకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ జేఏసీ ఆమరణ నిరాహార దీక్షలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఇందిరాపార్కు వద్ద సోమవారం నుంచి దీక్షలు చేపట్టేందుకు జేఏసీ నేత లు ఏర్పాట్లు చేసుకున్నారు. అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకు న్నారు. ముందు అనుమతిఇస్తామని చెప్పిన పోలీసు అధికారులు ఆదివారం రాత్రి అనుమతిని నిరాకరిస్తూ సెంట్రల్‌జోన్ జాయింట్ పోలీస్ కమిషనర్ ఉత్త ర్వులు జారీ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను ప్రభుత్వం చట్టబద్ధం కాదని, ఎస్మా పరిధిలోకి వస్తుందని పేర్కొన్నదని, దానితో పాటు వేలసంఖ్యలో కార్మికులు, రాజ కీయపార్టీలు, ప్రజాసంఘాల నేతలు ఇక్కడకు వస్తున్నట్టు ఇంటలిజెన్స్ వర్గాలు తమకు సమాచారం ఇచ్చినందున అనుమతిని నిరాకరిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పిడుగులుపడి ఆరుగురు మృతి

నవతెలంగాణ-యంత్రాంగం

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలకు వేర్వేరు జిల్లాల్లో పిడుగులు పడి ఆదివారం ఆరుగురు మృతిచెందారు. పలువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఇతరచోట్ల మేకలు, ఎద్దులు, గేదెలు మృత్యువాతపడ్డాయి. సిద్దిపేట జిల్లా కేంద్రం హనుమాన్‌నగర్‌లో పస్తం శ్రీనివాస్ (32), వానరాసి బాలరాజు (33) మరణించారు. చెన్నూరి సారయ్యకు గాలయ్యాయి. ముగ్గురూ చిరువ్యాపారం (బుడగ జంగాల) చేసుకుంటూ జీవించేవారే. ఆదివారం వ్యాపారం ముగించుకుని జిల్లా కేంద్రానికి వస్తుండగా చింతలకట్టకు రాగానే భారీ వర్షం కురవడంతో పక్కనే చింత చెట్టు కిందకు వెళ్లారు. పిడుగు పడటంతో శ్రీనివాస్, బాలరాజు అక్కడికక్కడే మరణించగా సారయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సాయంతో క్షతగాత్రుడ్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేసి ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం చొప్పాల గ్రామంలో పిడుగుపడి మండిపాక స్రవంతి(22) మృతిచెందింది. చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన స్రవంతి దసరా పండుగకు తన పుట్టినిల్లు చొప్పాల గ్రామానికి వచ్చింది. బతుకమ్మ పండుగ కోసం పూల సేకరించేందుకు బయటకు వెళ్లగా పిడుగుపాటుకు గురై మృతిచెందింది.

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన దునుకుల తిరుమలరావు(28) పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. తిరుమలరావు డిప్లొమా పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దసరా కోసం ఇంటికిరాగా తండ్రి జగన్‌తో కలిసి గ్రామంలోని వారి పొలంలో మిర్చి మొక్కలు నాటేందుకు వెళ్లాడు. ఒక్కసారిగా వాన పడటంతో చెట్టు కిందకు వెళ్లారు. తిరుమలరావు సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొడుకు విగతజీవిగా మారడంతో తండ్రి సొమ్మసిల్లి పడిపోయాడు.

వికారాబాద్ జిల్లా యాలాల మండలం రాస్నం గ్రామంలో పొలం పనుల కోసం ఎన్కేపల్లి మల్లేశం, అతని భార్య లక్ష్మితో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం కురియడంతో మర్రి చెట్టు కిందకెళ్లాడు. పిడుగు పడి మల్లేశం అక్కడికక్కడే మరణించాడు. మహిళా కూలీలు పెండ అంజిలమ్మ, మక్త అనంతమ్మకు, మరో రైతు పెద్ద మల్లయ్యకు గాయాలయ్యాయి. తాండూర్ రూరల్ సీఐ జలంధర్‌రెడ్డి, యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుమురంభీం జిల్లా తిర్యాణి మండలం కైరిగూడ గ్రామంలో సోయం లచ్చుకు చెందిన పత్తి చేనులో కలుపుతీసేందుకు కనక ఇందురుబాయి(55), ద్రుపతిబాయ్, పుసం జంగుబాయి, నైతం మానసలు కూలీకి వచ్చారు. వర్షం పడుతుందని చెట్టు కిందకు వెళ్లగా ఆ సమయంలో పిడుగుపడి ఇందురుబాయి మృతిచెందింది. మిగతావారికి స్వల్ప గాయాలయ్యాయి. సోయం లచ్చు పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై రామారావు తెలిపారు.

మూగజీవాలు మృత్యువాత

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి ఇందిరమ్మ కాలనీ చెరువు వద్ద పిడుగు పడి ఏడు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఒక్కో గేదెవిలువ రూ.50వేల వరకు ఉంటుందని రైతులు తెలిపారు. సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలంలో పిడుగుపడి ఒక గేదె మృత్యువాత పడింది. యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో పిడుగు పాటుకు రెండు గేదెలు, ముత్తిరెడ్డిగూడెంలో మరో గేదె మృతి చెందాయి. బీబీనగర్ మండలం మాదారం గ్రామంలోనూ పిడుగు పడి గేదె మృతి చెందింది. సిద్దిపేట జిల్లాలోని దౌల్తాబాద్ మండలం గొడుపల్లిలో రెండు ఎద్దులు, రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లిలో రెండెద్దులు మృత్యువాతపడ్డాయి. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం పోసానిపేటలో పిడుగుపాటుగు ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. పలుచోట్ల మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి.

గ్రేటర్‌లో కుండపోతగా వర్షం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం పడటంతో రహదారులు, కాలనీలు, బస్తీలన్నీ చెరువులు మరోసారి కుంటలను తలపించాయి. దాదాపుగా 4 నుంచి 5 అడుగల వరకూ నీరు నిలిచిపోవడంతో రహదారులు కొద్దిపాటి చెరువులుగా మారాయి. పలు ప్రాంతాల్లో ఇండ్లపై చెట్లు కూలాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఇండ్లల్లోకి నీరు చేరి, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జగద్గిరిగుట్ట ప్రాంతంలో అత్యధికంగా 8.5 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, సరూర్‌నగర్ భవానీనగర్‌లో అత్యల్పంగా 2.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. జీహెచ్ఎంసీ డిజిస్టార్ రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి వర్షంతో మునిగిన రహదారుల

పై నీటిని తొలగించాయి. ప్రధాన రహదారులు, కాలనీల్లో కూలిన చెట్లను తొలగించి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. రానున్న రెండ్రోజులు గ్రేటర్ హైదరాబాద్‌కు భారీ వర్షాలు ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

కూలిన శిక్షణ విమానం

నవతెలంగాణ-కోట్‌పల్లి

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి అదుపుతప్పిన విమానం పత్తి చేనులో కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలెట్లు అక్కడికక్కడే మరణించారు. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. బేగంపేట నుంచి గుల్బర్గా వెళ్లి రావాల్సిన శిక్షణ విమానం సుల్తాన్‌పూర్ గ్రామానికి చేరు కునే సరికి వాతావరణంలో మార్పులు సంభవించాయి. ఒక్కసారిగా భారీ వాన పడటంతో సిగ్నల్స్ అందలేదు. దీంతో గ్రామ శివారులోని సిద్ది రాములు, బంటు బాలకృష్ణ పతి పంటలో విమానం పడిపోయింది. విమానంలో ఉన్న పంజాబ్‌కు చెందిన ట్రైనీ కో-పైలెట్ అమంతి ప్రీతి కౌర్(21), ఢిల్లీకి చెందిన పైలెట్ రాకేశ్ విశాల్(24) అక్కడికక్కడే మృతి చెందారు. కూలడానికి ముందు కొద్దిసేపు గాల్లో చక్కర్లు కొట్టినట్టు గ్రామ స్తులు తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ మస్రత్ ఖానమ్ ఆయేషా, ఎస్పీ నారాయణ, బేగంపేట ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, ధారూర్ సీఐ రాజశే ఖర్, ఎస్సైలు, ఇతర అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాలను పోస్టుమార్టంనిమిత్తం తాండూరు ప్రభుత్వఆస్పత్రికి తరలించారు.

ఏటేటా పెరుగుతున్న ఆత్మహత్యలు

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్య డబ్ల్యూహెచ్‌ఓ చెప్పిందానికన్నా ఎక్కువగా ఉందని 'ద లాన్సెట్' పేర్కొన్నది. ఆత్మహత్యల సంఖ్య వయస్సుల వారీగా పరిశీలిస్తే, 15-39 ఏండ్ల మధ్యగల వారిలో మహిళలు 71.2శాతం, పురుషులు 57.7శాతం ఉన్నారు.

ఇండియా గణాంకాల్ని దాస్తోందా?

ఆత్మహత్యల సమాచారాన్ని ఇండియా సరిగా నమోదుచేయటం లేదని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. అంటే నాణ్యమైన, కచ్చితమైన సమాచారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేయటం లేదని దీనర్థం. ప్రభుత్వం విడుదల చేసే సమాచారాన్ని నమ్మేట్టు లేదని డబ్ల్యూహెచ్‌ఓ అభిప్రాయపడింది. జాతీయ నేర నమోదు బ్యూరో లెక్కలకు, డబ్ల్యూహెచ్‌ఓ సేకరించిన లెక్కలకు పొంతన ఉండటం లేదు. కేవలం పోలీసు స్టేషన్లలోని 'ఎఫ్ఐఆర్'లను మాత్రమే లెక్కలోకి తీసుకొని క్రైమ్ బ్యూరో గణాంకాల్ని రూపొందించగా, హాస్పిటల్స్ ద్వారా సమాచారాన్ని క్రోఢీకరించి డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాల్ని వెల్లడించింది.

- 'ద లాన్సెట్' నివేదిక ప్రకారం, 2016లో ప్రపంచవ్యాప్తంగా 8,17,000మంది ఆత్మహత్య చేసుకున్నారు. మొత్తం మరణాల్లో ఇది 1.5శాతం.
- ప్రపంచ జనాభాలో ఇండియా వాటా 18శాతం. కానీ ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న ఆత్మహత్యల్లో 28.19శాతం మనదేశంలో జరిగాయి.
- మనదేశంలో 1990లో 1,64,404మంది ఆత్మహత్య చేసుకోగా, 2016నాటికి ఆ సంఖ్య 2,30,314కు పెరిగింది. పాతికేండ్ల క్రితంతో పోల్చితే ఆత్మహత్యల సంఖ్య 40.1శాతం పెరిగింది.

సీఎం వ్యాఖ్యలపై రాజకీయ పార్టీల ఖండన

(మొదటిపేజీ తరువాయి)

ఖండించారు. ఆర్టీసీ కార్మికులకు ఏం చేశారని ప్రశ్నించారు. కేరళ, బెంగాల్‌లో ఆర్టీసీ విలీనం అయ్యిందా?అని సీఎం ప్రశ్నిస్తున్నారనీ, ఇతర రాష్ట్రాల్లో ఆయా పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారనీ గుర్తు చేశారు. ఒకవేళ కార్మికులు సమ్మెకు సిద్ధపడితే చర్చలకు పిలిచి ప్రజాస్వామ్యబద్ధంగా ఆయా ప్రభుత్వాలు వ్యవహరిస్తాయని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ స్వయంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్నారు. ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. సీఎం ఇచ్చిన వాగ్దానాన్ని మరిచిపోయి ఇతర రాష్ట్రాల్లో జరిగాయా అనడం తప్పు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో దసరా పండుగ సమయంలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ ఇబ్బందులకు సీఎం మొండివైఖరే కారణమని విమర్శించారు. ఈ వైఖరి సరికాదన్నారు. వాగ్దానం చేసిన వాటిని పరిష్కరిస్తే సమ్మె సంపూర్ణమవుతుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల కుటుంబ సభ్యులంతా ఆందోళనలో ఉన్నారని అన్నారు. సమ్మె కాలానికి జీతాలు ఇస్తారా? ఇవ్వరా? అన్నది తర్వాత విషయమని చెప్పారు. సెప్టెంబర్‌లో పనిచేసిన కార్మికుల వేతనం అక్టోబర్ ఒకటిన ఇవ్వాలని అన్నారు. ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. వారి జీతాలను ఆపే హక్కు సీఎంకు ఎక్కడుందని ప్రశ్నించారు. ఇది ఆర్టీసీ కార్మికులపై కక్షసాధింపేనని అన్నారు. సీఎం మొండి వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా పోరాటాలు చేపడతామని అన్నారు.

అప్రజాస్వామికం : సీపీఐ

ఆర్టీసీ కార్మికులను తొలగిస్తున్నామని సీఎం ప్రకటించడం అప్రజాస్వామికమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్ విమర్శించారు. కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగా

సెన్సెక్స్	నిఫ్టీ	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
▼433	▼139			
37,673	11,174	70.88	రూ. 39,335	రూ. 48,000

కోడి గుడ్లు (వందకి)

హైదరాబాద్	392	విజయవాడ	380
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	382
వరంగల్	381	ముంబయి	385

ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో ముదురుతున్న సంక్షోభం

ఏడాది కాలంగా మరింత దిగజారుతున్న వైనం

- నాడు ఐఎల్‌ఎఫ్‌ఎస్ దివాళా.. నేడు డీహెచ్‌ఎఫ్‌ఎల్, ఆల్టికో క్యాపిటల్‌కు కష్టాలు
- ఆర్థిక మందగమనంపై బ్యాంకింగేతర రంగం ప్రభావం : నిపుణులు

న్యూఢిల్లీ : మన దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగేతర రంగానిది కీలక పాత్ర. అనేక పరిశ్రమలు, సంస్థలు, స్టార్టప్‌లు రుణ అవసరాల కోసం ఎక్కువగా ఈ రంగంపైనే ఆధారపడుతుంటాయి. అయితే, గతేడాది సెప్టెంబర్‌లో ఐఎల్‌ఎఫ్‌ఎస్ నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ) దివాళాతో ఈ రంగం కుదుపునకు లోనైంది. ఐఎల్‌ఎఫ్‌ఎస్ సంక్షోభానికి ఏడాది నిండినా ఈ రంగం ఇంకా కోలుకోలేకపోతున్నది. మోడీ సర్కారు తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం ఆశాజనక పరిస్థితులను కల్పించలేకపోతున్నాయి. అంతేకాదు, బ్యాంకింగేతర రంగం మరింత సంక్షోభంలోకి జారుతున్నది. గతేడాది ఐఎల్‌ఎఫ్‌ఎస్ సంక్షోభానికి గురవ్వగా.. నేడు డీహెచ్‌ఎఫ్‌ఎల్, ఆల్టికో క్యాపిటల్‌లు దివాళా స్థితికి చేరుకున్నాయి. కాగా, ఇండియా బుల్స్ హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలో భారీ ఆర్థిక అవకతవకలు జరిగినట్టు కథనాలు వస్తున్నాయి. ఫైనాన్షియల్ రంగంలో కీలక పాత్ర పోషించే ఈ ఎన్‌బీఎఫ్‌సీ సెక్టార్‌లో సంక్షోభం తీవ్రమవుతున్నది. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్న మందగమనానికి ఎన్‌బీఎఫ్‌సీలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు కూడా ఒక కారణమేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మాటు వేస్తున్న సంక్షోభం

ఐఎల్‌ఎఫ్‌ఎస్ దివాళాతో బ్యాంకింగేతర రంగం ప్రస్తుత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఏడాది కాలంగా ఈ రంగంలో నెలకొన్న పరిస్థితులు దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత కలవరం పెట్టేవిగా కనిపిస్తున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీ స్థితిగతులపై విడుదలైన పలు రిపోర్టులు ఈ ఆందోళనకర వాస్తవాలను వెల్లడిస్తున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీల అప్పులు వేగంగా పెరుగుతున్నాయి. ఆరు నెలల కాలంలోనే బ్యాంకింగేతర సంస్థల అప్పులు దాదాపు 40శాతం మేర పెరిగాయి. గతేడాది సెప్టెంబర్‌లో 15.72 లక్షల కోట్లు ఎన్‌బీఎఫ్‌సీలు అప్పులు తీసుకోగా.. ఈ ఏడాది మార్చికల్లా 22 లక్షల కోట్ల రుణాలు స్వీకరించాయి. వీటి ఎన్‌పీఏలూ భారీగా పెరిగినట్టు ఆర్బీఐ ఓ నివేదికలో వెల్లడించింది. గతేడాది మార్చి చివరికల్లా ఎన్‌బీఎఫ్‌సీల ఎన్‌పీఏలు, మొండి బాకీలు 5.3శాతం ఉండగా.. 2019 మార్చికల్లా 6.6 శాతానికి పెరగడం గమనార్హం. అలాగే, ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంక్ రుణాలు అసాధారణంగా పెరిగాయి. 2019 మార్చికల్లా ఎన్‌బీఎఫ్‌సీలు బ్యాంకులకు మొత్తం దాదాపు 6.4 లక్షల కోట్లు అప్పుపడ్డాయి. గతేడాదిలో ఈ విలువ 4.9లక్షల కోట్లుగా ఉన్నది. అంటే రుణాల్లో దాదాపు 22శాతం పెరుగుదల నమోదవడం గమనార్హం. ఇదిలా ఉండగా.. కనీస మూలధనం లేక లైసెన్సు కోల్పోతున్న ఎన్‌బీఎఫ్‌సీల సంఖ్యా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,701 బ్యాంకింగేతర సంస్థలు లైసెన్సులను ఆర్బీఐ రద్దు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య కేవలం 26 మాత్రమే. అంతేకాదు, ఈ రంగానికి కీలక రుణదాతలైన మ్యూచువల్ ఫండ్లు రుణాలు ఇవ్వడం లేదు. పలు పేరొందిన ఎన్‌బీఎఫ్‌సీలూ దివాళా తీసే దుస్థితికి చేరాయి. జులైలో డీహెచ్‌ఎఫ్‌ఎల్ రుణాలు తిరిగి చెల్లించడంలో జులైలో చేతులెత్తేసింది. మరో ఎన్‌బీఎఫ్‌సీ ఆల్టికో క్యాపిటల్ సెప్టెంబర్‌లో దివాళా తీసే స్థితికి చేరిందని కథనాలు వివరిస్తున్నాయి. కాగా, భారీ అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఇప్పటికే ఇండియాబుల్స్ హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ రంగం మరింత ప్రమాదకర పరిస్థితుల్లోకి జారిపోయే ప్రమాదముందని పలువురు హెచ్చరిస్తున్నారు.

బ్యాంకింగేతర రంగాన్ని సంక్షోభం నుంచి బయపడేసేందుకు మోడీ సర్కారు తీసుకుంటున్న చర్యలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదన్న చర్చ నడుస్తున్నది. కాగా, ఎన్‌బీఎఫ్‌సీలకు అనుగుణంగా సవరించి దివాళా చట్టం(ఇన్‌సాల్వెన్సీ బ్యాంక్రప్టసీ కోడ్) పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్రం సమాయత్తమవుతున్నట్టు సమాచారం. క్రిటికల్ కేటగిరీలో ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలను బాధ్యతలను తీసుకునేందుకు ప్రభుత్వం ఒక రిజల్యూషన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసే అవకాశమున్నదని తెలిసింది. అయితే, బ్యాంకింగేతర రంగంలోని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపే ప్రణాళికలను సర్కారు రూపొందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వారంలో లక్ష కోట్ల నష్టం

- టాప్ టెన్‌లోని ఏడు దేశీయ కంపెనీల మార్కెట్ విలువలో భారీ క్షీణత

న్యూఢిల్లీ : గతవారం దేశీయ కంపెనీలు భారీగా మార్కెట్ విలువను కోల్పోయాయి. దేశంలోని పది దిగ్గజ కంపెనీల్లోని ఏడు సంస్థలు గతవారం మార్కెట్ ప్రతికూలతనే ఎదుర్కొన్నాయి. ఇవి మొత్తంగా దాదాపు లక్ష కోట్ల రూపాయల మార్కెట్ క్యాపిటల్‌ను కోల్పోయాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా సుమారు రూ. 30వేల కోట్ల నష్టాన్ని చవిచూసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతోపాటు రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్), హిందూస్థాన్ యూనిలివర్, హెచ్‌డీఎఫ్‌సీ, కోటక్ మహీంద్ర బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్‌లు తీవ్రంగా నష్టపోయాయి. కాగా, టాప్‌టెన్‌లోని మూడు కంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, ఐటీసీలు ఈ వారంలో లాభపడ్డాయి. శుక్రవారం నాటికి ముగిసిన మార్కెట్‌లో ఈ మూడు కంపెనీలు తమ మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను పెంచుకున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్(ఎంక్యాప్) రూ. 30,198.62 కోట్లు నష్టపోయి రూ. 6,50,446.47కి పడిపోయింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 22,866.93 కోట్లు కుచించుకుని రూ. 2,67,265.32కి తగ్గింది. కోటక్ మహీంద్ర బ్యాంక్ ఎంక్యాప్ రూ. 15,624.6 కోట్లు నష్టపోయింది. అలాగే, హిందూస్థాన్ యూనిలివర్ రూ. 14,287.76 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ రూ. 10,178.84 కోట్లు, బజాజ్ ఫైనాన్స్ రూ. 9,437.91 కోట్లు, ఆర్‌ఐఎల్ రూ. 824.08 కోట్ల ఎంక్యాప్ నష్టాలను చవిచూశాయి.

14 నుంచి బడ్జెట్ కసరత్తులు

- ఆర్థిక శాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సర(2020-21) బడ్జెట్ రూపకల్పన కోసం కేంద్ర ఆర్థిక శాఖ కసరత్తులు చేసేందుకు సిద్ధమైంది. ఈ నెల 14వ తేదీ నుంచి ఈ కసరత్తులు మొదలవుతున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన బడ్జెట్ డివిజన్ విడుదల చేసిన బడ్జెట్ సర్క్యూలర్‌లో పేర్కొంది. ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమనం, పడిపోయిన రెవెన్యూ కలెక్షన్ల వంటి పలు కీలకమైన సవాళ్లను ఈ బడ్జెట్ కసరత్తులో భాగంగా పరిశీలించనున్నారు. మోడీ 2.0 సర్కారుకు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్‌కు ఇది రెండో బడ్జెట్. ప్రీ బడ్జెట్, రివైజ్డ్ ఎస్టిమేట్(ఆర్‌ఈ) సమావేశాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతాయని ఆ సర్క్యూలర్ తెలిపింది. ఆర్థిక సలహాదారులందరూ యూనియన్ బడ్జెట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌కు చెందిన ఆర్‌ఈ మాడ్యుల్‌లో సమావేశాలకు సంబంధించిన సమాచారమంతా ఉండేలా చూసుకోవాలని సూచించింది. ఈ సమావేశాలకు 14న మొదలై నవంబర్ మొదటి వారం వరకు కొనసాగుతాయని వివరించింది. ఎక్స్‌పెండిచర్ సెక్రెటరీ.. ఆర్థిక సలహాదారులు, ఇతర కార్యదర్శులతో చర్చలు జరిపాక 2020-21 సంవత్సర అంచనా పద్దు తుది అంకం పూర్తవుతుంది. ఈ సర్క్యూలర్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్, ట్రైబల్ సబ్‌ప్లాన్, జెండర్, చైల్డ్ బడ్జెట్‌కు సంబంధించిన సమాచారాన్ని నింపాలన్న సూచనలున్నట్టు తెలిసింది.

మరోసారి వడ్డీ రేట్ల కోత?

డిసెంబర్‌లోపు ఆర్బీఐ మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తుంది : గోల్డ్‌మాన్ సాచ్స్

న్యూఢిల్లీ : ఆర్థిక మందగమనంతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) మరోసారి కీలక వడ్డీరేట్లకు కోత పెట్టే అవకాశ మున్నదని అంచనా వేస్తున్నారు. డిసెంబర్‌లోపు మరో 25 బేసిస్ పాయింట్లను తగ్గిస్తుందని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మాన్ సాచ్స్ అంచనా వేసింది. ఆర్బీఐ ఈ ఏడాదిలో ఇప్పటికే ఐదుసార్లు కీలక వడ్డీరేట్లను తగ్గించింది. ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమనం నుంచి బయటపడేందుకు తోడ్పడేలా రెపోరేటులో ఇటీవ లే 25 బేసిస్ పాయింట్ల కోత పెట్టింది. దీంతో ఈ ఏడాదిలో మొత్తంగా రెపోరే టులో 135 బేసిస్ పాయింట్లను కుదించినట్టయింది. ఈ కోతతో రెపోరేటు 5.40 శాతం నుంచి 5.15 శాతానికి పడిపోయింది. ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) రెపోరేటులో 25 బేసిస్ పాయింట్లను శుక్రవారం తగ్గించి 5.15 శాతానికి కుదించిన విషయం తెలిసిందే. ద్రవ్యలోటు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకునే వృద్ధిరేటు పుంజుకునే వరకు ఈ రెపోరేటును కొనసాగిస్తామని ఎంపీసీ వివరిం చింది. కాగా, ఈ రెపోరేటులో మరో 25 బేసిస్ పాయింట్ల కోత పెట్టి 4.9శా తానికి ఆర్బీఐ తగ్గించే అవకాశమున్నదని గోల్డ్‌మాన్ సాచ్స్ ఓ రిపోర్టులో అంచనా వేసింది. ఈ నెలలో యూఎస్ కూడా కీలక వడ్డీ రేట్లను తగ్గించే అవకాశము న్నదని, దానికి అనుగుణంగా ఆర్బీఐ కూడా నిర్ణయం తీసుకుంటుందని అభిప్రా యపడింది. అంతేకాదు, డిసెంబర్ కల్లా ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమనం తప్పిన సూచనలతోపాటు.. అంతర్జాతీయ పరిస్థితులూ అనుకూలంగా ఉంటే రెపోరేటు తగ్గించే తంతుకు డిసెంబర్‌లో ఆర్బీఐ ఫుల్‌స్టాప్ పెడుతుందనీ ఊహించింది. అలాగే, ద్రవ్యోల్బణం నాలుగు శాతం దాటి నిత్యావసర ధరలు చుక్కలనంటితే కూడా ఆర్బీఐ ఈ వడ్డీరేట్ల కోతను ఆపేస్తుందని వివరించింది.

ఈక్విటీల నుంచి 3వేల కోట్ల ఎఫ్‌పీఐలు వెనక్కి

న్యూఢిల్లీ : భారత మార్కెట్ల నుంచి సుమారు మూడు వేల కోట్ల విలువైన విదేశీ పెట్టుబడులు కేవలం మూడు ట్రేడింగ్‌సెషన్(ఈ నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు)లలోనే వెనుదిరిగాయి. ప్రపంచ ఆర్థిక మాంద్యం, వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో ఈక్విటీల నుంచి ఈ మొత్తం ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్లు(ఎఫ్‌పీఐ) వెనక్కి మళ్లాయి. సెప్టెంబర్‌లో ఈక్విటీ మార్కెట్‌లోకి సుమారు 7,850 కోట్లు ఎఫ్‌పీఐలు పెట్టుబడులుగా చేరగా.. నేడు దాదాపు మూడు వేల కోట్ల విలువైన విదేశీ పెట్టుబడులు వెనక్కి తరలాయి. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్ల కోత, సెబీ తీసుకున్న మార్కెట్ నిబంధనలతో ఈ పెట్టుబడులు మళ్లీ తిరిగొస్తాయన్న అంచనాలున్నాయి. డిపాజిటరీ డేటా ప్రకారం.. విదేశీ మదుపరులు రూ. 2,947 కోట్ల ఎఫ్‌పీఐలు ఈక్విటీల నుంచి రూ. 977 కోట్లు డెబ్ట్ సెగ్మెంట్ నుంచి వెనక్కి తీసుకున్నారు. దీంతో మొత్తంగా 3,924 కోట్ల విదేశీ పెట్టుబడులు భారత క్యాపిటల్ మార్కెట్ నుంచి వెనుదిరిగాయి.

సమ్మెపై సర్కారు కన్నెర్ర

- ఉద్యోగాలు ఊడబీకమన్న సీఎం కేసీఆర్
- భగ్గుమన్న కార్మికసంఘాలు
- ఎందాకైనా సై: టీఎస్‌ఆర్టీసీ జేఏసీ

సమ్మె యథాతథం

పలుచోట్ల ఉద్రిక్తతలు.. పోలీసులతో తోపులాటలు

- డిపో, బస్టాండ్ల ఎదుట వినూత్న నిరసనలు, ప్రదర్శన
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం
- పండుగ కోసం ప్రయాణికులకు తప్పని అగచాట్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికులు ఐక్యంగా ఉద్యమించడం సర్కారుకు నచ్చలేదు. ఉద్యోగాల్లోంచి తీసేస్తామన్నా అదురు బెదురు లేకుండా సమ్మెను కొనసాగించడం సీఎం కేసీఆర్‌కు ఆగ్రహాన్ని తెప్పించింది. 2003 జులైలో అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఒక్క కలంపోటుతో సమ్మె చేస్తున్న లక్షమందికిపైగా ప్రభుత్వ ఉద్యోగుల్ని తొలగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదేబాటలో సీఎం కేసీఆర్ సర్కార్ నడుస్తున్నది. నిన్నమొన్నటి వరకు ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ అని చెప్పిన ప్రభుత్వం...ఇప్పుడు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నది. హక్కులు అంటూ సర్కారును ధిక్కరిస్తే సహించబోమని, అడుక్కుంటే... దయతలచి సానుభూతి చూపుతామే తప్ప ఆందోళనలు, సమ్మెలు అంటే ఉక్కుపాదం తప్పదని స్పష్టంగానే చెప్పేసింది. సర్కారు విధించిన గడువులోపు విధుల్లో చేరనివారందరినీ సర్వీస్ నుంచి తొలగించి, తక్షణం కొత్త రిక్రూట్‌మెంట్లు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీచేశారు. దీనితో ఆర్టీసీ కార్మికుల సమ్మె ఆందోళనకరంగా మారింది. రెండోరోజు ఆదివారం కూడా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేశారు. విధుల్లో చేరాలనే సర్కారు బెదిరింపుల్ని ఖాతరు చేయలేదు. పైపెచ్చు ఆందోళనలు ఉధృతం చేశారు. అన్ని జిల్లాల్లోనూ కార్మిక సంఘాలు, రాజకీయపార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. అన్ని డిపోల ఎదుట కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మలు ఆడారు. సీఎం కేసీఆర్ వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని, సమ్మెపట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ ఖండించింది. కన్వీనర్ ఈ అశ్వత్థామరెడ్డి (టీఎమ్‌యూ) కో కన్వీనర్లు కె రాజిరెడ్డి(ఎంప్లాయీస్ యూనియన్), వీఎస్ రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఓ సుధ (సూపర్‌వైజర్స్ అసోసియేషన్) ఆదివారం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాతపూర్వక హామీ ఇస్తే తప్ప సమ్మెను విరమించేది లేదని తేల్చిచెప్పారు. సర్కారు బెదిరింపులకు లొంగబోమని స్పష్టంచేశారు. టీఎస్‌ఆర్టీసీ జేఏసీ-1 కన్వీనర్ కె హన్మంతు ముఖ్యమంత్రి నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజు కూడా ఆర్టీసీ కార్మికుల అరెస్టులు కొనసాగాయి. కార్మికుల ఆందోళనల్ని అణచివేసేందుకు ప్రభుత్వం పోలీసుల్ని వినియోగించుకుంటున్నది. మరోవైపు ఆర్టీసీ యాజమాన్యం బస్సుల్ని గతంకంటే బాగా తిప్పుతున్నామని ప్రకటించింది. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించారు. రోజువారీ ఆదాయ, వ్యయాల్ని చెప్పేందుకు అధికారులు నిరాకరించారు. ఆదివారం 11వేలకు పైగా వాహనాలను నడిపి, ప్రయాణీకుల్ని గమ్యస్థానాలకు చేర్చామని పేర్కొన్నారు. 3,327 ఆర్టీసీ బస్సులు, 2,032 అద్దెబస్సులు నడిపామని తెలిపారు. 6వేలకు పైగా ప్రయివేటు వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీక్యాబ్‌లతో రవాణాసౌకర్యాలను మెరుగుపరిచినట్టు వివరించారు. మెట్రోరైల్, ఎమ్‌ఎమ్‌టీఎస్ రైళ్ల ట్రిప్పుల్ని కూడా రెట్టింపు చేసినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డిపోల నుంచి ఆర్టీసీ బస్సు ఒక్కటి కూడా బయటకు రాలేదు. కేవలం కార్మికులతో మైండ్‌గేమ్ ఆడేందుకే ప్రభుత్వం ఈ తరహా ప్రకటనలు చేస్తున్నదని హైదరాబాద్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. 36 రోజుల క్రితం ఆర్టీసీ కార్మికసంఘాలు సమ్మెనోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పట్టించుకోనట్టు వ్యవహరించిన ప్రభుత్వం చివరి దశలో సీనియర్ ఐఏఎస్‌లతో త్రిసభ్య కమిటీ, చర్చలు అంటూ కాలయాపన చేసింది. జేఏసీ నేతల ఏ ఒక్క డిమాండ్‌నూ పరిష్కరించేలా హామీ ఇవ్వలేదు. దీంతో ఆర్టీసీ కార్మికులు అనివార్యంగా సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు దీన్ని అవకాశంగా తీసుకొని ప్రభుత్వం కార్మికులపై దుష్ప్రచారం మొదలు పెట్టింది. ఆర్టీసీ నష్టాలు, ప్రయాణీకుల కష్టాలు అంటూ అధికారులు, మంత్రులు పాతరాగం అందుకున్నారు. ఈ ప్రచారాన్ని ఆర్టీసీ కార్మికులు సమర్ధవంతంగా తిప్పికొట్టారు.

పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు పోలీసులకు, ఆర్టీసీ జేఏసీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. బస్ డిపో ఎదురుగా సద్దుల బతుకమ్మ సంబరాలను కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు నిరసన తెలుపుతూ బతుకమ్మ ఆటలు ఆడారు. కొద్దిసేపు బస్సులు బయటకు రాకుండా నిలిచిపోయాయి. పోలీసుల పహారా మధ్య మహిళా మణుల ఆటపాటలు హోరెత్తాయి. నల్లగొండ రీజియన్‌లో కార్మికులు చేపట్టిన ర్యాలీలో వివిధ ప్రజాసంఘాలు, పార్టీలు పాల్గొని మద్దతు తెలిపాయి. నల్లగొండ బస్సు డిపోలో మహిళ కండక్టర్లు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. పట్టణంలోని పెద్దగడియారం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు, అరుణోదయ విమలక్క పాల్గొన్నారు. దేవరకొండలో ర్యాలీ చేశారు. మహిళా కార్మికులు బతుకమ్మ పేర్చి ఆడిపాడి నిరసన తెలిపారు. చండూరు డిపో పరిధిలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నార్కట్‌పల్లి, మిర్యాలగూడలోనూ వినూత్న నిరసన తెలిపారు. జనగామ, మానుకోటలో ప్లకార్డులు ప్రదర్శించారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో ఆర్టీసీ సమ్మె రెండోరోజు విజయవంతమైంది. ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులతో డిపోలన్ని మూగబోయాయి. ఇదే అదునుగా ప్రయివేట్ ట్రావెల్స్ జనాలను నిలువుదోపిడీకి గురి చేస్తున్నాయి. ఆర్టీసీ బస్సులో రూ.50 చార్జీతో వెళ్లే ప్రాంతాలకు ఇప్పుడు రూ.150 నుంచి రూ.200 వరకు ప్రయివేట్ ఆపరేటర్లు వసూలు చేస్తున్నారు. కుషాయిగూడ డిపోలో కార్మికులు చేపట్టిన నిరసనతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల నిరసన కారులను అడ్డుకున్నారు. దీంతో స్వల్పంగా తోపులాట జరిగింది. పలు డిపోల ఎదుట కార్మికులు బతుకమ్మ ఆడారు. సంగారెడ్డి డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ బస్టాండ్ వద్ద

కార్మికుల సమ్మెకు కాంగ్రెస్, సీపీఐ(ఎం), బీజేపీ మద్దతు తెలిపాయి. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. కామారెడ్డిలో మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి డిపో ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలియజేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కోరుట్ల, మెట్‌పల్లి డిపోల్లో బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఆర్టీసీ బస్సులు నడవలేదు. ప్రయివేటు వాహనాలే బస్టాండ్‌ల నుంచి ప్రయాణికులను తరలించాయి. పెద్దపల్లి బస్‌స్టాండ్ ఆవరణలో ఆర్టీసీ కార్మికులు ఆందోళనలు చేసే క్రమంలో ఏసీపీ నరేందర్, పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని అడ్డుకున్నారు. గోదావరిఖని బస్టాండ్ సమీపంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో సమ్మె కొనసాగుతున్నది. రెండోరోజు కార్మికులు రాకపో వడంతో డీఎం శంకర్‌రావ్ జిల్లా కేంద్రంలో అద్దె బస్సులు కొనసాగించారు. బస్టాండ్, డిపో చుట్టూ పోలీసులను భారీ గా మోహరించారు. నిర్మల్ ఎస్పీ సి.శశిధర్ రాజు నేతృత్వం లో భారీ భద్రత ఏర్పాట్లను నిర్వహించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్‌లో ఆర్టీసీ కార్మికులు బతుకమ్మ ఆడారు.

రంగారెడ్డి జిల్లాలోని డిపోల్లో ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. కార్మికుల కుటుంబసభ్యులు, మహిళ కండక్టర్లు డిపోల ఎదుట బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో పోలీసుల పహారా మధ్య బస్సులను నడిపించే ప్రయత్నం చేశారు. షాద్‌నగరంలో 120 బస్సులకుగాను 25 బస్సులను నడించారు. రాజేంద్రనగర్‌లో బస్సు డిపో నుంచి కదలలేదు. ప్రయివేటు వాహనాలకు అనుమతి ఇవ్వడంతో హన్మకొండ బస్టాండ్‌కు పెద్దఎత్తున్న వాహనాలు చేరుకున్నాయి. చేవెళ్ల, మహేశ్వరం, హయత్‌నగర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

మహబూబ్‌నగర్‌లో బస్సు డిపో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. కల్వకుర్తిలో కార్మికులు ర్యాలీ చేసి డిపో ఎదుట కర్రలు పాతారు. కొల్లాపూర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, జడ్చర్ల, నారాయణపేటలో సమ్మె ప్రశాంతంగా జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చౌరస్తా వరకు ర్యాలీ చేశారు. ప్రయివేట్ వాహనాదారులు ప్రయాణికుల నుంచి నాలుగు రెట్లు వసూలు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్లడానికి రూ. 100ల చార్జీ ఉండగా ప్రయివేటు వాహనాల్లో రూ.400లు వసూలు చేస్తున్నారు.

డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం రావిచేడుకు చెందిన జోగు వెంకటేశ్ ఆర్టీసీ డ్రైవర్‌గా మహేశ్వరం డిపోలో విధులు నిర్వహిస్తున్నాడు. ఎన్నికల సమయంలో కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీనిచ్చారనీ, ఇప్పుడు కార్మికులను ప్రజల ఎదుట దోషులుగా నిలబెట్టారన్న మనస్తాపంతో గ్రామంలోని ఐడియా టవర్‌ను ఎక్కి ఆత్మహత్యయాత్నానికి ప్రయత్నించాడు. సుమారు గంటపాటు గ్రామస్తులు చెప్పినా సెల్‌టవర్ దిగలేదు. జోగువెంకటేశ్ భార్య, ఇద్దరు పిల్లలు అక్కడికి వచ్చి ఏడ్వడంతో టవర్ దిగాడు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా బాధితుడు, కార్మికులు, స్థానికులు డిమాండ్ చేశారు.

విలీనమయ్యేవరకు సమ్మె ఆగదు

అద్దె బస్సులు తెస్తే అడ్డుకుంటాం

- సంస్థ ప్రయివేటీకరణకు ప్రభుత్వం కుట్ర
- ఉద్యోగ సంఘాలు కార్మికులతో కలిసి రావాలి: ఆర్టీసీ కార్మిక జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులు జీతబత్యాల కోసం సమ్మె చేయడం లేదు. నష్టాల్లో ఉన్న ప్రజారవాణా వ్యవస్థను కాపాడేందుకు సమ్మె చే

సాములోరి మోసాలకు అంతం లేదా..?

ఎం.కారుణ్య

బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి స్వామి చిన్మయానంద అరెస్టుతో స్వాములు, బాబాలకు సంబంధించిన రాసలీలల బాగోతం మరోసారి చర్చనీయాంశంగా మారింది. లైంగిక ఆరోపణలు రుజువై, చేతులకు బేడీలు వేయించుకున్న ఈ స్వామీజీ వయసు అక్షరాలా 72 సంవత్సరాలు. ఈయన స్వగ్రామం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోండా జిల్లా. 'అవధ్' అనే రాచ కుటుంబానికి చెందినవాడు. యుక్త వయస్సులోనే ఆధ్యాత్మిక బోధనలకు ఆకర్షితుడై.. బ్రహ్మచర్యం వైపుకు మళ్లాడు. లక్నో యూనివర్సిటీ నుంచి ఎంఏ పూర్తి చేసి, డాక్టరేట్ పట్టా పొందాడు. అంతేకాకుండా 'ప్రమర్థ్, 'వివేక్ రశ్మి' అనే పత్రికలకు సంపాదకత్వం కూడా వెలగబెడుతున్నాడు. వాజ్‌పెయ్ ప్రభుత్వంలో హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేశాడు.

చిన్మయానందకు షాజహాన్‌పూర్‌లో 5 కళాశాలలున్నాయి. తన కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న యువతులను లైంగిక వేధింపులకు గురిచేయడం, వారు స్నానాలు చేస్తున్నప్పుడు, బట్టలు మార్చుకుంటున్నప్పుడు రహస్యంగా వీడియోలు తీసి, బ్లాక్ మెయిల్ చేసి వాడుకోవడం ఈయనకు అలవాటు. ఈక్రమంలోనే న్యాయ విద్య రెండో సంవత్సరంలో ఉన్న యువతిని కూడా సంవత్సర కాలంగా లైంగిక వేధింపులకు గురిచేసి, అఘాయిత్యాలు కొనసాగిస్తున్నాడు. ఈ దుర్మార్గాలను భరించలేక ఆ యువతి చివరికి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడే ఆయనకు ఓ ఆశ్రమం కూడా ఉంది. ఆయన నిర్మించుకున్న సామ్రాజ్యం కొన్ని వేల కోట్లు విలువ చేసేదిగా ఉందని జాతీయ మీడియా పేర్కొంది. అయితే వీటికి సంబంధించిన రికార్డులు మాత్రం ఆయన ఎక్కడా, ఎవరికి అందుబాటులో ఉంచడట. 1999లో జరిగిన ఎన్నికల్లో చివరి సారిగా ఆయన విజయం సాధించాడు. తర్వాతి ఎన్నికల్లో స్వామి చిన్మయానంద ఓటమి పాలైనా... బీజేపీ ఇప్పటికీ ఆయనను ప్రభావితమైన, బలమైన నాయకుడిగానే చూస్తున్నది. ఆయనపై లైంగిక ఆరోపణలు రావడం ఇదేం కొత్తకాదు. 2011లో కూడా చిన్మయానందపై లైంగిక ఆరోపణలు వచ్చాయి. కేసులు కూడా నమోదయ్యాయి. అయితే 2018లో బీజేపీ ప్రభుత్వం ఆ కేసులను కొట్టిపారేసింది.

బీజేపీకి సన్నిహితుడైన డేరాబాబాకు 20 ఏండ్ల శిక్ష పడింది. రాజస్తాన్‌లోని గంగానగర్ జిల్లా శ్రీగురుసర్ మోదియా అనే గ్రామంలో ఓ సిక్కు భూస్వామ్య కుటుంబంలో జన్మించిన డేరాబాబా అసలు పేరు గుర్మీత్‌సింగ్. చిన్నతనం నుండే ఆధ్యాత్మిక చింతన ఎక్కువట. పంజాబ్‌లోని సిర్సాలో ఉన్న డేరా సచ్ఛా సౌదా ఆశ్రమానికి తండ్రితో కలసి వెళ్ళినప్పుడు, ఆశ్రమ గురువు షా సత్నాంసింగ్ అతడిలోని టాలెంటును పసిగట్టి ఏడేండ్ల వయసులోనే గుర్మీత్‌ను చేరదీశాడు. అప్పుడే షా సత్నాం గుర్మీత్ పేరును రామ్ రహీమ్ బాబాగా మార్చాడు. పదహారేండ్ల తరువాత ఒకరోజు శిష్యులందరినీ సమావేశపరిచి గుర్మీత్‌ను తన వారసుడిగా ప్రకటించాడు షా. అప్పుడు అతడి వయసు 23ఏండ్లు. అప్పటినుండి అనేక సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పేరు గడించాడు. షా సత్నాంసింగ్ బతికుండగానే 1990లో డేరా సచ్ఛాసౌదాకు అధిపతి అయ్యాడు.

1948లో మస్తానా బలూచిస్తానీ అనే ఆధ్యాత్మిక గురువు ఈ డేరా సచ్ఛా సౌదాను స్థాపించాడు. మస్తానా తరువాత షా సత్నాంసింగ్ బాధ్యతలు స్వీకరించాడు. అదే పరంపరకు మరికాస్త పదును పెట్టాడు రామ్ రహీం బాబా. ఆధ్యాత్మికతకు సేవా కార్యక్రమాలను జోడించి, ప్రజల మనసులు కొల్లగొట్టాడు. లక్షలాది మంది భక్తులను ఆకర్షించి వందల కోట్లకు అధిపతి అయ్యాడు. ఆరుదేశాల్లో బాబాకు ఐదు కోట్లమంది భక్తులున్నారు. వెయ్యి ఎకరాల్లో టౌన్ షిప్ నిర్మించి, సొంత సామ్రాజ్యాన్నే ఏర్పాటు చేసుకున్నాడంటే మామూలు విషయం కాదు. అంతేకాదు, పందొమ్మిది గిన్నీస్ రికార్డులను కూడా సొంతం చేసుకున్నాడు. విరాళాల రూపంలో ఈయనకు వచ్చే రోజువారీ ఆదాయం కోటి రూపాయలట. బాబా కేవలం కాషాయం కట్టి ప్రవచనాలు మాత్రమే చెబుతాడనుకుంటే పొరపాటు. పాటలు పాడతాడు, డాన్సులు చేస్తాడు, ఫైటింగులు చేస్తాడు, హత్యలు చేస్తాడు, అత్యాచారాలు చేస్తాడు, తన సినిమాలకు తానే హీరో. మాటలు, పాటలు, సంగీతం, దర్శకత్వం, కాస్ట్యూమ్స్ డిజైనింగ్ సమస్తమూ బాబానే. విలాసవంతమైన జీవితానికి గుర్మీత్ బాబా చిరునామా.

సిర్సా ఆశ్రమంలో బాబాకు 'గుఫా' పేరుతో ఓ శయన మందిరం ఉంటుంది. బాబా బాడీగార్డులు కూడా కత్తిలాంటి అమ్మాయిలే. బాబా తనకు నచ్చిన మహిళలకు 'గుఫా'లో ప్రత్యేక అనుగ్రహమైన 'పితాజీ మాఫీ'ని ప్రసాదిస్తాడు. శీలాపహరణకు ఇది బాబా పెట్టుకున్న ముద్దుపేరు. శ్రీకృష్ణుడికి 360 మంది గోపికలున్నారని, ప్రతిరోజూ ఆయన వారిని ప్రేమిస్తుంటాడని, తాను కూడా అలాంటివాడినేనని చెబుతాడు. కృష్ణుడు దేవుడిగా ఈనాటికీ పూజించబడుతున్నాడని, కనుక 'పితాజీ మాఫీ'లో తప్పేమీ లేదని నచ్చజెబుతాడు. తాను కూడా దేవుణ్ణే కాబట్టి మోక్షం లభిస్తుందంటాడు. దీనికోసం కొంతమంది సాధ్వీమణులతో బాబా ఒక వ్యవస్థనే ఏర్పాటు చేశాడు. బాబాకు నచ్చిన అమ్మాయిలను ఈసాధ్వీలు మానసికంగా సిద్ధంచేసి, బాబా వద్దకు పంపిస్తారు. అలా తాను జైలుకు వెళ్లే నాటికి 250 మంది మహిళలు డేరాబాబా చేతిలో అత్యాచారానికి గురయ్యారట. కాని ఇద్దరు మహిళలు మాత్రం ధైర్యం చేసి 2002లో అప్పటి ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పెయ్‌కి, పంజాబ్ – హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు లేఖలు రాశారు. నాటి ప్రధాని వాజ్‌పెయ్ మహిళల మొరను పట్టించుకోలేదు. కాని హైకోర్టు మాత్రం లేఖను

సూమోటోగా స్వీకరించింది. డేరాను సందర్శించి నివేదిక సమర్పించాలని జిల్లా సెషన్స్ జడ్జిని న్యాయమూర్తి ఆదర్శ్ కుమార్ గోయల్ ఆదేశించారు. నాటి ప్రధాని వాజ్‌పేయి నుండి, నేటి ప్రధాని మోడీ వరకు బాబాకు సన్నిహితులే. బీజేపీకి బాబా చాలాకాలసినవాడు కనుక, కేసు ఇన్నాళ్లపాటు సాగీసాగీ ఎట్టకేలకు ఓ కొలిక్కివచ్చింది. పంచకుల సీబీఐ న్యాయస్థానం డేరాబాబా దోషి అని తేల్చిచెప్పింది. తీర్పు వెలువడిన అనంతరం బాబా అనుచరులు ఉత్తరాది రాష్ట్రాల్లో జరిపిన బీభత్సకాండలో కోట్లాది రూపాయల ఆస్తినష్టం సంభవించింది. 40మందికిపైగా అమాయకులు మరణించారు. వందలాది వాహనాలు, కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. రేపిస్టు బాబా కోర్టుకు వస్తున్న సందర్భంగా అనుసరించిన అతని 300 కార్ల కాన్వాయి దేశ చరిత్రలో ఓ సంచలనం. అనంతరం ఆగస్టు 28న రోహ్ తక్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి డేరా బాబాకు ఇరవయ్యేండ్ల కఠిన కారాగార శిక్ష విధించారు.

ఇంతకుముందు కూడా ఇలాంటి అనేక సంఘటనలు వెలుగుచూశాయి. హర్యానాలోని సోనెపట్‌కు చెందిన రాంపాల్ సింగ్ జతిన్ కూడా ఈ కోవకు చెందినవాడే. హర్యానాలోని నీటిపారుదల శాఖలో ఇంజనీరుగా ఉద్యోగం వెలగబెట్టిన రామ్ పాల్ 2000లో ఉద్యోగం నుండి సస్పెండైన తరువాత, సద్గురురామ్ పాల్‌జీ మహారాజ్ అవతారం ఎత్తాడు. కబీర్ వారసుడినని చెప్పుకుంటూ అంచెలంచెలుగా తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ వంద కోట్లకుమించి ఆస్తుల్ని, పాతిక లక్షల మంది భక్తుల్ని సంపాదించుకున్నాడు. 'ఆశ్రమం' పేరుతో సువిశాలమైన, అత్యంత విలాసవంతమైన భవంతి నిర్మించుకున్నాడు. అతి నిరాడంబర జీవితం గడిపిన భక్తి తత్వవేత్త కబీర్ దాస్ మార్గమే తనదని చెప్పుకున్న రాంపాల్ మాత్రం విలాసపురుషుడే కాక,పెద్ద క్రిమినల్ కూడా! 2006లో అతడిపై హత్యకేసు నమోదైంది. బాబా శయన మందిరం పక్క గదిలో గర్భనిర్ధారణ కిట్లు, కండోమ్స్ అందుబాటులో ఉంటాయి. బాబాకు పాలతో స్నానం చేయించి, ఆ పాలతో పాయసం వండి భక్తులకు ప్రసాదంగా పంచిపెడతారు. కాళ్లుకడిగిన నీళ్లను భక్తితో చప్పరించి, నెత్తిన చల్లుకుంటారు. రాంపాల్ బాబా ఆధ్యాత్మిక డైరీలో ఇలాంటి లీలలు అనేకం ఉన్నాయని భక్తులు చెప్పుకుంటారు.

బాబాలుగా, స్వాములుగా చెలామణి అయ్యే అత్యధిక శాతం మంది జీవితాలు విలాసాలు, వివాదాలమయమే. చిత్తూరు జిల్లా వరదయ్యపాలెంలోని విజయకుమార్ నాయుడు, బుజ్జాయి అలియాస్ పద్మావతి దంపతులు 'అమ్మ భగవాన్'గా, 'కల్కి' అవతారంగా ప్రచారం చేసుకొని, రకరకాల పూజలపేరుతో అమాయకుల్ని మోసం చేసి లక్షల కోట్లు కూడబెట్టుకున్నారు. దాసాజీల పేరుతో కొంతమందికి 'డ్రగ్స్ 'అలవాటు చేసి బానిసలుగా మార్చుకున్నారు. కల్కి అవతారంగా చెప్పుకొనే విజయకుమార్ మహిళలతో భక్తి ముసుగులో రక్తివ్యవహారాలు నడిపిన విషయమూ జగద్విదితమే. కల్కి చేతిలో ఘోరంగా వంచించబడి, లక్షలాది రూపాయలు పోగొట్టుకున్న మాజీ భక్తులే ఈ బండారాన్ని బయటపెట్టి, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించడమూ అందరికీ తెలిసిందే. అలాగే తమిళనాడుకు చెందిన రాజశేఖర్ అనే యువ సన్యాసి నిత్యానందస్వామిగా అవతారం ఎత్తి, తమిళ నటి రంజితతో రాసలీలలు నడుపుతూ టీవీ చానళ్లకు అడ్డంగా దొరికిపోయిన సంగతినీ ప్రజలు మరచిపోలేదు. సార్థక నామధేయుడైన ఈ యువ స్వామిజీ అతి కొద్దికాలంలోనే ప్రపంచ వ్యాప్తంగా 30కిపైగా ఆశ్రమాలు ఏర్పాటు చేయగలిగాడంటే నిత్యానందుడి టాలెంట్ ఏమిటో మనకు తెలుస్తుంది. ఇంతేకాదు, ఈ విధంగా ఇంకా చాలామంది యోగులు, భోగులు, సాక్షులు రాజకీయ పదవులు అనుభవిస్తూ విలాసాల్లో మునిగి తేలుతున్నారు. నేటి చిన్మయానందుడితో పాటు, ఆశారామ్ బాపూ, ఆయుర్వేద బాబా, పర్యావరణ బాబా, జీవనదుల బాబా, జీవన కళల బాబా, వేలు ముంచే బాబా తదితరులంతా ఈ కోవకు చెందినవాళ్లే.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ స్వాములు, బాబాలకు ఇంతటి ఆదరణ ఎలా లభిస్తుందో ఆలోచిస్తే కేవలం ప్రజల అమాయకత్వం, మూఢత్వం, గుడ్డిభక్తే ప్రధాన కారణంగా మనకు కనిపిస్తుంది. వారి బలహీనతే పెట్టుబడిగా రకరకాల ఆశలుచూపి, ప్రలోభపెట్టి అమాయక ప్రజల్ని బుట్టలో వేసుకుంటారు. ఈ సాములోరి రంగులవలలో చిక్కేది కేవలం అమాయకులేనా, నిరక్షరాస్యులేనా..అంటే అదీకాదు. బాగా చదువుకున్న వాళ్లు, ఉన్నత హోదాలు వెలగబెడుతున్న వాళ్లూ ఉన్నారు. ఉన్నత విద్యావంతులతోపాటు, అధికారులూ, రాజకీయ నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానులు, రాష్ట్రపతుల్లాంటి అత్యున్నత హోదాలు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు సైతం బాబాలు, స్వాముల ఆశీస్సులకోసం వెంప ర్లాడుతూ, వారి పాదాలకు మోకరిల్లడం కూడా బాబాలు, స్వా ముల పబ్లిసిటీకి, అమాయక, సామాన్యప్రజల విశ్వాసాలకు కార ణమవుతోంది. 'అంతంత గొప్పవాళ్లే వారి కాళ్లపై పడుతుంటే వాళ్లతో పోల్చుకుంటే అసలు మనమెంత?' అన్న భావన బాబా లు, స్వాములపై భక్తిభావం పెరగడానికి కారణమవుతోంది. అసలు ఈ బాబాలు, స్వాములు కూడా తమలాంటి మానవులేనని, మానవ సహజ బలహీనతలకు అతీతులు కాని వారు దేవుండ్లు, దైవాంశ సంభూతులు ఎలా కాగలుగుతారని కూడా ప్రజలు ఆలోచించలేక పోతున్నారు. కాకపోతే, అందరూ చెయ్యలేని కొన్ని 'ట్రిక్స్' వీళ్లుచెయ్యగలరు. అందుకని ప్రజలే అప్రమత్తం కావాలి. చైతన్యవంతులు కావాలి. సమాజంలోని మూఢవిశ్వాసాలను, భక్తి ముసుగులో జరిగే అరాచకాలను ఎదుర్కొనే ప్రయత్నం చెయ్యాలి. మొత్తానికి ప్రజల్లోనే మార్పురావాలి. చైతన్యం వెల్లివిరియాలి. అప్పుడు మాత్రమే ఇలాంటి దుర్మార్గాలకు అడ్డుకట్టపడుతుంది.

mdokhan645@gail.com

కండ్లు తెరవకుండానే కాటికి...

కడుపులో తన్నినా ఆనందంగా భరించిన తల్లి తొమ్మిదో నెల పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరి ప్రాణాలను పణంగా పెట్టి బిడ్డకు ప్రాణం పోస్తుంది. ప్రాణాలతో పుట్టాల్సిన బిడ్డకు ప్రాణం లేదని తెలిస్తే ఆ తల్లి తల్లడిల్లిపోతుంది. గుండెలవిసేలా రోదిస్తుంది. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి తల్లులకు తరుచూ కడుపుకోత మిగులుస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో తరచూ జరుగుతున్న పసిబిడ్డల మరణాలు విస్మయానికి గురి చేస్తున్నాయి. వైద్యశాఖ నిర్లక్ష్యం కారణంగా అనేకమంది తల్లులు తమ బిడ్డలను పురిటిలోనే మర్చిపోవలసిన దుస్థితి కల్పిస్తున్నారు. కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో ఇటీవల వరుసగా జరుగుతున్న పసిబిడ్డల మరణాలు మరింత భయాందోళనకు గురి చేస్తున్నాయి.

డి.వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతం కావడంతో అనేక మంది ఆదివాసీలు, గిరిజనులు, పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన గర్భిణులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో చేరుతున్నారు. సుఖ ప్రసవం కోసం ఆరాటపడుతున్నారు. కానీ జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది.

సెప్టెంబర్ 12న గరిబ్‌పేట గ్రామానికి చెందిన కొంపల్లి నీలమ్మ, సర్వారం గ్రామానికి చెందిన భూక్యా రాణి, కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన నల్లాల నీరజల బిడ్డలు మృతి చెందారు. ఈ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వరుసగా పురిటిలోనే నలుగురు మగబిడ్డలు మృతి చెందారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యమే దీనికి కారణమని బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టినప్పటికీ కలెక్టర్, జిల్లా వైద్య శాఖ అధికారులు స్పందించకపోవడం విచారకరం.

పసిబిడ్డల వరుస మరణాలపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆశపడ్డ తల్లికి నిరాశే మిగులుతోంది. తాజాగా గత సోమవారం మగ శిశువు మృతి చెందింది. గైనక్ డాక్టర్, ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత వైద్య సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి దారుణ పరిస్థితులకు దారి తీయడానికి గల కారణాలు జిల్లా అధికారుల నిర్లక్ష్యమేనని చెప్పక తప్పదు. ప్రారంభదశలోనే సమస్యలను పరిష్కరించి ఉంటే ఇంతమంది తల్లులకు కడుపుకోత మిగిలేది కాదనీ, శిశువులు మృతిచెందేవారు కాదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సిబ్బంది ప్రాణాలు కాపాడాలి కానీ, వారి నిర్లక్ష్యం, టెంపర్ తనం కారణంగా ప్రాణాలు తీయడం సరైంది కాదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ ఏరియా అసుపత్రిలో వరుస శిశు మరణాలపై ప్రభుత్వం విచారణ నిర్వహించి దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సెల్ : 9396411966

సాయుధ పోరులో తెలంగాణ బెబ్బులి

గుమ్మడి లక్ష్మీనారాయణ

ప్రపంచ చరిత్రలో ఆదివాసీ పోరాటాలు అనన్యమైనవి. భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీదారుల పీడన శక్తుల నుండి విముక్తి కోసం, ఆదివాసీలు చేసిన స్వయం పాలన ఉద్యమాలు చరిత్రలో విస్మరించబడటం నేటి పాలకులు చరిత్రకారుల దౌర్భాగ్యస్థితిని గుర్తు చేస్తున్నాయి. ఇంకా చరిత్ర పుటల్లో చివరి మజిలీగా ఆదివాసీల త్యాగాలు మిగిలాయి. అనామకంగా మిగిలిన వారిలో రాంజీ గోండు, కొమురం సూరు, గుండాధర్, గంటందొర, మల్లు దొర వంటి యోధుల వరుసలో సోయం గంగులు దొర కూడా భవిష్యత్తు తరాలకు గుర్తే లేకుండా పోయాడు. ఫ్యూడల్ భూ సంబంధాల సమూల మార్పు కోసం తెలంగాణలో 1946 నుండి 1951 వరకు సాగిన మహోజ్వాల సాయుధ పోరాటం ఒక సామాన్యుడిని సాహస యోధుడిగా మార్చింది. మట్టి నుండి మాణిక్యాలు వెలికి తీసినట్టు మట్టి మనుషుల నుండి మహాయోధుడిగా ఎదిగిన ఆ భూమి పుత్రుడే గంగులు దొర.

ఉద్యమ ప్రస్థానం

కోయబెబ్బులిగా ప్రసిద్ధి చెందిన గంగులు నిజాం రాజ్యంలోని దట్టమైన పాల్వంచ (పాత తాలూకా) అటవీ పరిధిలో తిరుగులేని నాయకుడు. ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లా దమ్మపేట మండలం జమేదారు బంజర అనే కోయగూడెంలో రాముడు, పాపమ్మ దంపతులకు (1919) జన్మించాడు. గంగులు వ్యక్తిత్వం గానీ, పోరాట నాయకత్వం గానీ, శౌర్య పరాక్రమాలు గానీ, కోయ, గిరిజనుల్లో ఆయనపై గల అపార ఆధరాభిమానాలు గానీ ఎవరు సమగ్రంగా చిత్రించలేకపోయారు. గంగులు ఉద్యమ జీవితం మూడు దశల్లో ఉన్నట్టు తెలుస్తోంది. మొదటి దశలో గోదావరి తీరాన పేరంటాలపల్లి వద్ద ఆశ్రమం నిర్మించుకున్న బాలానంద స్వామి కనుసన్నల్లో సింగరాజు నాయకత్వలో నడిచిన నిజాం వ్యతిరేక పోరాటంలో గంగులు దళ నాయకుడిగా కీలక బాధ్యత వహించాడు. రెండో దశలో కమ్యూనిస్టులతో (1947–48)కలిసి పాల్వంచ అటవీ ప్రాంతాన్ని కమ్యూనిస్టుల ముఖ్య స్థావరంగా మార్చడలో కీలక భూమిక పోషించాడు. మలి దశలో జలియన్ వాలాబాగ్ దురంతంలాంటి పోలీసు చర్య ముసుగులోనూ మూడేండ్లపాటు కమ్యూనిస్టుల ఏరివేత, వందల మందిని ఊచకోత సాగించిన యూనియన్ సైన్యంపై పటిష్టమైన వ్యూహంతో మెరుపుదాడులు చేశాడు గంగులు. రజాకార్లను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించాడు.

గంగులు యవ్వనంలో గోదావరి తీరంలోని వేలేరుపాడు మండలం పేరంటాలపల్లిలో బాలానందస్వామి ఒక ఆశ్రమాన్ని నిర్మించాడు. కూనవరం, కట్కూరు పరిసరాల్లోని కొండారెడ్డి, కోయ జనులకు విద్యాబుద్ధలు నేర్పుతూ, వారికి తిండి గింజలు పంచిపెడుతూ ఆదుకుంటున్నాడు. ఆ స్వామి అనుచరుడైన సింగరాజు మాత్రం ఆదివాసీ యువకులను సమీకరించి రజాకార్లతో పోరాడుతున్నాడు. సాంప్రదాయక శిస్తులు (పుల్లరి), అక్రమలెవీ సేకరణ, వర్తక మోసాలను నిరసిస్తూ బాణం, కత్తి, వడిసెల వంటి ఆయుధాలతో నిజాం వ్యతిరేక పోరాటానికి పూనుకున్నాడు సింగరాజు. నిజాం నిరంకుశత్వాన్ని ప్రచారం చేస్తూ, మరోపక్క పేదల ఆస్తులు దోచుకోవడం, భూస్వాముల నుండి చందాలు, దొంగచాటు కలప వ్యాపారం వంటి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి, చివరికి యూనియన్ సైన్యంలోకి పారిపోయాడు. ఇలా సింగరాజు ప్రస్థానం ముగిసింది. అనతి కాలంలోనే కమాండర్‌గా ఎదిగిన గంగులు 1948 మార్చిలో పాల్వంచ ఏరియాలోకి ప్రవేశించిన కమ్యూనిస్టు దళంలో చేరిపోయాడు. గంగులు పార్టీలో చేరిన తర్వాతే కాస్త చదువుకోవడంతో సీపీఐ కమిటీలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాడు. చురుకైన యువతతో గ్రామ కమిటీలు నిర్మించాడు. కూలీరేట్ల పెంపు, పాలేర్ల జీతాల పెంపు, అక్రమ లెవీ సేకరణకు, అటవీ శాఖ కాజేసే పుల్లర్లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నడిపాడు. పార్టీలో సెంట్రల్ కమాండర్‌గా ఎదిగాడు. గెరిల్లా దళాల నిర్మాణంలో గంగులు కీలకపాత్ర పోషించంతో పాల్వంచ జంగల్ పూర్తి కమ్యూనిస్టుల స్థావరంగా మారింది.

గంగులు పోరాట ఫలితంగా సువిశాల పాల్వంచ రూపు రేఖలు మారాయి. దమ్మపేట కేంద్రంగా ఒక చెట్టు వద్ద ఉద్యమ జెండాను పాతాడు. రుద్రాక్షపల్లిలో ఒక ప్రజా కంటక భూస్వామిని అంతమొందించాడు. దీంతో భూస్వాములు గూడేలను వదిలి పారిపోయారు. అటవీ, రెవెన్యూ శాఖల జులుం నశించింది. అన్ని శిస్తులు రద్దయ్యాయి. భూమి, అడవిపై హక్కు లభించింది. స్వాతంత్ర్యానంతరం తొలుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా తెలంగాణ మాత్రం భారత యూనియన్‌లో విలీనం కాలేదు. ఈ నేపథ్యంలోనే 1948 సెప్టెంబర్ 13న యూనియన్ ప్రభుత్వం పోలీసు చర్య పేరిట నిజాం ప్రభుత్వంపై సైనిక దాడికి దిగింది. ఆధునిక ఆయుధాలతో 50వేలమంది సైనిక బలగాలు జనరల్ చౌదరి నేతృత్వంలో నిజాం భూభాగాన్ని చుట్టుముట్టడంతో 1948 సెప్టెంబర్ 17న నిజాం సర్కార్ లొంగిపోయింది. తెలంగాణలో వెల్లోడి నేతృత్వంలో సైనిక పాలన విధించబడింది. ఏజెన్సీ గూడేల నుండి భూస్వాములు పారిపోయి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ప్రతీకారంగా 1948 నుండి 51 వరకు యూనియన్ సైనికులు ఇల్లందు, పాల్వంచ, దమ్మపేట, బూర్గంపాడు, వేలేరుపాడు ప్రాంతాల్లోని విప్లవకారులను, సానుభూతిపరులను సామాన్యులను చిత్రహింసలు పెట్టారు.

తెలంగాణ ప్రజానీకంపై, ఆదివాసీలపై భారతసైన్యం విశృంఖలంగా, వికృతంగా దాడులు చేసిం ది. గంగులును మట్టుబెడితే తప్ప పాల్వంచ ఏరియాలో ఉద్యమాన్ని అణచలేమని భూస్వాములు, రాజకీయ నాయకులు, పోలీసు, మిలిటరీ భావించింది. అందుకు ఆంధ్రా సరిహద్దులోని జీలుగుమిల్లి (ప.గో)ని ఆనుకొని ఉన్న పాలచర్లకు చెందిన గంగులు సమీప బంధువైన వొగ్గెల చంద్రమ్మను పావుగా వాడుకున్నారు. ఆమె ఇచ్చిన జీలుగు కల్లు తాగి గంగులు స్పృహ కోల్పోయాడు. సైన్యం బంధించి రహస్యంగా దాచింది. పార్టీ రహస్యాలు చెప్పమని గంగులును చిత్రహింసలు పెట్టింది. అయినా ఏ విషయం బయటికి పొక్కలేదు. దమ్మపేటలో గంగులు కట్టిన జెండాను విప్పడానికే దమ్ముచాలని సైనికులు పిరికిగా బంధించి రుద్రాక్షపల్లిలోని రావిచెట్టుకు కట్టివేసి, ఆ వీరున్ని 1951 మే 21న కాల్చిచంపి నిస్సిగ్గుగా ఎదురు కాల్పులుగా చిత్రీకరించారు.

రజాకార్లను ఎదిరించిన మరో సాహసవీరుడైన సోయం గంగులు దొర గురించి అతికొద్ది మందికి మాత్రమే తెలుసు. నైజాం నవాబుతో, పెత్తందార్లతో పోరాడుతూ 32 ఏండ్లలోనే అమరుడయ్యాడు. ప్రభుత్వం ఆ కుటుంబానికి స్వాతంత్ర్య సమర యోధుడి పింఛన్ కల్పించలేదు. 68 ఏండ్లు దాటినా గంగులు వారసులైన సోయం రాములు, వెంకటేశ్వర్లు, పోతురాజులు సాధారణ వ్యవసాయ కూలీలుగా బతుకుతున్నారు. రంపచోడవరం, మారేడుమిల్లి, బుట్టాయిగూడెం ప్రాంతాల్లో అల్లూరి సీతారామరాజుతో కలిసి గంగులు మన్యం పోరాటంలో పాల్గొన్నట్టు చరిత్ర చెబుతోంది. గంగులు దొర జీవిత చరిత్రను వెలుగులోకి తేవాలి. నేడు పోలవరం, కంతనపల్లి ప్రాజెక్టుల వల్ల కోయ గిరిజనులు నిర్వాసితులు కాకుండా, అలాగే యురేనియం తవ్వకాల వల్ల చెంచులు సంక్షోభంలో చిక్కుకోకుండా ఉద్యమిస్తేనే మహోజ్వాల సమాజాన్ని స్వప్నించిన ఆ మహా యోధుడు సోయం గంగులు దొరకు ఘన నివాళి అర్పించినట్లవుతుంది.

సెల్ : 7989134271

epaper.navatelangana.com

జకోవిచ్‌కు జపాన్ టైటిల్

● ఫైనల్లో మిల్‌మాన్‌పై విజయం

టోక్యో : వరల్డ్ నం.1 నొవాక్ జకోవిచ్ (సెర్బియా) జపాన్ ఓపెన్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. భుజం గాయంతో యు.ఎస్ ఓపెన్ నాల్గో రౌండ్ నుంచే తప్పుకున్న జకోవిచ్.. ఫిట్‌నెస్ సాధించిన తర్వాత తొలిసారి బరిలోకి దిగాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా ఆటగాడు జాన్ మిల్‌మాన్‌పై 6-3, 6-2తో జకోవిచ్ వరుస సెట్లలో విజయం సాధించాడు. అరంగేట్ర టోర్నీలోనే టైటిల్ సొంతం చేసుకోవటం జకోవిచ్‌కు పదోసారి. తొలిసారి జపాన్ ఓపెన్‌లో తలపడిన జకోవిచ్ కెరీర్ 76వ ఏటీపీ టైటిల్ గెల్చుకున్నాడు. 69 నిమిషాల్లోనే విజయం అందుకున్న జకోవిచ్‌కు తుది సమరంలో పెద్దగా పోటీ ఎదురు కాలేదు. జాన్ మిల్‌మాన్ ప్రతిఘటించలేదు. ఒక్క సెట్ కూడా కోల్పోకుండా జకోవిచ్ సులువైన విజయం సాధించాడు.

స్వింగ్, స్పిన్‌కు సఫారీ ఖతం

విశాఖ టెస్టు టీమ్ ఇండియా వశం. పేసర్ మహ్మద్ షమి (5/35), స్పిన్నర్ రవీంద్ర జడేజా (4/87) విజృంభణతో ఛేదనలో సఫారీ విలవిల్లాడింది. 395 పరుగుల రికార్డు లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 191 పరుగులకే కుప్పకూలింది. మహ్మద్ షమి నిప్పు రవ్వల్లాంటి బంతులతో బ్యాట్స్‌మన్‌ను ఖంగుతినిపించగా.. జడేజా మాయా వలలో సఫారీ కొట్టుమిట్టాడింది. విశాఖ టెస్టులో భారత్ 203 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్స్‌లో వరుసగా మూడో విజయం నమోదు చేసింది. 160 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మ్యాచ్ సాగేకొద్దీ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. సఫారీ మదిలో ఎదురుదాడి ఆలోచన. తొలి ఓవర్లోనే షమిపై ఏడు పరుగులు రాబట్టుకున్నారు. దీంతో ఆఖరు రోజు తొలి ఓవర్ నుంచీ ఆసక్తి ఎక్కువైంది. సఫారీ ఆశలను షమి, జడేజా ఎంతోసేపు నిలువనీయలేదు. ఉదయం సెషన్లో పిచ్ స్వభావాన్ని సంపూర్ణంగా వినియోగించుకున్నారు. స్వింగ్, బౌన్స్‌తో పాటు లెంగ్త్‌లోనూ కచ్చితత్వం పాటించి వికెట్లపైకి దండయాత్ర చేశారు. పాత బంతితో షమి సూపర్ హిట్టు కొట్టగా, జడేజా ఒకే ఓవర్లో మూడు వికెట్లతో మాయ చేశాడు. తొలి టెస్టు విజయంతో భారత్ ఫ్రీడం సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. రెండో టెస్టు పుణె వేదికగా అక్టోబర్ 10 నుంచి ఆరంభం.

- నిప్పులు చెరిగిన మహ్మద్ షమి
- రవీంద్ర జడేజా మాయాజాలం
- ఛేదనలో దక్షిణాఫ్రికా 191 ఆలౌట్
- 203 పరుగుల తేడాతో భారత్ గెలుపు
- 1-0తో ఫ్రీడం సిరీస్‌లో ఆధిక్యం

శ్రీనివాస్ దాస్ మంతటి
నవతెలంగాణ - విశాఖపట్నం

ఫ్రీడం సిరీస్ తొలి టెస్టులో భారత్ 203 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పేసర్ మహ్మద్ షమి (5/35), స్పిన్నర్ రవీంద్ర జడేజా (4/87) చెలరేగారు. ఛేదనలో దక్షిణాఫ్రికా 191 పరుగులకు కుప్పకూలింది. 78/8తో ఓటమి అంచుల్లో నిలిచిన దక్షిణాఫ్రికా, టెయిలెండర్లు డేన్ పీట్ (56, 107 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), సెనురన్ ముతుసామి (49, 108 బంతుల్లో 5 ఫోర్లు) తొమ్మిదో వికెట్‌కు 91 పరుగులు జోడించారు. కోహ్లిసేన విజయాన్ని లంచ్ సెషన్‌కు వాయిదా వేశారు. 11/1తో ఐదో రోజు ఆటకు వచ్చిన దక్షిణాఫ్రికా ఉదయం సెషన్లోనే ఏడు వికెట్లు కోల్పోయింది. రబాడ వికెట్‌తో 63.5 ఓవర్లలో మహ్మద్ షమి లాంఛనం ముగించాడు. సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. మూడు మ్యాచుల సిరీస్‌లో తర్వాతి టెస్టులు వరుసగా పుణె, రాంచీ వేదికగా జరుగనున్నాయి. ఓపెనర్‌గా అరంగేట్ర టెస్టులోనే రెండు శతకాలు సాధించిన రోహిత్ శర్మ ' మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో అశ్విన్ ఏడు వికెట్లు కూల్చగా.. రెండో ఇన్నింగ్స్‌లో మహ్మద్ షమి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. రవీంద్ర జడేజా మ్యాచ్‌లో ఆరు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.

ఇటు షమి, అటు జడేజా

ఓవర్‌నైట్ స్కోరు 11/1తో ఐదో రోజు ఛేదన పునఃప్రారంభించింది దక్షిణాఫ్రికా. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ తొలి ఓవర్లోనే సఫారీ పతనానికి నాంది పలికాడు. డీ బ్రూయిన్ (10)ను బుట్టలో వేసుకున్నాడు. ఆఫ్ కట్‌కు ప్రయత్నించిన బ్రూయిన్.. బంతి లోపలకు దూసుకొచ్చేసరికి ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఈ వికెట్‌తో అశ్విన్.. 66 టెస్టుల్లోనే 350 వికెట్లు కూల్చిన దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ సరసన నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ తీయని సీమర్ మహ్మద్ షమి ఆఖరు రోజు అదరగొట్టాడు. బంతిని వికెట్‌కు ఇరు వైపులా స్వింగ్ చేసేలా కనిపించిన మహ్మద్ షమి తక్కువ బౌన్స్‌తో తెంబ బవుమా (0) వికెట్లను గిరాటేశాడు. షమి నుంచి అప్పటికే ఆ తరహా బంతిని ఎదుర్కొన్న బవుమా.. ఊహికందని లో బౌన్స్ బాల్‌తో వికెట్‌తో పాటు తనూ పిచ్‌పై పడిపోయాడు. బవుమా వికెట్ తీసిన తీరు ఐదో రోజు ఆటలో హైలైట్.

కెప్టెన్ డుప్లెసిస్ (13, 26 బంతుల్లో 3 ఫోర్లు)తో కలిసి ఓపెనర్ ఎడెన్ మార్క్‌రం (39, 74 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) పది ఓవర్ల పాటు వికెట్ల పతనాన్నిన అడ్డుకున్నారు. ఈ సమయంలో మరోసారి మహ్మద్ షమి బంతి అందుకుని, కథ తిరగరాశాడు. వికెట్లకు నేరుగా బంతులేసిన మహ్మద్ షమి బౌన్సర్లతో పాటు సర్‌ప్రైజ్ కిల్లర్ లో బౌన్స్‌తో డుప్లెసిస్, క్వింటన్ డికాక్ (0)లను వరుస ఓవర్లలో వెనక్కి పంపాడు. బవుమా, డుప్లెసిస్, డికాక్‌లను ఒకే తరహా బంతులతో మహ్మద్ షమి క్లీన్‌బౌల్డ్‌గా సాగనంపాడు. ఆ తర్వాత లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా మాయాజాలం మొదలైంది. ఒకే ఓవర్లో మూడు వికెట్లు కూల్చి సఫారీ పతనాన్ని శాసించాడు. నాల్గో రోజు ఆఖర్లో డీన్ ఎల్గార్ (2)ను అవుట్ చేసిన జడేజా.. మరో ఓపెనర్ ఎడెన్ మార్క్‌రం (39)ను సూపర్బ్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేశాడు. వెర్నన్ ఫిలాండర్ (0), కేశవ్ మహరాజ్ (0)లను ఒకే తరహా బంతితో జడేజా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. 70/8తో దక్షిణాఫ్రికా లంచ్ లోపే కుప్పకూలేలా కనిపించింది. మహ్మద్ షమి ఒకే తరహా బంతితో మూడు వికెట్లు తీయగా.. జడేజా వరుస బంతుల్లో ఒకే రీతిలో రెండు వికెట్లు పడగొట్టాడు.

విసిగించిన పీట్, ముతుస్వామి

100 లోపే ఆలౌటయ్యేలా కనిపించిన దక్షిణాఫ్రికాను టెయిలెండర్లు ఆదుకున్నారు. టాప్ ఆర్డర్‌ను టపటపా కూల్చేసిన బౌలర్లు.. మరోసారి తోక కత్తిరించేందుకు ఇబ్బంది పడ్డారు. సెనురన్ ముతుసామి (49 నాటౌట్, 108 బంతుల్లో 5 ఫోర్లు), డేన్ పీట్ (56, 107 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) 9వ వికెట్‌కు ఏకంగా 91 పరుగులు జోడించారు. సుమారు 32 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన ఈ జోడీ భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించింది. పీట్ అర్ధ సెంచరీ కొట్టగా, ముతుసామి 50 మార్క్‌కు చేరవయ్యాడు. డేన్ పీట్‌ను ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో షమి బౌల్డ్ చేసి విసిగించిన జోడీని విడదీశాడు. కగిసో రబాడ (18) మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ధనాధన్ ఆడాడు. రబాడను వికెట్ల వెనకాల క్యాచ్‌తో వెనక్కి పంపిన మహ్మద్ షమి ఐదు వికెట్ల ప్రదర్శనతో పాటు విశాఖ టెస్టులో గెలుపు క్రతువు పూర్తి చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 37 పరుగులతో అజేయంగా నిలిచిన సెనురన్ ముతుసామి, రెండో ఇన్నింగ్స్‌లో 49 పరుగుల వద్ద నాటౌట్‌గా నిలిచాడు.

స్కోరు వివరాలు :
భారత్ తొలి ఇన్నింగ్స్ : 502/7 డిక్లేర్డ్
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 431 ఆలౌట్
భారత్ రెండో ఇన్నింగ్స్ : 323/4 డిక్లేర్డ్

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : ఎడెన్ మార్క్‌రం (సి,బి) రవీంద్ర జడేజా 39, డీన్ ఎల్గార్ (ఎల్బీ) రవీంద్ర జడేజా 2, డీ బ్రూయిన్ (బి) అశ్విన్ 10, తెంబ బవుమా (బి) మహ్మద్ షమి 0, డుప్లెసిస్ (బి) మహ్మద్ షమి 13, క్వింటన్ డికాక్ (బి) మహ్మద్ షమి 0, సెనురన్ ముతుసామి నాటౌట్ 49, వెర్నన్ ఫిలాండర్ (ఎల్బీ) రవీంద్ర జడేజా 0, కేశవ్ మహరాజ్ (ఎల్బీ) రవీంద్ర జడేజా 0, డేన్ పీట్ (బి) మహ్మద్ షమి 56, కగిసో రబాడ (సి) సాహా (బి) షమి 18, ఎక్స్‌ట్రాలు : 04, **మొత్తం : (63.5 ఓవర్లలో ఆలౌట్) 191.**

వికెట్ల పతనం : 1-4, 2-19, 3-20, 4-52, 5-60, 6-70, 7-70, 8-70, 9-161-10-191.

బౌలింగ్ : రవిచంద్రన్ అశ్విన్ 20-5-44-1, రవీంద్ర జడేజా 25-6-87-4, మహ్మద్ షమి 10.5-2-35-5, ఇషాంత్ శర్మ 7-2-18-0, రోహిత్ శర్మ 1-0-3-0.

1 దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ సరసన అశ్విన్ నిలిచాడు. 350 వికెట్ల మైలురాయి అందుకున్న అశ్విన్‌కు ఇది 66వ టెస్టు మ్యాచ్. మురళీధరన్ సైతం 66వ టెస్టులోనే 350 వికెట్లు తీశాడు. వేగంగా 250 వికెట్ల రికార్డు సైతం అశ్విన్ (37)పేరిట ఉన్న సంగతి తెలిసిందే.

3 టెస్టుల్లో 200 ప్లస్ పరుగుల తేడాతో విజయం సాధించటం భారత జట్టుకు ఇది వరుసగా మూడోసారి కావటం విశేషం.

4 రెండో ఇన్నింగ్స్‌లో మహ్మద్ షమి ప్రమాదకర సీమర్. కెరీర్‌లో ఐదు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా.. నాలుగుసార్లు రెండో ఇన్నింగ్స్‌లోనే కూల్చాడు. వైజాగ్ టెస్టులో షమి 5 వికెట్లు తీశాడు.

37 విశాఖ మ్యాచ్‌తో అత్యధిక సిక్సర్ల రికార్డు రోహిత్ శర్మ (13) సొంతమైంది. ఓ మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లతోనూ విశాఖ రికార్డు సృష్టించింది. భారత్, దక్షిణాఫ్రికా ఏకంగా 37 సిక్సర్లు కొట్టాయి.

స్వేచ్ఛగా జయించారు

నవతెలంగాణ - విశాఖపట్నం

2015 నుంచి భారత్‌లో ఓ టెస్టు నాల్గో ఇన్నింగ్స్‌లో రెండు జట్లు మాత్రమే 100కు పైగా ఓవర్లు ఆడాయి. 2017లో శ్రీలంక 100 ప్లస్ ఓవర్ల ప్రతిఘటనతో డ్రా చేసుకుంది. 2015 ఢిల్లీ టెస్టులో దక్షిణాఫ్రికా 143.1 ఓవర్ల పాటు సహనం చూపించింది. అయినా, 143 పరుగుల తేడాతో ఓటమి తప్పలేదు. స్పిన్ స్వర్గధామం ఉపఖండం పిచ్‌లపై నాల్గో ఇన్నింగ్స్‌లో పరుగులు సాధనతో పాటు వికెట్ కాపాడుకోవటం కత్తి మీద సామే. విశాఖ టెస్టులో దక్షిణాఫ్రికాకు 395 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది భారత్. అయినా, ఏదో కోశాన ఆందోళన. ఎందుకంటే విశాఖ టెస్టు నాలుగు రోజుల్లో పరుగుల ప్రవాహాన్ని చూసింది. ప్రత్యేకించి 3, 4 రోజుల ఆటలో 343, 369 పరుగులు నమోదయ్యాయి. దీంతో సహజసిద్ధ స్పిన్ పని చేయగలదా? సఫారీ ప్రతిఘటనకు పూనుకుంటే పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు ఉదయించాయి. కోహ్లిసేన ఈ ఆందోళనకు తొలి సెషన్‌లోనే మంగళం పాడేసింది. సీమ్‌తో మహ్మద్ షమి, స్పిన్‌తో రవీంద్ర జడేజా విశ్వరూపం దాల్చగా, గాంధీ-మండేలా ఫ్రీడం సిరీస్ తొలి టెస్టులో దక్షిణాఫ్రికాను భారత్ స్వేచ్ఛగా జయించింది.

విశాఖ పిచ్‌పై ధారాళంగా పరుగులు వచ్చినా, ఓ విషయంలో పిచ్ నిలకడ చూపింది. ఉదయం సెషన్‌లో పరుగులు ఏ రోజులోనూ అంత సులువుగా రాలేదు. ఈ సెషన్‌లో బంతి లో లెంగ్త్‌లో ఉంచగలిగితే బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టగలమని భారత్ భావన. తొలి ఇన్నింగ్స్‌లో మహ్మద్ షమి వికెట్ పడగొట్టకపోయినా, ఆఖరు రోజు షమి అత్యంత ప్రమాదకారి. ఐదో రోజు తొలి ఓవర్ వేసిన మహ్మద్ షమిపై ఓ ఫోర్‌తో దక్షిణాఫ్రికా 7 పరుగులు చేసింది. తొలి ఓవర్లోనే 7 పరుగులతో సఫారీ ఎదురుదాడి చేయనుందా? అనే ఆసక్తి నెలకొంది. తర్వాతి ఓవర్లో అశ్విన్ వికెట్ల వేటకు తెరతీయగా.. మహ్మద్ షమి, రవీంద్ర జడేజాలు మరో స్థాయికి తీసుకెళ్లారు. మహ్మద్ షమి వికెట్ టు వికెట్ బంతులు సంధించాడు. ఆఫ్ సైడ్ వైడ్ బంతులతో పాటు బౌన్సర్లు సైతం విసిరాడు. ఇదే సమయంలో అతి తక్కువ బౌన్స్‌తో వికెట్లపైకి దూసుకెళ్లాడు. షమి నుంచి అధిక బౌన్స్ అంచనా వేసిన బవుమా.. ఊహించని పరిణామంతో ఖిన్నుడయ్యాడు. సఫారీ కెప్టెన్ డుప్లెసిస్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్‌లకూ ఇదే బంతి సంధించిన షమి వికెట్లను గాల్లోకి లేపాడు. రవీంద్ర జడేజా ఫ్లాట్ బంతులు, క్విక్ పేస్‌తో ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టాడు. తొలి సెషన్లోనే 7 వికెట్లు కూల్చిన కోహ్లిసేన ఘన విజయానికి రంగం సిద్ధం చేసుకుంది. తోక మరోసారి భారత్ సహనాన్ని పరీక్షించినా.. స్వేచ్ఛా విజయాన్ని అడ్డుకోలేదు. దక్షిణాఫ్రికా క్రికెట్‌లో దిగ్గజాలు ఏబీ డివిలియర్స్, హషీమ్లా, డెల్ స్టెయిన్ రిటైర్మెంట్‌తో సఫారీ జట్టులో పస తగ్గిన మాట వాస్తవం. ఈ ముగ్గురు దిగ్గజాలతో కూడిన జట్టుతో దక్షిణాఫ్రికా 2015లో భారత పర్యటనకు వచ్చింది. రెండో ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 185 (నాగ్‌పూర్), 143 (న్యూఢిల్లీ), 109 (మొహాలీ) పరుగులే చేసింది. అనుభవం లేని ప్రస్తుత దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులు సహా ఛేదనలో 191 పరుగులు చేసింది. టీమ్ ఇండియా తిరుగులేని విజయం సాధించినా, సఫారీ పోరాటతత్వం విడిచిపెట్టలేదని చెప్పవచ్చు. తొలి టెస్టు విజయంతో సొంతగడ్డపై వరుసగా 11వ సిరీస్ సాధించేందుకు కోహ్లిసేన అడుగు ముందుకు వేసింది.

'తొలి మూడు రోజులు పిచ్ బాగుంది. ఓ సెషన్‌లో వెనుకంజ వేశాం, అది కొంత కఠినం. 500 కొట్టినప్పుడు పుంజుకోవటం ప్రత్యర్థికి ఎప్పుడూ కష్టమే. రోహిత్, మయాంగ్ అద్భుతంగా ఆడారు. రెండో ఇన్నింగ్స్‌లో పుజార ఇన్నింగ్స్ సూపర్. పరిస్థితులు, పిచ్ నెమ్మదిగా స్పందించటంతో పరుగులు చేయటం కష్టం. చిన్న స్పెల్స్ వేసినా, భారత్‌లోనూ పేసర్లు వికెట్లు తీస్తున్నారు. కొంత కాలంగా రెండో ఇన్నింగ్స్‌లో మా వికెట్ల వేటగాడు మహ్మద్ షమి. స్పిన్నర్లు అశ్విన్, జడేజా ఎప్పట్లాగానే మెప్పించారు'

- విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

మధ్యంతర ఉత్తర్వులు వద్దు

...ఇస్తే సమ్మె విరమిస్తారు !

- హైకోర్టులో సర్కారు వాదనలు
- కౌంటర్లు వేయాలని డివిజన్ బెంచ్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ సమ్మె విషయంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే.. దానిని అడ్డం పెట్టుకుని సమ్మెను విరమించాలనే ఆలోచనలో ఆ సంస్థ ఉద్యోగులు, కార్మికులు ఉన్నారని ప్రభుత్వం హైకోర్టులో వాదించింది. ఏలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని గట్టిగా చెప్పింది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. ఆర్టీసీలో గతంలో పది వేల బస్సులు నడిపితే, ఇప్పుడు ఏకంగా 11 వేల బస్సుల్ని నడుపుతున్నాం. ఆర్టీసీ సమ్మె చట్ట వ్యతిరేకం. ఈ వివాదంపై కార్మిక వివాదాల పరిష్కారానికి అధీకృత అధికారుల వద్ద తేల్చుకోవాలి. అందుకే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదు. ఇస్తే కనుక వెంటనే దీనిని సాకుగా చూపి సమ్మె విరమణకు ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాలు సిద్ధంగా ఉన్నారు.. అని హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదనలను వినిపించింది. ఆర్టీసీ సమ్మె వల్ల సామాన్య ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని, సమ్మె విరమణకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయ రీసెర్చ్ స్కాలర్ ఆర్.సుబేందర్‌సింగ్ దాఖలు చేసిన అత్యవసర హౌస్ మోషన్ పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్ పిటిషన్‌ను ఆదివారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. కుందన్‌బాగ్‌లోని జడ్జి ఇంట్లో పిల్‌పై విచారణ జరిగింది. ఆర్టీసీని సర్కార్‌లో విలీనం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఆరేండ్లయినా అమలు చేయలేదని పిటిషనర్ తరపు లాయర్ పి.వి.కృష్ణయ్య వాదించారు. ఎక్కడైనా సమ్మె చేసే వాళ్లతో చర్చలకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని, అయితే చర్చల కోసం సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేష్‌కుమార్ అధ్యక్షతన ఉన్న ముగ్గురు సభ్యుల కమిటీని ప్రభుత్వం రద్దు చేయడం సబబుకాదన్నారు. సమస్యను ప్రజల కోణంలో చూడాలన్నారు. సమ్మె వల్ల సాధారణ ప్రజానీకం ఇక్కట్లకు గురవుతున్న నేపథ్యంలో, తక్షణమే సమ్మె విరమణకు మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. గతంలో ఇదే మాదిరిగా 2015లో హైకోర్టు ఇదే తరహాలో ఉత్తర్వులిచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన దసరా సెలవుల తరుణంలో సమ్మె చేయడం వల్ల స్వగ్రామాలకు వెళ్లే వాళ్లు నానా ఇక్కట్లకు ఎదుర్కొంటున్నారని, దసరా సెలవుల తర్వాత విద్యార్థుల సమస్యల్ని వర్ణించలేమన్నారు. గ్రామాల్లో పేదలు, రోగులకు ఆర్టీసీనే ప్రధాన రవాణా వనరుగా చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై అధ్యయనం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..ఏజీ

సమ్మె విషయమై సర్కార్ తరపున ఏజీ బి.ఎస్.ప్రసాద్, అదనపు ఏజీ జె.రామచందర్‌రావులు వాదించారు. సమ్మె జరుగుతున్నందున ప్రయాణికులకు అవస్థలు ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. ఆర్టీసీలో 10 వేల బస్సులుంటే ఇప్పుడు 11 వేల బస్సులు నడుపుతున్నాం... అని చెప్పారు. ఇదెట్లా సాధ్యమని డివిజన్ బెంచ్ ప్రశ్నించింది. ఆర్టీసీలోని అద్దెబస్సులకు ప్రయివేటు, బడి బస్సులకు రూట్ సర్వీస్ పరిష్కన్లు ఇచ్చాం. ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. ఆర్టీసీ సమ్మె దసరా సమయంలో చేయడం దారుణం. చట్ట విరుద్ధం కూడా. దీనిపై లేబర్ యాక్ట్ ప్రకారం సంబంధిత అధికారుల దగ్గర తేల్చుకోవాలి. పిటిషనర్‌కు కూడా ఆర్టీసీ సంఘాల వాళ్లతో సంబంధాలున్నాయి. ఈ పిల్‌లో కనుక హైకోర్టు మధ్యంతర ఆదేశాలు ఇస్తే చాలు అనే ధోరణిలో సమ్మె చేస్తున్న సంఘాలున్నాయి. ఏమీ ఉత్తర్వులు ఇవ్వొద్దు. ఒకవేళ మధ్యంతర ఉత్తర్వులు వెలువరిస్తే.. వెంటనే సమ్మె విరమణకు సిద్ధంగా ఉన్నాయి... అని వాదించారు.

కౌంటర్లు వేయండి: ఇరుపక్షాలకు హైకోర్టు ఆదేశం

ఇరుపక్షాల వాదనల అనంతరం డివిజన్ బెంచ్, సమ్మెపై అన్ని వివరాలతో కూడిన కౌంటర్ పిటిషన్లు వేయాలని ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి/కమిషనర్, ఆర్టీసీ ఎండీ, కార్మిక శాఖ కమిషనర్, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 10కి వాయిదా వేసింది.

పిల్‌లో ముఖ్యాంశాలివీ..

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా రవాణా సౌకర్యం కల్పించడం ఆర్టీసీ ధ్యేయం. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా టిక్కెట్ల ధరలున్నాయి. ఆర్టీసీ బస్సులపైనే ఎంతోమంది విద్యార్థులు, వైద్య సేవల కోసం వినియోగిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని టీఆర్ఎస్ పార్టీ అప్పట్లో హామీ ఇచ్చింది. ఇతర పార్టీలు కూడా చెప్పాయి. సీఎం కేసీఆర్ కూడా హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఇదే సమయంలో ఏపీలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని అక్కడి క్యాబినెట్ నిర్ణయించింది. తెలంగాణలోనూ ఆర్టీసీని ప్రభుత్వపరం చేయాలనేది కార్మికుల డిమాండ్లల్లో ప్రధానమైనది. సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చాక జరిపిన చర్చలు విఫలం కావడంతో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీని సైతం ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో కార్మికులు ఈ 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మె బాట పట్టారు. సమ్మె చట్ట వ్యతిరేకమని ప్రభుత్వం ప్రకటించింది. తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది.రోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజానీకం సమ్మె వల్ల ఇబ్బందులు పడుతున్నారు. రాజ్యాంగంలోని 14, 19, 21 అధికరణాల ప్రకారం సమ్మె చట్ట విరుద్ధంగా ప్రకటించాలి. ప్రభుత్వం ప్రయాణీకులకు సరిపడేలా సౌకర్యాలు కల్పించలేదు. సమ్మె విరమణకు ఉత్తర్వులు ఇవ్వాలి. ఇదే సమయంలో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లలో న్యాయమైన వాటిని అమలు చేసేందుకు సర్కార్ ఒక కమిటీని ఏర్పాటు చేయాలి.. అని పిల్‌లో పిటిషనర్ కోరారు.

క్రీడా శాఖ శిక్ష కాదు

● మంత్రి కిరణ్ రిజ్జు వ్యాఖ్య

న్యూఢిల్లీ : రాజకీయ నాయకులు ఎవరైనా ప్రభుత్వంలో ఆర్థిక శాఖ, రెవెన్యూ శాఖ మంత్రిగా ఉండేందుకు ఇష్టపడతారు. క్రీడా శాఖ అంటే పనిష్‌మెంట్ (శిక్ష) అనే భావన ఉన్న మాట వాస్తవమే. కానీ నేను నా విభాగంలో విధులను ఆస్వాదిస్తున్నాను. క్రీడా శాఖ అంటే ద్వితీయ ప్రాధాన్యం అనే ఆలోచన తీసేయండి అని కేంద్ర క్రీడా శాఖ మంత్రి కిరణ్ రిజ్జు వ్యాఖ్యానించారు. ఓ ఆంగ్ల పత్రిక ఇష్టాగోష్ఠిలో రిజ్జు ఈ వ్యాఖ్యలు చేశారు. ' ముంబయి వంటి నగరాల్లో క్రీడలకు సరైన సదుపాయాలు, మైదానాలు లేవు. కార్పోరేట్లు ఈ విషయంలో ముందుకు రావాలి. కర్నాటకలో జెఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సెంటర్‌ను సందర్శించాను. అత్యుత్తమ వసతలతో కూడిన కేంద్రం అది. రాత్రికి రాత్రి చాంపియన్లను తయారు చేయలేం. కానీ చాంపియన్లను తయారు చేసే వాతావరణం సృష్టించాలి. నేను క్రీడా మంత్రిగా వచ్చిన తొలినాళ్లలో 2013లో ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలు ఇంకా ఇవ్వలేదని అథ్లెట్ల నుంచి ఫిర్యాదు వచ్చింది. అప్పుడే ఓ నిర్ణయం తీసుకున్నాను. క్రీడాకారుడు పతకం నెగ్గినప్పుడు, అతడు స్వదేశానికి చేరుకునేలోపే ఈ ప్రక్రియ ముగించి.. విమానాశ్రయం నుంచి రాగానే ప్రత్యేక కార్యక్రమంలో నగదు బహుమానం అందిస్తున్నాం. అన్ని నగరాల్లో క్రీడా వసతులు కల్పించేందుకు కార్పోరేట్ల సహకారం కోరుతున్నాం' అని మంత్రి అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

epaper.navatelangana.com